RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



30 జనవరి 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:205

## జయహో భారత్...

**జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ గగనతల ప్రయోగం విజయవంతం...**

**అంబరాన్నంటిన శాస్త్రవేత్తల సంబరాలు**




శ్రీహరికోటఇస్రో భారత అంతరిక్షంలో మరో మైలురాయిని చేరుకుంది. శ్రీహరికోటలోని షార్ నుంచి తన వందో ప్రయోగమైన జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ను నేటి బుధవారం ఉదయం 6.23 గం.లకు రోదసిలోకి సక్సెస్ ఫుల్ గా దేశీయంగా రూపొందించిన ఈ క్రయోజనిక్ రాకెట్ ద్వారా ఎన్వీఎస్-02 ఉపగ్రహాన్ని అంతరిక్షంలోకి పంపి భారత కీర్తిని మరింత ఇనుమడింప చేసింది. జీఎస్ఎల్వీ-ఎఫ్15 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తల సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలను సిబ్బందిని న ఇస్రో ఛైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ అభినందించారు.

ఇస్రో తన వందో రాకెట్ ప్రయోగం శ్రీహరికోట షార్ - సతీష్ ధావన్ స్పేస్ రీసెర్చ్ సెంటర్ నుండి చేపట్టిన నేపథ్యంలో సూళ్లూరుపేట పట్టణంలోని విద్యార్థినీ విద్యార్థులు సుమారు 500 మందిని గ్యాలరీ నందు వీక్షించే విధంగా ఏర్పాటుతో, అలాగే తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ దంపతులు సైన్స్ ఫెయిర్ నందు అద్భుతమైన ప్రతిభ కనబరచిన సూళ్లూరుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ఎస్.కె ఆఫ్రీద్ 9 వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్ హిమ హన్షిని పదవ తరగతి విద్యార్థినిని ఇస్రో రాకెట్ ప్రయోగ వీక్షణకు తమతో పాటు తీసుకుని వెళ్లారు. అబ్బురపరిచే విధంగా ఇస్రో తన వందో రాకెట్ నేటి బుధవారం ఉదయం తెల్లవారుజామున 6.23 గం.లకు షార్ శ్రీహరికోట నుండి గగనతలంలోకి విజయవంతంగా పంపిన కార్యక్రమాన్ని వారు వీక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ మరియు డైరెక్టర్ షార్ సైంటిస్ట్ ఎ.రాజరాజన్ మరియు శాస్త్ర వేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలిపి చైర్మన్ ,డైరెక్టర్ షార్ వారితో కలిసి ఫోటోలో పాలుపంచుకున్నారు. భారత కీర్తిని ప్రపంచ పటంలో ఉన్నత స్థానంలో నిలుపుతున్న ఇస్రో మరియు వారి బృందాన్ని కలెక్టర్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ సూళ్లూరుపేట కిరణ్మయి కూడా ఉన్నారు.

### ఇస్రో ప్రయోగం విజయవంతం పై సీఎం రేవంత్ హర్షం

హైదరాబాద్ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 100వ ప్రయోగం విజయవంతం కావడం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిరు హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని అభివర్ణించారు. మిషన్ విజయవంతం కావడానికి అంకితభావంతో కృషి చేసిన ఇస్రో బృందాన్ని సీఎం అభినందించారు. శ్రీహరికోటలోని షార్ కేంద్రం నుంచి ఇస్రో ప్రయోగించిన జీఎస్ఎల్వీ ? ఎఫ్15 రాకెట్ నావిగేషన్ ఉపగ్రహం ఎన్వీఎస్ - 02ను నిర్ణీత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ 100వ మైలురాయిని చేరుకోవడం భారతదేశ అంతరిక్ష కార్యక్రమం పటిమను ప్రపంచానికి చాటినట్లయిందని ముఖ్యమంత్రి ప్రశంసించారు

# కుల గణనకు జాతీయ స్థాయిలో ప్రశంసలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్రంలో విజయవంతంగా పూర్తి చేసిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల గణన (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే 2024) కు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో నిర్వహించిన సమగ్ర కుల గణనపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు.

ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ , ధనసరి సీతక్క , పొంగులేటి శ్రీనివాసరెడ్డి , ప్రభుత్వ సలహాదారులు కే.కేశవరావు , మాజీ మంత్రి జానారెడ్డి , ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గారు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో చేపట్టిన ఇంటింటి సర్వే దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించిందని చెప్పారు. సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అభినందించారు. సర్వేకు సంబంధించి డేటా ఎంట్రీ పూర్తయిందని, ముసాయిదా సిద్ధమైందని అధికారులు వివరించారు.

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి ఫిబ్రవరి 2 వ తేదీలోగా నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన బీసీ డెడికేటేడ్ కమిషన్‌కు ఈ గణాంకాలు ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కుల గణన ప్రక్రియ సామాజిక సాధికారతతో పాటు, భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బలహీన వర్గాలందరి అభ్యున్నతికి ఉపయోగపడుతుందని అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ కుల గణన సర్వేను చేపట్టి తమ చిత్తశుద్ధిని చాటుకుందని చెప్పారు.

రాష్ట్రంలో గత ఏడాది నవంబర్ 6 వ తేదీన ఈ సర్వే ప్రారంభం కాగా, అన్ని జిల్లాల్లో డిసెంబర్ మొదటి వారం నాటికి సర్వే పూర్తయింది. ప్రణాళిక విభాగం అధ్వర్యంలో చేపట్టిన ఈ ఇంటింటి సర్వే మహా యజ్ఞంలో ఎన్యుమరేటర్లు, సూపర్? వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు దాదాపు లక్ష మందికిపైగా ఉద్యోగులు పాలుపంచుకున్నారు.

రాష్ట్రంలోని దాదాపు 1.16 కోట్ల కుటుంబాలను సర్వేకు గుర్తించగా, ఎన్యుమరేటర్లను ఇంటింటికీ పంపించి వివరాలను సేకరించింది. దాదాపు 96 శాతానికి పైగా కుటుంబాల వివరాలను సర్వే బృందాలు విజయవంతంగా సేకరించాయి. వీటికి సంబంధించిన డేటా ఎంట్రీని పూర్తి చేశాయి.

కొన్ని చోట్ల కుటుంబాలు సర్వేకు నిరాకరించటం, కొన్ని ఇండ్లకు తాళాలు ఉండటం, కొన్ని కుటుంబాలు అందుబాటులో లేకపోవటం తదితర కారణాలతో కొన్ని కుటుంబాలు సర్వేలో పాలుపంచుకోలేదని అధికారులు సమావేశంలో వివరించారు.అధికారం చేపట్టిన రెండు నెలల్లోనే ఫిబ్రవరి 4వ తేదీన సీఎం నేతృత్వంలో భేటీ అయిన రాష్ట్ర మంత్రివర్గం ఇంటింటి సర్వే ద్వారా కుల గణన చేసేందుకు నిర్ణయం తీసుకుంది. ఫిబ్రవరి 16వ తేదీన ఈ సర్వే చేపట్టేందుకు అసెంబ్లీలో ప్రభుత్వం తీర్మానం చేసింది.

## మహాకుంభమేళలో తొక్కిసలాట...



వార్తా 2 లో

**మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన మాస్టర్ మైండ్స్ స్కూల్స్ అధినేతలు**

వార్తా 11 లో

## సర్పంచ్ ఎన్నికలపై సీఎం రేవంత్ కీలక నిర్ణయం

హైదరాబాద్ తెలంగాణ పల్లెల్లో సర్పంచ్ ఎంపీటీసీ జెడ్పీటీసీ ఎన్నికల హడావుడి మొదలైంది సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వస్తుందా అని పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.నాయకులు గ్రామాల్లోనే మకాం వేసి, మంచి చెడులు అన్నిటితో సంబంధం లేకుండా ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ ఓటర్లతో సాన్నిహిత్యం పెంచుకుంటున్నారు. అంతేకాకుండా, గ్రామ అభివృద్ధి హామీలతో మేనిఫెస్టో విడుదల చేసి ప్రజలను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ ఎన్నికల ప్రక్రియ అంతా వచ్చే నెలలోనే పూర్తి అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.సర్పంచ్ ఎన్నికలపై రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకోవడం కోసం సంబంధిత పంచాయితీ రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. ఈ సమీక్షలో ఎన్నికల కార్యాచరణపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈ సమీక్షలో తీసుకున్న నిర్ణయాన్ని ఈసీకి వెల్లడిస్తే. ఎన్నికల సంఘం తేదీలను ఖరారు చేయనుంది. అయితే ఈ ప్రక్రియ అంతా ఫిబ్రవరిలోనే పూర్తి చేసేలా ప్రభుత్వం యోచిస్తున్నట్లు ఊహాగానాలు వెల్లడవుతున్నాయి. మరో ఈ ఎన్నికలతో పాటుగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా ఒకేసారి నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందట.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా పథకాలు జనవరి 26న ప్రారంభమయ్యాయి. పంచాయతీ ఎన్నికలకు ఇది సరైన సమయం కావొచ్చని ఎమ్మెల్యేలు ప్రతిపాదన ఇచ్చినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తుండడంతో రేవంత్ పాలనపై కొంత మేర వ్యతిరేకత వస్తోందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. పథకాలు విడుదల చేసిన వెంటనే ఎన్నికలు నిర్వహిస్తే, లబ్ధిదారుల ఓట్లను క్యాష్ చేసుకోవచ్చనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు తేల్చడం కీలకమైన విషయం. కోర్టు ఆదేశాల ప్రకారం, ప్రభుత్వం ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా అధ్యయనం చేయించింది. కమిషన్ సిద్ధం చేసిన నివేదిక త్వరలో సర్కార్‌కు సమర్పించనున్నారు. ఈ నివేదికపై కేబినెట్ భేటీలో చర్చించి, ఆమోదం పొందిన తర్వాత హైకోర్టుకు సమర్పించే అవకాశం ఉంది.ఇక బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, కమిషన్ నివేదిక ఆధారంగా తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదం కోసం కేంద్రానికి పంపాలని ప్రతిపాదన ఉందని సమాచారం. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే పంచాయతీ ఎన్నికల ప్రక్రియపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వనుంది. అయితే గురువారం సమీక్షలో దీనిపైన కూడా నిర్ణయం తీసుకుని కేంద్రానికి నివేదిక సమర్పించే అవకాశం ఉంది.నోటిఫికేషన్‌పై అంచనాలుఫిబ్రవరి తొలి వారంలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే, దీనిపై అధికారిక సమాచారం త్వరలో రానుంది. గత ఏడాది ఫిబ్రవరి 1న సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది.

**విలేఖరులు కావలెను**

ప్రజాబలం దినపత్రికకు తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో 119 అసెంబ్లీ నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను.

సంప్రదించవలసిన నెంబర్

బ్యూరోఛీఫ్ ఎ.శ్రీనివాస్ 9848384973

ప్రజాబలం దినపత్రిక కార్యాలయం రామ్‌నగర్ హైదరాబాద్.

# ప్రజాబలం

## 30 జనవరి 2025 గురువారం

## అవును నిజం..

## చేదు నిజం!

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈ నెల చివర్లో ప్రారంభమవుతున్నాయి. జనవరి 31న మొదలయ్యే తొలి విడత సమావేశాలు ఫిబ్రవరి 13 వరకు కొనసాగుతాయి. రెండవ విడత సమావేశాలు ఇంచుమించుగా నెల రోజుల తర్వాత మార్చి 10 మొదలై ఏప్రిల్ 4 వరకు కొనసాగుతాయి. తొలి విడత సమావేశాలు ప్రారంభం రోజున, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉభయ సభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసగిస్తారు. మర్నాడు, ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ 2025- 26 కు వార్షిక బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెడతారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం వరుసగా ఇది కావడం ఒక విశేషం అయితే, ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మోడీ 0.3 ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి తొలి బడ్జెట్ కావడం మరో విశేషం. బాగుంది. అయితే, ఇలాంటి విశేషాలు ఎన్నున్నా, పార్లమెంట్' సమావేశాల పనితీరు, 'నానాటికీ తీసికట్టు నాగం భోట్లు' అన్నట్లుగా దిగజారుతోంది. అందుకే, పార్లమెంట్ సమావేశాల పట్ల రాజకీయ వర్గాల్లోనే కాదు, సామాన్యులలో కూడా ఆసక్తి సన్నగిల్లుతోంది. ప్రజా సమస్యలు, ప్రభుత్వ విధానాలను చర్చించి, పరిష్కార మార్గాలు చూపించవలసిన పార్లమెంట్' సమావేశాలు, తెల్ల ఏనుగులను తలపిస్తున్నాయనే విమర్శలను ఎదుర్కొంటున్నాయి. నిజానికి రంగులతో సంబంధం లేకుండా అధికార ప్రతిపక్షాలు రెండూ కూడా పార్లమెంట్‌కు ఇవ్వవలసిన గౌరవం ఇవ్వడం లేదు. ఏదో మొక్కుబడి తంతుగా, సమావేశాలు నిర్వహించడమే కానీ, పద్ధతిగా, ప్రజాస్వామ్య బద్ధంగా సభను నిర్వహించాలనే ఆలోచన, అటూ ఇటూ ఎటు కనిపించడం లేదు. అందుకే, ఎవరికీ వారు, సమావేశాల క్రతువను 'మమ' అనిపించి, ఓ పనైపోయింది అని అనుకుంటున్నారు. అందుకే, ప్రజల్లోనూ పార్లమెంట్, సమావేశాల పట్ల ముందున్న ఆసక్తి ఇప్పుడు కనిపించడం లేదు. సహజంగా పార్లమెంట్ సమావేశాలు, ప్రారంభమవుతున్నాయి అంటే, సమావేశాల్లో ఏయే అంశాలు చర్చకు వస్తాయి, ప్రజాసమస్యలు ఏ మేరకు చర్చకు వస్తాయి, అనే చర్చ జరుగుతుంది. ఇక బడ్జెట్ సమావేశాలు అంటే, వేరే చెప్పనక్కర లేదు. ప్రజలు ఏవేవో ఉహించుకుంటారు, ధరలు, పన్నులు, మౌలిక వసతులు, రాయితీలు ఇలా చాలా చాలా విషయాల్లో చాలా చాలా చర్చ జరురుగుతుంది. నిజానికి, ఇప్పుడు కూడా అలాంటి చర్చ జరుగుతూనే వుంది. అయితే, ఆ చర్చకు విలువ వుందా? గౌరవ పార్లమెంట్ సభ్యులు ప్రజల గళం వినిపించుకుంటారా? ప్రజా సమస్యలను చర్చించి, పరిష్కారాలు చూపుతారా, అసలు పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగుతాయా అంటే, అనుమానం అక్కర లేదు. అందుకే, దేశంలో రాజకీయ విలువలు దినదిన ప్రవర్థమానంగా దిగజారుతున్నాయి'%ా%అనే మాట తరచు వినవలసి వస్తోంది. అవును. ఇది చాలా కాలంగా జరుగుతున్నదే, సర్వత్రా వినిపిస్తున్నదే. అందులో ఎవరికీ ఎలాంటి అనుమానం లేదు. అటు రాజకీయ నాయకులు, ఇటు రాజ్యాంగా నిపుణులు, చివరకు సర్వోన్నత న్యాయస్థానం మొదలు సామాన్య మానవుల వరకు అందరిదీ అదే మాట, అదే అభిప్రాయం. నెహ్రూ నుంచి మోడీ వరకు పాలనా పగ్గాలు ఎవరి చేతిలో ఉన్నా, దేశంలో రాజకీయాలు, రాజకీయ విలువల ఏటికేడాది దిగజారుతూనే ఉన్నాయి. గత సంవత్సరం చివర్లో జరిగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు, ఎంత సుందర ముదనష్టంగా సాగాయో, ఏ స్థాయికి దిగజరాయో, వేరే చెప్పనక్కరలేదు. మన మీద మనకే అసహ్యం కలిగే స్థాయిలో పార్లమెంట్, పార్లమెంట్ ప్రాంగణం వేదికగా అనేక జుగుత్సాకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. గౌరవ ఎంపిలు ఒకరిని ఒకరు తోసుకుని, కొట్టుకుని పార్లమెంట్ ప్రాంగణాన్ని 'పవిత్రం' చేశారు. ఇంత చేసి, చివరకు పార్లమెంట్, శీతాకాల సమావేశాలు ఏమైనా సాధించాయా అంటే. హళ్లికి హళ్లి సున్నకు సున్న. సమావేశాలు ప్రజాధనం వృథా కావడం మినహా మరో ప్రయోజనం జరిగింది లేదు. అవును, గత సంవత్సరం చివర్లో నవంబర్ 25 డిసెంబర్ 20 వరకు జరిగిన పార్లమెంటు శీతాకాల సమావేశాలు, సదరు సంవత్సరంలో జరిగిన సమావేశాల్లో అత్యంత అనుత్పాదక' సమావేశాలుగా ముగిసిపోయాయి. ప్రముఖ వ్యాపారవేత్త అదానీ అస్తుల వివాదంతో మొదలైన శీతాకాల సమావేశాలు, చివరకు రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్'పై హెూం మంత్రి అమిత షా చేసిన వ్యాఖ్యల వివాదంతో ముగిసిపోయాయి. ఇక్కడ ఎవరి వాదన ఏమిటి? ఏది మంచి, ఏది చెడు? అనే విషయాన్ని పక్కనపెడితే, దినదిన ప్రవర్థమానంగా దిగజారుతున్న పార్లమెంట్' పని తీరుకు శీతాకాల సమావేశాలు ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచాయి. ఈ సమావేశాలు, మరో మైలు రాయిని కూడా దాటాయి. ఇంతకు ముందెన్నడూ లేని విధంగా అధికార, ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్ ప్రాంగణంలో, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్' పై తమకు గల గౌరవాన్ని చాటుకునేందుకు పోటాపోటీగా ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. ఒకరి నొకరు తోసుకున్నారు. ఒక మాజీ మంత్రి సహా ఇద్దరు అధికార బిజెపి సభ్యులు గాయాలతో ఆసుపత్రికి చేరారు. ఆ విధంగానూ 2024 పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మరో మలిన చరిత్ర సృష్టించాయి. అదలా ఉంటే, పార్లమెంట్ సమావేశాల సమయం వృథా కారణంగా కోట్ల రూపాయల ప్రజాధనం వృథాగా కొట్టుకుపోతోంది. పార్లమెంట్ ఉభయ సభల నిర్వహణకు నిమిషానికి రెండున్నర లక్షల రూపాయలు ఖర్చువుతాయని ప్రజాస్వామ్య పరిరక్షణ సంస్థల లెక్కలు చెపుతున్నాయి. మొన్నటి శీతాకాల సమావేశాల్లో మొత్తం 65 గంటల 15 నిముషాల సమయం వృథా అయింది. అంటే రూ. 97,87,50,000 వృథా అయింది. నిజానికి, గత సంవత్సరం ఆఖర్లో జరిగిన శీతాకాల సమావేశాలు మాత్రమే, కాదు, అంతకు ముందు జరిగిన పార్లమెంట్ సమావేశాలు ఏవీ కూడా సజావుగా సాగిన సందర్భం ఏదీ లేదు. అంతే కాదు, రేపటి బడ్జెట్ సమావేశాలు సహా, భవిష్యత్ సమావేశాలు అయినా సజావుగా జరగాలని కోరుకోవచ్చును గానీ, అలాంటి సంకేతాలు అయితే, కనిపించడం లేదు. అందుకే, నిజానికి ముందు ముందు మన ప్రజాస్వామ్యం, మరింత అధ్వాన స్థితికి దిగజారినా ఆశ్చర్యపోనవసరం లేదని అంటున్నారు. అలాగే, రాను రాను రాజు గుర్రం అన్నట్లు రాను రాను మన ప్రజాసామ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇది నిజం. చేదు నిజం..

## సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం



శ్రీశైలం లోక కల్యాణం కోసం దేవస్థానం బుధవారం ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది.కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేష అభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి.ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి.వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది.కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది.భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు

## మహాకుంభమేళాలో తొక్కిసలాట...

లక్నో, జనవరి 29, (న్యూస్ పల్స్)మహా కుంభమేళాలో తొక్కిసలాట జరిగింది. మౌని అమావాస్య సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు ప్రయాగ్‌రాజ్‌లోని సెక్టార్ 2 సంగమం దగ్గరకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరగడంతో.. అక్కడ బారికేడ్లు విరిగిపోయాయి. దీంతో తొక్కిలాసట జరిగి పలువురు భక్తులకు తీవ్రంగా గాయాలయ్యాయి. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది, పోలీసులు స్పందించి.. వారిని అంబులెన్సుల్లో సమీప ఆస్పత్రులకు తరలించారు. ఎంతమంది గాయపడ్డారనే అంశంపై క్లారిటీ రావాల్సి ఉంది. సంగమం దగ్గర రద్దీ పెరగడంతో తొక్కిసలాట జరిగిందని భక్తులు చెబుతున్నారు. ఈ ఘటన తర్వాత పుణ్యస్నానాలను రద్దు చేస్తున్నట్లు అఖండ పరిషత్ ప్రకటించింది.ఈ ఘటన గురించి సమావేశం తెలిసిన వెంనటే ప్రధాని నరేంద్ర మోదీ ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో మాట్లాడారు. మహా కుంభమేళాలో పరిస్థితి గురించి ఆరా తీశారు.. అక్కడి పరిణామాలపై వెంటనే సమీక్షించి, అవసరమైన తక్షణ సహాయక చర్యలకు ఆదేశించారు. ఇదిలా ఉంటే.. అక్కడ పరిస్థితి అదుపులోనే ఉందని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఆకాంక్ష రాణా తెలిపారు. క్షతగాత్రులకు ఆస్పత్రుల్లో వైద్యం కొనసాగుతోందన్నారు.ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళాలో మౌనీ అమావాస్యకు ప్రత్యేకత ఉంది. ఈ క్రమంలో భక్తులు భారీసంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో యూపీ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. జనవరి 13 నుంచి కుంభమేళా మొదలుకాగా.. ఇప్పటి వరకు 15కోట్లమంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు చెబుతున్నారు. అయితే మౌనీ అమావాస్య సందర్భంగా బుధవారం ఒక్కరోజే 10 కోట్లకుపైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అధికారుల అంచనా.. అందుకే త్రివేణీసంగమ ప్రాంతాన్ని నో వెహికల్ జోన్‌గా ప్రకటించారు అధికారులు. మౌనీ అమావాస్య సందర్భంగా రైల్వేశాఖ మొత్తం 360 రైళ్లను కూడా నడుపుతున్నారు.

ఈ క్రమంలో యూపీ ప్రభుత్వం 1 నుంచి 8 తరగతుల స్థానిక విద్యార్థులకు మూడు రోజులు సెలవులు ప్రకటించింది. అంతేకాదు మౌనీ అమావాస్యకు అలహాబాద్ హైకోర్టు సైతం బుధవారం సెలవుగా ప్రకటించింది. ఈ సందర్భంగా అధికారులు భక్తులకు కొన్ని ప్రత్యేక సూచనలు చేశారు. భక్తులు నిర్దేశించిన మార్గాల్లోనే ఘాట్‌లకు వెళ్లాలని, స్నానాల తర్వాత గుంపులుగా గుమికూడి ఎక్కువసేపు ఉండవద్దని రిక్వెస్ట్ చేశారు. భద్రతా నియమాలు పాటించి తమతో సహకరించాలి అన్నారు.

## పద్మశ్రీ అవార్డు గద్దర్ కి ఎందుకు ఇవ్వాలి

## మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్



కోరుట్ల, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్న మాటలు అక్షరాల నిజమని,పద్మశ్రీ అవార్డు గద్దర్ కు ఎందుకు ఇవ్వాలన్నా వ్యాఖ్యలపైరాద్ధాంతం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని పట్టణానికి చెందిన మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండెం గణేష్ ప్రశ్నించారు.బుధవారం పట్టణం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గద్దర్ తన పిల్లలను మాత్రం ఉన్నత చదువులు చదివించుకుని,తన పాటలతో అనేకమంది బడుగు, బలహీన వర్గాల పిల్లలని నక్షలిజం వైపు మళ్లించి ఎందరో తల్లులకు కడుపు కోత మిగిల్చిరన్నారు.స్వామియే శరణం అయ్యప్ప మా కొంప ముంచావురా.. అయ్యప్ప అన్నందుకు అవార్డు ఇవ్వాలా?పార్లమెంటుని పందుల దొడ్డి అని, అసెంబ్లీని బాతకాల క్లబ్ అని అవహేళన చేసినందుకా..ప్రజల ప్రాణమానాలను రక్షించే వందల మంది పోలీసులను చంపించి నందుకు అవార్డు ఇవ్వాలా?దేశం కోసం, ధర్మం కోసం పోరాడే దేశభక్తులను చంపించినందుకు గద్దర్ కు అవార్డు ఇవ్వాలా..ఆని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు.చివరకు గత కాంగ్రెస్ ప్రభుత్వంలోని మాజీ స్పీకర్ ని,కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను చంపించినందుకు ఇవ్వమంటున్నారా..ఆనిఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని సూటిగా అడుగుతున్నమన్నారు.పద్మశ్రీ అవార్డు గురించి విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు.ప్రజాస్వామ్యం నమ్మని వారు,ఓటు వేయని వారు,ప్రజా హక్కులను విస్మరించి పాటలతో రెచ్చగొట్టి ప్రజల జీవితాలను నాశనం చేసిన చరిత్ర గద్దర్ ది అన్నారు.ప్రజలు ఎన్నుకున్న ప్రజాస్వామ్య గణతంత్ర భారతం అలాంటి వ్యక్తికి మన దేశపు అత్యున్నత పురస్కారాలు ఎలా ఇస్తుందని,తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం గద్దర్నీ సత్కరించి, సన్మానించిపద్మశ్రీ అవార్డు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపారా తెలియజేయాలన్నారు.ఈ విలేకరుల సమావేశంలో బీజేపీ పట్టణ ప్రధానకార్యదర్శి చెట్లపెల్లి సాగర్,జక్కుల ప్రవీణ్,గందె నవీన్,గుండేటి సంజీవ్,దమ్మ సంతోష్,రుద్ర ప్రశాంత్,కంతం ఉదయ్,మామిడిపెల్లి విజయ్,వాసం సతీష్,గుండేటి సాయికుమార్,వాసాల నవీన్,రుద్ర విగ్నేష్,వెగ్యరపు అభిషేక్,జిల్ల ఉదయ్,మిట్టపెల్లి రవి,నల్ల ప్రణయ్ ,తదితరులు పాల్గోన్నారు

## రైతు భరోసా అర్హులందరికీ అందించకపోవడం దారుణం

## కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ జనవరి 29 ; రాష్ట్రంలో రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇళ్లు, రేషన్ కార్డులను అర్హులందరికీ అందించకపోవడం దారుణమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన 70లక్షల మంది రైతులుంటే.. ఇప్పటివరకు 65 లక్షల మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయలేదని చెప్పారు. 10 లక్షల మంది వ్యవసాయ కూలీలుంటే నేటికీ 9 లక్షల 80 వేల మంది రైతుల ఖాతాల్లో డబ్బులు ఎందుకు వేయడంలేదని ప్రశ్నించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంజయ్ లేఖ రాశారు."40 లక్షల కొత్త రేషన్ కార్డులిస్తామని 42,267 మందిని మాత్రమే గుర్తించడం హాస్యాస్పదంగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల కుటుంబాలు అర్హులైనప్పటికీ, నేటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా ఇంటిని నిర్మించకపోవడం సిగ్గు చేటు. ఇళ్ల నిర్మాణం కోసం రాష్ట్ర బడ్జెట్‌లో రూ.7 వేల కోట్లకుపైగా కేటాయింపులు చేసినా.. నయాపైసా ఖర్చు చేయకపోవడం దారుణం. ముఖ్యమంత్రే ఇచ్చిన హామీలనే అమలు చేయలేకపోతే.. మీ నేతృత్వంలో పనిచేసే అధికారులు ఏ విధంగా జవాబుదారీతనంతో పనిచేయగలరు?. ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో రాష్ట్ర సర్కార్ విఫలమైంది. ఇకనైనా అర్హులకు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇళ్లను అందించాలి" అని లేఖలో బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## ఏడు నెలలో రాష్ట్రానికి 6.3 లక్షల పెట్టుబడులు తెచ్చాం..... మంత్రి పార్థసారధి




అమరావతి:- గత ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నాశనం చేయాగా సీఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం మరలా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు పెద్దఎత్తున కృషి చేయడం జరుగుతోందని మంత్రి పార్థసారథి వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధిని శరవేగంగా ముందుకు తీసుకు వెళ్ళేందుకు గత ఏడు నెలల్లో రాష్ట్రానికి రూ.6.33 లక్షల కోట్ల రూ.ల పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో ఎంఓయులు కుదుర్చుకోవడం జరిగిందని తద్వారా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని తెలిపారు.విశాఖలో టిసిఎస్,ఎన్టిపిసి,ఆర్సిలర్ మిట్టల్, హెచ్ పి సి, రిలయన్స్ వంటి కంపెనీలు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టనున్నాయని చెప్పారు.గత ప్రభుత్వంలో చేసిన తప్పిదాలను ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై నీతిఆయోగ్ ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి ప్రజెంటేషన్ ఇస్తే దానిపై విమర్శలు చేయడం సరికాదన్నారు .ఒక వ్యక్తి మూర్ఖత్వ పాలనతో ఏరాష్ట్రమైనా దేశమైనా ఏవిధంగా నష్టపోతుందనేకు గత ప్రభుత్వ పాలనే నిదర్శనమని తెలిపారు. రాష్ట్రానికి ఆదాయాన్ని పెంపొందించాల్సిన వారు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అధోగతి పాలు చేసి సుమారు 10 లక్షలు అప్పుల ఊబిలోకి నెట్టేసారని మంత్రి పార్థసారథి అన్నారు.గత ప్రభుత్వం విద్యార్థుల ఫీజు రీఇంబర్సుమెంట్ కు సంబంధించి 2,800 కోట్లు, అంగన్ వాడీల్లో చిన్న పిలల్లకు అందించే చిక్కీలు,గ్రుడ్లుకు 1700 కోట్లు, ఉద్యోగులకు 20వేల కోట్లు బకాయిలు చెల్లించలేదని వివరించారు. గృహ నిర్మాణానికి 7,800 కోట్లు,ఉపాధి హామి పథకానికి 2100 కోట్లు బకాయిలు పెట్టివెళ్ళిందన్నారు.

ఆరోగ్యశ్రీకి పెద్దఎత్తున బకాయిలు చెల్లించలేదని తెలిపారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యానికి కూడా సకాలంలో సొమ్ము చెల్లించ లేదన్నారు.గత ప్రభుత్వ హాయంలో వ్యవసాయ రంగం మొత్తం కుదేలైందని,గతంలో చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులన్నిటీ ఎక్కడికక్కడే నిలిపే వేయడం జరిగిందని మంత్రి పార్థసారధి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ కు జీవనాడైన పోలవరం ప్రాజెక్టును గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు.ఈకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేసేందుకు రూ.15వేల కోట్లను కేంద్రం నుండి మంజూరు చేయించుకో గలిగామని తెలిపారు.అమరావతి రాజధాని పనులన్నీ గత ప్రభుత్వం పూర్తిగా ప్రక్కన పెట్టి పూర్తిగా నిర్లక్ష్యం చేయడమేగాక మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి రాజధానే లేకుండా చేసిందన్నారు. ఈకూటమి ప్రభుత్వం అధికారానికి వచ్చిన 7 మాసాల్లోనే ప్రపంచ బ్యాంకు,హడ్కో,జైకా తదితర సంస్థల ద్వారా 31వేల కోట్లను సాధించుకోగలిగామన్నారు.సూపర్ సిక్స్ హామిల్లో భాగంగా కూటమి ప్రభుత్వం మరో పెద్ద హామీ అయినా దీపం పథకం కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడం జరుగుతోందని దానివల్ల 90 లక్షల మందికి లబ్ది చేకూరుతోందని మంత్రి తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు పూర్తి కాని,మరమ్మత్తులు చేయలేని గ్రామ,పట్టణ, రాష్ట్ర రహదారులను పూర్తి చేసి గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నామని చెప్పారు.ఓవైపు అప్పుల కుప్ప, మరో వైపు గత ప్రభుత్వ బకాయిల తట్ట దర్శనమిస్తున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు.వెయ్యి పెన్షన్‌ను పెంచడానికి గత ప్రభుత్వానికి ఐదేళ్లు పట్టింది కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే మూడు వేలు ఉన్న సామాజిక పెన్షన్‌ను నాలుగు వేలు చేశారన్నారు.

ఇచ్చిన హామీ మేరకే ప్రతీ నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పెన్షన్ పంపిణీ జరుగుతోందని తెలిపారు..ప్రతీ ఏటా మెగా డీఎస్సీ ప్రకటిస్తానని హామీ ఇచ్చి ఒక్క ఏటా కూడా డీఎస్సీని పూర్తి చేయకుండా హామీని గాలికి వదిలేశారని కానీ సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన రోజునే డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టుల భర్తీ ఫైలు పై సంతకం చేశారని గుర్తు చేశారు.పేదవానికి అన్నం పెట్టే లక్ష్యంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసివేస్తే ఈప్రభుత్వం వచ్చిన వెంటనే వాటిని పునరుద్ధరించడం జరిగిందన్నారు.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను ప్రవేటీకరించకుండా నివారించేందుకు గత ప్రభుత్వం కనీస ప్రయత్నాలు చేయలేదని కాని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రవేటీకరణ కాకుండా అనేక ప్రయత్నాలు చేయడం జరిగిందని అంతేగాక దానికి రివైవల్ ఫ్యాకేజి కింద కేంద్రం నుండి 11,500 కోట్లు సాధించుకోగలిగామన్నారు.అంతేగాక విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి ఇప్పటికే శంఖుస్థాపన జరిగిందని తెలిపారు.రాష్ట్రంలో ఐదేళ్ళలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా,ప్రతి ఇంటిలో ఒక ఎంటర్ప్రెన్యూర్ ను తీర్చిదిద్దే లక్ష్యంగా ఈకూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పార్థసారథి స్పష్టం చేశారు.

# యుజిసి మార్గదర్శకాల రచ్చ!

ఉన్నత విద్యలో సంస్కరణల ఆవశ్యకతను నొక్కిచెబుతూ జాతీయ విద్యావిధానం చేసిన సిఫార్సుల మేరకు ఆ దిశగా యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యుజిసి) వేసిన తొలి అడుగే వివాదాస్పదంగా మారింది. వర్శిటీలు, కాలేజీల్లో నియామకాలు, పదోన్నతులలో కీలకమార్పులను సూచిస్తూ చేసిన పలుసూచనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. 'విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో లెక్చరర్లు, బోధనా సిబ్బంది నియామకం, పదోన్నతుల కోసం కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు' పేరిట యుజిసి రూపొందించిన ముసాయిదా దీనికంతటికీ కారణం. ఈ ముసాయిదాలోని అనేక సూచనలు ఆహ్వానించదగినవే అయినప్పటికీ, కీలకమైన అంశాలు వివాదాలకు తావిచ్చేవిగా ఉండటంతో పలు రాష్ట్రాలనుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. యుజిసి రూపొందించిన ముసాయిదాకు అంగీకార ముద్రపడితే, దేశంలోని కేంద్రీయ, డీమ్డ్, రాష్ట్ర, ప్రైవేట్ వర్శిటీలన్నింటికీ ఈ మార్గదర్శకాలు శిరోధార్యమవుతాయి. వైస్ చాన్సలర్ల పదవీ కాలాన్ని ఐదేళ్లకు పెంచడం, అన్ని వర్శిటీలలో పిహెచ్‌డి మూల్యాంకనానికి ఒకే పద్ధతిని అనుసరించేలా చర్యలు తీసుకోవడం, ఉన్నత విద్యాసంస్థలు ప్రతి సెమిస్టర్‌కు 15 వారాల పాటు పని చేయడం వంటి పలు ప్రతిపాదనలు సమంజసమైనవే. అయితే యుజిసి ముసాయిదాలో వైస్ చాన్సలర్ల నియామక ప్రక్రియపై చేసిన మార్పులు, చేర్పులు వివాదానికి దారితీస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న నిబంధనల మేరకు యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పదవికి పదేళ్లు ప్రొఫెసర్‌గా పనిచేసిన సమర్థుడైన, నాయకత్వ లక్షణాలు కలిగిన విద్యావేత్తలు అర్హులు. యుజిసి తాజా ముసాయిదా ప్రకారం ఇకపై కాలేజీ ప్రిన్సిపాల్, యూనివర్శిటీ వైస్ చాన్సలర్ల నియామకం కోసం దేశవ్యాప్తంగా వార్తాపత్రికల్లో ప్రకటన ఇవ్వవలసి ఉంటుంది. అభ్యర్థులలో పోటీతత్వాన్ని పెంచే ఈ నిబంధన బాగానే ఉన్నా, ఉన్నత విద్యారంగంతో ఏమాత్రం సంబంధం లేనివారిని సైతం వైస్ చాన్సలర్లుగా నియమించవచ్చనే ప్రతిపాదన ఆందోళన కలిగిస్తోంది. విద్యావేత్తలు వైస్ చాన్సలర్లయితే వర్శిటీ అభివృద్ధికి, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయగలుగుతారు. ఈ నిబంధనను మార్చి, ఏ రంగంలోనివారైనా ఈ పదవిని చేపట్టవచ్చునని ముసాయిదాలో పేర్కొనడం వెనుక కేంద్రప్రభుత్వం చిత్తశుద్ధిని శంకించవలసి వస్తోంది. పైగా వైస్ చాన్సలర్ల ఎంపికకు సెర్చ్ కమిటీ ఏర్పాటునుంచి, నియామకం వరకూ పూర్తిగా గవర్నర్లకే అధికారం ఉంటుంది. దీనిపై బిజెపియేతర రాష్ట్రప్రభుత్వాలు భగ్గుమంటున్నాయి. యూనివర్శిటీలపై పెత్తనం చెలాయించేందుకు యుజిసిని కేంద్రం పావుగా వాడుకుంటోందని, విసిలుగా సంఘ్‌పరివార్ సభ్యుల్ని నియమించుకునేందుకు ఇది ఒక ఎత్తుగడ అంటూ ధ్వజమెత్తుతున్నాయి. తెలంగాణ సహా కొన్ని రాష్ట్రాలు యుజిసి ముసాయిదాపై తీవ్ర అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయి. తమిళనాడు, కేరళ మరో అడుగు ముందుకు వేసి, యుజిసి ముసాయిదాను నిరసిస్తూ చట్టసభల్లో తీర్మానాలు సైతం చేశాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రప్రభుత్వాలు లేవనెత్తుతున్న సందేహాలకు, అవి విసురుతున్న సవాళ్లకు జవాబు ఇవ్వవలసిన బాధ్యత కేంద్రప్రభుత్వంపై ఉంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాల కోసం కేంద్రం ఖర్చు చేస్తున్నదేమీ లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే నిధులే యూనివర్శిటీలకు ప్రధాన వనరు. అధ్యాపకుల జీతభత్యాలు, నిర్వహణ వంటివన్నీ రాష్ట్ర ప్రభుత్వాలే చూసుకుంటున్నాయి. పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారిన యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్. ఆయా రాష్ట్రాలలోని వర్శిటీలకు చాలాకాలంగా గ్రాంట్లు మంజూరు చేయడం లేదు. ప్రభుత్వ వర్శిటీలకు పైసా కూడా ఖర్చు చేయని కేంద్రం రెగ్యులేషన్ల పేరిట వాటిపై పెత్తనం చెలాయించేందుకు పూనుకోవడమేమిటన్న ప్రశ్న సహేతుకమైనదే. స్వాతంత్ర్యానంతరం విద్యను రాష్ట్రాల జాబితాలో చేర్చినా, ప్రణాళికలు, బోధనా పద్ధతుల్లో వ్యత్యాసాలు పెరిగిపోయిన దృష్ట్యా 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఉమ్మడి జాబితాలోకి మార్చారు. అయినప్పటికీ, రాజ్యాంగం ప్రకారం సమన్వయం, విద్యాప్రమాణాల ఏర్పాటుకే కేంద్ర ప్రభుత్వ అధికారం పరిమితం. వర్శిటీలకు సంబంధించి ఎక్కువ అధికారాలు రాష్ట్రప్రభుత్వాలకే దఖలుపడ్డాయి. కాదని, వాటిపై కేంద్రం అధికారం చెలాయించజూస్తే, రాష్ట్రప్రభుత్వాలు న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన అగత్యం ఏర్పడుతుంది. అంతకుమించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణాత్మక వైఖరి ఉన్నత విద్యకు, విద్యార్థుల భవిష్యత్తుకు శాపంగా పరిణమించే ప్రమాదం ఏర్పడుతుంది. ముసాయిదాలో మార్పు చేర్పులకు విద్యావేత్తలు, ప్రజలనుంచి సూచనలను యుజిసి ఆహ్వానించిన నేపథ్యంలో ప్రధానమైన లోటుపాట్లను సవరించి, ఉన్నత విద్యను మరింత మెరుగుపరిచే దిశగా ముందడుగు వేయడం అత్యంత ఆవశ్యకం.

# ఆహారం విషయంలో గాంధీ నియంత్రణలు

కొల్లాయి గట్టి, చేత కర్రబట్టి, నూలు వడకి, మురికివాడలు శుభ్రం చేసి, అన్ని మతాలూ, కులాలూ ఒకటే అని చాటి, రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడ లాడించిన జాతిపిత మహాత్మా గాంధీజీ. మహాత్ముడనీ, జాతిపిత అనీ పేరెన్నిక గన్న ఆయన ఆంగ్లేయుల పాలన నుండి భారత దేశానికి స్వాతంత్ర్యము సాధించిన నాయకులలో అగ్రగణ్యుడు. 20వ శతాబ్దిలోని రాజకీయ నాయకులలో అత్యధికంగా మానవాళిని ప్రభావితము చేసిన రాజకీయ నాయకునిగా గుర్తింపు పొందారు ఆయన. జాతిపిత మహాత్మాగాంధీ శారీరకంగా దుర్బలుడు అయినా, మానసికంగా మేరు నగధీరుడు. అహింస, సహాయ నిరాకరణ ఉద్యమం లాంటి విషయాల్లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, మార్టిన్ లూథర్ కింగ్, నెల్సన్ మండేలా, బరాక్ ఒబామా లాంటి ఎందరో మేధావులకు ప్రేరణగా నిలిచిన గాంధీ జీవితంలో ఆరోగ్య రక్షణ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు, ఆచరణ పద్ధతులు ఉండేవి. దేశ స్వాతంత్ర్య సాధన యే ఏకైక లక్ష్యంగా, సత్యాగ్రహమే ఆయుధంగా, అహింసా మార్గంలో పయనించి, నిరంతరం అంకిత భావంతో పోరాటాలను నడిపించి, పలు మార్లు జైలు పాలైనా, ఆహారపు అలవాట్లను ఖచ్చితంగా ఆయన పాటించారు. అసలైన విలువ అనేది మన ఆరోగ్యంలోనే ఉంటుంది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యము" అని అంటుండే వారు.. గాంధీజీ ఐదేళ్ల పాటు పండ్లు, గింజలు, నట్స్ మాత్రమే తిన్నారు. కానీ ఆరోగ్య సమస్యలు రావడంతో శాకాహారం తీసుకోవడం ప్రారంభించారు. ఆహారం విషయంలో గాంధీజీ దశాబ్దాల పాటు ప్రయోగాలు చేశారు. "ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజం, గాంధీ డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్, కీ టు హెల్త్ " అనే పుస్తకాలు కూడా రచించారు. సాత్వికాహారంతో మనిషి బుద్ధి వికసిస్తుందని గాంధీగారు త్రికరణ శుద్ధితో విశ్వసించే వారు.లండన్ లోనూ గాంధీ శాకాహారి గానే ఉండేవారు.

విధి లేక శాకాహారం తినడం కాదు, లండన్ లో స్వయంగా గాంధీ శాకాహారాన్ని ఎంపిక చేసుకున్నారని, తన రూమ్మేట్ సహాయంతో "లండన్ వెజిటేరియన్ సొసైటీ" ఉందనే వాస్తవం కూడా గాంధీజీ తెలుసు కున్నారని,చివరకు గాంధీ, ఆయన మిత్రుడు వారి నెం.52, సెయింట్ స్టీఫెన్స్ గార్డన్, బేస్ వాటర్ హోమ్, లో మిత్రులకు పప్పుల చారు, అన్నం, ఎండు ద్రాక్షలతో విందు చేసేవారని "గాంధీ బిఫోర్ ఇండియా" అనే పుస్తకంలో చరిత్రకారుడు రామచంద్రగుహ వివరంగా రాశారు. ఇక గాంధీ డైట్ అండ్ డైట్ రిఫార్మ్స్, ది మోరల్ బేసిస్ ఆఫ్ వెజిటేరియనిజమ్, కీ టు హెల్త్ అనే పుస్తకాలు కూడా రచించారు. గాంధీజీ ఉద్దేశ్యంలో మంచి ఆహారపు అలవాట్లు అనేవి మంచి ఆరోగ్యానికి తప్పనిసరి. ఒక్కో వ్యక్తి శరీరం దాని తత్వాన్ని బట్టి, ఒక్కో రకమైన ఆహారానికి అలవాటు పడుతుంది. కాబట్టి, దానికి అనుగుణం గానే మనిషి ఆహారపు అలవాట్లను చేసు కోవాలి. తాను శాకా హారానికే ప్రాధాన్యం ఇస్తానని గాంధీజీ చెప్పేవారు. శాకాహారం లోకి పాలు, పాల ఉత్ప త్తులను కూడా చేర్చాలని గాంధీజీ అనేవారు. పాలు, పాల ఉత్ప త్తులను ఆరేళ్ళ పాటు సేవించక పోవడం వల్ల విరోచనాలతో బాధ పడ్డాననీ, కట్టె పోగులా తయారయ్యా ననీ, ఎంత మంది సలహా ఇచ్చినా మందులు తీసుకొన లేదని, మేక పాలను తాగడం వల్ల తాను మళ్ళీ మామూలు స్థాయికి చేరు కున్నాననీ, గాంధీజీ తన ఆత్మ కథలో వివరించారు.

గాంధీ తొలుత పాల పదార్థాలకు దూరంగా ఉండేవారు. కేవలం ఒక వెజిటేరియన్‌గానే ఉండాలని కోరుకొనేవారు. అయితే సమయానుసారం తన ఆహారపు అలవాట్లలో మార్పులు సంభవించాయి. పాల ఉత్పత్తులను మానేయాలని గాంధీజీ భావించారు. కానీ ఆరోగ్యం దెబ్బ తినడంతో తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. తర్వా మేకపాలు తాగడం ప్రారంభించారు. తాజా మేక పాల కోసం కొన్ని సందర్భాల్లో ప్రయాణాల్లోనూ ఆయన వెంట మేకను తీసుకెళ్లేవారు.. వైద్యుడి సలహా మేరకు మేక పాలను తన డైట్‌లో భాగంగా చేసు కున్నారు. ఆహారం అనేది ప్రాణాన్ని నిలబెట్టేందుకే అయినప్పటికీ, మితాహారం, సాత్వికాహారం వల్ల మనిషిలో ఆలోచనా శక్తి పెరుగుతుందని గాంధీగారు విశ్వసించేవారు. పాలు సంపూర్ణ ఆహారం కావడం వల్ల దేహం ఎదుగుదలకు కావల్సిన మాంస కృతులు, విటమిన్లు లభ్యమవుతాయని, అలాగే, తృణ ధాన్యాలు, వరి, జొన్న, రాగులు వంటివి కూడా శరీరానికి బలం ఇస్తాయని గాంధీజీ విశ్వసించేవారు. ఆయన ఆహారంలో ఒక లీటరు మేక పాలు, 150 గ్రాముల చిరు ధాన్యాలు, 75 గ్రాముల ఆకుకూరలు, 125 గ్రాముల కాయగూరలు, 25 గ్రాముల సలాడ్లు, 40 గ్రాముల నెయ్యి, 40 గ్రాముల పంచదార ఉండేటట్లు చూసు కున్నారు. భుక్తా యాసం వచ్చేవరకూ ఆహారం తీసుకోవడం, అతినిద్ర, అలసత్వం మనిషికి శత్రువులని ఆయన తరచూ అనే వారు. భోజనం వేళ దాటి పోయిన తర్వాత చిరు ఆకలి అనిపిస్తే ఆయన వేరుశనగ గుళ్ళు తినేవారు.

సబర్మతిలో ఆహారం అంటే ఉడికించిన వంకాయ, బీట్రూట్, మరి కొన్ని కూరగాయలు, వెన్న లేని రొట్టె.. నెయ్యి కూడా ఉండదను, దాన్ని మందులాగా కష్టపడి తినే వారన్న విషయాలు గ్రంథస్థాలు. వెల్లుల్లిని పేదవారి కస్తూరి అని పిలుస్తారని గాంధీ పొర్కొన్నారు. చివరి దశకాల్లో గాంధీ చాలా ఆహారపు అలవాట్లను విడిచిపెట్టారు. మసాలా దినుసులు మానివేశారు. ఉడికించిన కాయ గూరలు మాత్రమే తినేవారు. ఉల్లి, వెల్లుల్లి లేకపోతే గ్రామీణులు ఇంకేం తింటారని కూడా ప్రశ్నిస్తారు. తల్లితండ్రులు తమ పిల్లలకు బలవర్ధకమైన ఆహారాన్ని పెట్టాలనీ, పిల్లల చదువు విషయంలోనే కాకుండా, ఆహార, విహారాల విషయంలో తగిన శ్రద్ధ తీసుకోవాలని గాంధీజీ ప్రబోధించారు. బాల్యం నుంచే వారికి మంచి అలవాట్లు అబ్బేట్టు చూడాల్సిన బాధ్యత తల్లితండ్రుల దేనని ఆయన అన్నారు. భారత స్వాతంత్ర్య సమరం సాగుతున్న సమయంలో మహాత్మ గాంధీ అనేకసార్లు నిరాహారదీక్షను పాటించారు. దాదాపు 17 సార్లు ఉపవాసాన్ని ఒక వ్రతంగా స్వీకరించారు. అత్యధికంగా 21 రోజులు కేవలం తక్కువ మోతాదులో ద్రవాలను మాత్రమే తీసుకుంటూ నిరాహారదీక్ష చేశారు. తన అహింస సిద్ధాంతాల్లో భాగంగా ఈ అంశం గురించి పేర్కొన్నారు. పలువురు ఆయుర్వేద వైద్య నిపుణుల ప్రకారం స్థూల కాయాన్ని తగ్గించుకోవడం, రక్తపోటును నియంత్రించు కోవడం, కొవ్వును తగ్గించు కోవడం లాంటివన్నీ కూడా పలు ఉపవాస నియమాల వల్ల సాధ్యమే. శారీరక శక్తి కోసం తినడం ఎంత అవసరమో, మానసిక శక్తికోసం మనసును ప్రశాంతంగా ఉంచు కోవాలనీ, గాంధీజీ నిరంతరం ధ్యానంలో నిమగ్నమయ్యేవారనీ, ఆయన మానసిక శక్తిలోని అసలు రహస్యమని పలు సందర్భాలలో గాంధీ చెప్పేవారు. మనిషి తన మానసిక ప్రశాంతతతో పాటు శారీరక ప్రశాంతతను పెంపొందించు కోవడం కోసం ధ్యానం చేయడం అలవాటు చేసుకోవాలన్నది గాంధీ సిద్ధాంతం. ఆయన ప్రతీ రోజు ధ్యానం చేసేవారు. మరియు ఎక్కువ సేపు ప్రార్థన చేసేవారు. ఆయుర్వేదం ప్రకారం కూడా ధ్యానం చేయడం వలన మానసిక రుగ్మతలు దూరం అవుతాయని చెపుతారు. గాంధీజీ ప్రబోధించిన అనేక విషయాలను ఆరోగ్య వికాసానికి ముడి పెడితే కొన్ని మంచి విషయాలను తెలుసు కోవచ్చు. ఉదాహరణకు నిద్రలేమిని అరికట్టడం అనే విషయాన్ని గురించి తరిచి చూస్తే.

గాంధీ కూడా తొలుత కేవలం నాలుగు నుండి అయిదు గంటలు మాత్రమే నిద్రకు కేటాయించేవారు. అయితే తర్వాత రాత్రిళ్లు ఎక్కువ సేపు మేల్కొని ఉండకుండా, వేగంగా నిద్రపోవడం మరియు వేగంగా నిద్రలేవడం అనే నియమానికి కట్టుబడి ఉండేవారు. సూర్యోదయానికి ముందు నిద్రలేచి ధ్యానం చేయడం వలన శరీరంలో ఒక ఉత్తేజం ప్రారంభమై, ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉండ గలుగుతామని ఈ ఉదాహరణ చెబుతోంది. అలాగే దండీ మార్చ్ చేసిన బాపూజీ జీవితం నుండి ఆ అంశాన్ని ఉదాహరణగా తీసుకుంటే, నడక వలన కలిగే ఉపయోగాలు తెలుసు కోవచ్చు. గుండె బలహీనతను తగ్గించు కోవడం, కొవ్వు కరిగించుకోవడం, పక్కటెముకలు పటిష్ట పడేలా చూసు కోవడానికి నడక ఎంతగానో ఉపయోగ పడుతుంది. కనుక ప్రతీ వ్యక్తి రోజుకు ఎంతోకొంత దూరం నడవడం తప్పని సరిగా భావించాలి. గాంధీజీ నూరు శాతం శాకాహారి. మితాహారి. మిత భాషణుడు. గాంధీజీ 46.7 కిలోల బరువు ఉండేవారు. ఎత్తు 1.64 మీటర్లు. 78వ ఏట ఆయన నాథూరామ్ గాడ్సే జరిపిన కాల్పుల్లో మరణించారు.

# కుష్టువ్యాధిపై సామాజిక స్పృహ

కుష్టు వ్యాధి బారిన పడిన ప్రజల సంరక్షణ కోసం మహాత్మా గాంధీ చేసిన నిస్వార్థ ప్రయత్నాలు, పడిన శ్రమను గుర్తుగా ఆయన వర్ధంతి అయిన 30 జనవరిని కుష్టు వ్యాధి నివారణ దినోత్సవంగా జరుపుకుంటారు. కుష్ఠు వ్యాధి మైకో బ్యాక్టీరియా లెప్రే అనే బ్యాక్టీరియా వల్ల సోకుతుంది. ఈ వ్యాధికి సకాలంలో చికిత్స చేయించు కోకపోతే అది పెరిగి చర్మానికి, నరాలకు, కాళ్లు, చేతులు, కళ్లకు హాని కలిగిస్తుంది. ముఖ్యంగా చర్మానికి, నరాలకు సోకుతుంది. చాలా నెమ్మదిగా వ్యాధి లక్షణాలు బహిర్గత మవుతాయి. ప్రారంభ దశలో గుర్తించి మల్టీ డ్రగ్ థెరఫీ తీసుకుంటే వ్యాధి అంగ వైకల్యానికి దారి తీయదు. చికిత్స పూర్తయిన, చికిత్స తీసుకుంటున్న రోగుల్లో అంగవైకల్యం ఉంటే శస్త్ర చికిత్స ద్వారా సరిచేయవచ్చు. ఈ వ్యాధిని రెండు రకాలుగా గుర్తించి వాటికి వైద్యాన్ని అందిస్తారు. మొదటగా ఎంబీ (మల్టీ బ్యాచ్‌లరీ) అంటే మచ్చల సంఖ్య, స్పర్శ కోల్పోయిన వారికి ఏడాదిపాటు చికిత్స అందిస్తారు. రెండోది పీబీ (పాసి బ్యాచులరీ) ఇది కూడా మచ్చల సంఖ్య, స్పర్శ కోల్పోయిన వారికి ఆరు నెలలపాటు చికిత్స అందిస్తారు. 20శాతం మానవుడికి ఇది అంటువ్యాధి. ఈ వ్యాధి కేవలం బ్యాక్టీరియా ద్వారానే (దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు) మాత్రమే సోకుతుంది. ఈ వ్యాధి లక్షణాలు బయట పడటానికి 6 నెలల నుంచి 20ఏండ్ల సమయం పడుతుంది. ఈ సమయాన్ని ఇంక్‌పేషెంట్ పీరియడ్ అని అంటారు. వ్యాధి అభివృద్ధి లక్షణాలలో నరాల, శ్వాసనాళ, చర్మం, కళ్ళు క్షీణించడం ఉంటాయి, దీనివల్ల నొప్పి తెలుసుకునే సామర్థ్యం కోల్పోవడం, పునరావృత గాయాల కారణంగా అంత్య భాగాల పూర్తిగా దెబ్బతింటాయి. బలహీనత మరియు చూపు పేలవంగా ఉంటుంది. శరీరంపై పాలిపోయిన లేదా రాగి రంగు మచ్చలు, మచ్చలపై స్పర్శ లేక పోవడం , నొప్పి తెలియకుండా ఉండడం, పాదాలు, చేతులు, వేళ్ల తిమ్మిర్లు ఉన్నా, చర్మం దళసరిగా మారడం, చర్మం.. ముఖ్యంగా ముఖం నూనె రాసినట్లుగా నిగనిగలాడుతూ కనిపించడం ప్రధాన లక్షణాలు కనిపిస్తాయి. కుష్టు వ్యాధి వంశపారంపర్యం కాదు. ఈ వ్యాధి ఎవరికైనా రావచ్చు, వయస్సు, లింగ భేదం లేదు. 1940లో కుష్టు వ్యాధి నివారణకు డప్సోన్ కనుగొనబడే వరకు కుష్టు వ్యాధి చికిత్స కోసం చౌల్మూగ్ర నూనెను వాడేవారు. 1970లో కుష్టు వ్యాధి నయంచేయడానికి రిఫాంపిసిన్, చలోఫజీమైన్ మరియు డప్సోన్ లతో కలసి ఉన్న బహుళ ఔషధ చికిత్స కనుగొన బడినప్పటికీ, 1982నుండి ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల మేరకు విస్తృతంగా వాడుకలోకి వచ్చింది. 1995 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు రెండునుంచి మూడు మిలియన్ల మంది ఈ వ్యాధికి గురై, వికలాంగులుగా మారినట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు పేర్కొంటు న్నాయి. గత రెండున్నర దశాబ్దాల కాలంలో సుమారు 15 మిలియన్ల మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి వ్యాధిని తగ్గించారు. ముదిరిన స్థాయిలో ఉండే కుష్టు వ్యాధి గురించి ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా అనే రకాల అపోహలు ఉన్నాయి. వీటిని ఏజ్ ఓల్డ్ సోషల్ స్టిగ్మా అని కాని లెప్రసీ స్టిగ్మా అని కాని వ్యవహరిస్తుంటారు. ఈ స్టిగ్మా కారణంగానే బాధితులు తొలి దశలోనే స్వయంగా చికిత్సకు వైద్యుల వద్దకు రావడానికి జంకుతుంటారు. అందుకే ప్రజలలో కుష్టు వ్యాధిపై అవగాహన పెంపొందించాలి. వ్యాధి బారినపడ్డ వారికి అవసరమైన మేరకు సాధారణ మరియు ఉచిత చికిత్స అందించడానికి చర్యలు గైకొనాలి. వ్యాధి బారిన పడిన వ్యక్తికి చర్మంపై వచ్చే పుళ్ళు మరియు నరాల బలహీనత వల్ల భౌతిక లోపాల విషయంలో మానసిక ధైర్యం పెంపొందించడానికి కృషి చేయాలి. వ్యాధి బారిన పడిన వారందరికీ అవసరమ్మైన శ్రద్ధ, చికిత్సతో పాటు పునరావాసం కల్పించే చర్యలు తీసుకోవాలి. కుష్టు వ్యాధి నివారణలో భారతదేశం విజయవంతమైన కృషి చేస్తున్నది. 1955లో జాతీయ కుష్టు వ్యాధి నియంత్రణ కార్యక్రమం, 1983లో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం ప్రారంభించింది. 1983 నుండి దశల వారీగా బహుళ ఔషధ చికిత్స నిర్వహిస్తూ, 2005లో 10000 మంది జనాభాకు 0.95 మంది చొప్పున మాత్రమే ఉండేట్టుగా 31 డిసెంబర్ 2005 నాటికి కుష్టు వ్యాధి నివారణ జరిగింది. కుష్టు వ్యాధిని, 10000 మంది జనాభాకు ఒకరి వరకు తగ్గించడం ప్రపంచ వ్యాప్తంగా అంగీకరించారు. మార్చి 2011లో ప్రాబల్యం రేటు 10000 జనాభాకు నుంచి 0.69 వద్ద నిలిచింది. 2012 నుండి ప్రత్యేక చర్యలకు ప్రణాళిక చేపట్టడం జరిగింది.

# స్వాతంత్ర్య సమరయోధులు

ఆయనొక పోరాట యోధులు. స్వాతంత్ర్య పోరాటంలో భారత మాత దాస్య శృంఖలాల విముక్తి కోసం సర్వం త్యాగం చేసిన మేరు నగ ధీరులు. అలా అంటే ఆయన ఒప్పుకునే వారు కాదు. భరత మాత దాస్య విముక్తి కోసం రాజీ లేని పోరు సల్పిన అశేష దేశభక్తు లలో తామూ ఒకరమని అంటూ ఉండే వారాయన. ఆయనే ధర్మపు రి క్షేత్రానికి చెందిన స్వాతంత్ర్య సమర యోధులు, మాజీ మంత్రి కర్నె వెంకట కేశవులు (జననం 14-1-1924.. మరణం 30-1-2019). 1924 జనవరి 14న ధర్మపురి క్షేత్రంలో గోదావరి తీరాన గల తమ ఇంటిలో జన్మించిన కేశవులు, ధర్మపురి, కొత్తపల్లి, జగిత్యాల పాఠశాలలో విద్యా భ్యాసం గావించారు. జగిత్యాలలో 6వ తరగతిలోనే వందేమాతరం గీతాలాపన చేసి, శిక్షకు గుర య్యారు. అనంతర కాలంలో ధర్మపురి, ఆదిలాబాద్ ప్రాంతాలలో నిజాం నిరంకుశ పాలనకు వ్యతి రేకంగా తిరుగుబాటు బాట పట్టి, స్వాతంత్ర్య ఉద్యమం గూర్చి మారుమూల గ్రామాలలో చైతన్య కాంతులు వెలిగించడంలో కృత కృత్యులైనారు. ధర్మపురి క్షేత్రంలో సాహిత్య, నాటక సంస్థల వ్యవస్థా పనలకు కారణభూతులై, సొంత ఇంటిలో గ్రంథాలయం నిర్వహిం చారు. నైజాం ఏలుబడి ప్రాంతంలో జాతీయ పతాకావిష్కరణలు నిషేధితాలు. కఠినతర నేరంగా పరిగణించాలని ఆదేశాలున్న నేపథ్యం తాము కోరుకున్న స్వాతంత్ర్యం సిద్ధించిన శుభ తరుణాన, ధర్మపురి క్షేత్రవాసు లందరినీ పిలిచి, మరీ తమ స్వంత ఇంటి పైనే జాతీయ జెండా ఎగుర వేసారు. నాటి పోలీసులు విషయం తెలిసి హుటాహుటిన నాన్ బెయిల బుల్ వారంట్ తో విచ్చేయగా, మరో అనుచరులు, పౌరాణిక ప్రసిద్ధులు సంగనభట్ల మాణిక్య శాస్త్రితో కలిసి, తమ ఇంటి ముందు నుండి ప్రవహిస్తున్న నిండు గోదావరిలో దూకి, బల్లకట్టు ద్వారా ఇరువురు మంచిర్యాల రేవుకు, తద్వారా రైలు ద్వారా ముంబాయి చేరుకుని, అజ్ఞాత వాసం గడిపారు. తర్వాతి కాలంలో సిర్పూర్ ఎమ్మె ల్యేగా, రాష్ట్ర చేనేత సహకార మంత్రిగా, స్వాతంత్ర్య సమరయో ధుల సంఘ వ్యవస్థాపక బాధ్యుని గా పని చేశారు. కేశవులు జీవితంలో ఇది ఒక పార్శ్వం కాగా, తెలంగాణ లోనే మొదటిదైన ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ నాట్య మండలి నాటక సంస్థ 1936 ప్రారంభ దశలో మేకప్ మన్ గా, పాత్రాలంకరణ నిపుణులుగా, ప్రయోక్తగా, చింతా మణిలో భవానీ శంక రుడుగా, మధుసేవలో శర్మగా, రామదాసులో తానీ షాగా విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1938లో ప్రధానంగా ఫిబ్రవరి 1వ తేదీన మంచిర్యాలలో జరిగిన ఆంధ్ర సారస్వత పరిషత్ మహా సభలు నస్పూరు శ్రీరాజా మురళీమనోహర్ రావు అధ్యక్షు లుగా, కేవి కేశవులు కార్యదర్శిగా నిర్వహించారు. మండలి బాధ్యునిగా, కేశవులు ఆనాడు ధర్మపురి నాట్యమండలిచే శ్రీకృష్ణ తులాభారం సాంప్రదాయ పద్య పౌరా ణిక నాటకం వేయించారు. ప్రప్రథమ ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఆంధ్రపితామహ మాడ పాటి హన్మంతరావు, విమర్శ నాగ్రేసరులు సురవరం. ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామాను జరావు, కాళోజీ నారాయణ రావు, నార్ల వేంకటేశ్వర్ రావు, వానమామ లై వరదాచార్య తదితరులను ఆహ్వానింప చేసి, నాటక వీక్షణం గావింప చేశారు. నాటకం ఆసాంతం చూసిన ప్రముఖులు ఎంతగానో ప్రశంసించారు. ఇటీవల చివరిసారి ధర్మపురి స్వామి దర్శనం చేసుకు నేందుకు విచ్చేసిన సందర్భంగా, "తెలంగాణ ప్రభుత్వం కళా రంగానికి, కళాకారులకు అనేక ప్రోత్సాహ పథకాలను చేపట్టింది. పట్టణానికి దూరం కావడం వల్ల కొంతవరకు ఈ సంస్థకు కొంత నష్టం - ఒకింత అన్యాయం జరిగిందని నేను భావిస్తున్నా. ఇప్పుడా లోపం తీనిపోతుందని ఆశి స్తున్నా" అన్నారాయన. కేశవులు తమ 97వ ఏట 2019 జనవరి 30వ తేదీన సాయంత్రం హైదరాబాద్, అమీర్ పేటలోని ధరంకరం రోడ్లోని తమ స్వగృహంలో కన్ను మూశారు. ఇటీవలే కేశవులు కూతురు రచించిన నాన్నకు ప్రణతి పేరుతో పుస్తకాన్ని కేశవులు ట్రస్ట్ ఆధ్వర్యంలో ధర్మపురిలో ఆవిష్కరించారు.

# గచ్చిబౌలిలో సెక్స్ రాకెట్ గుట్టు రట్టు

హైదరాబాద్ గౌలిదొడ్డి టీఎన్జీవో కాలనీలో ఫారిన్ అమ్మాయిలతో వ్యభిచారం గుట్టు రట్టయింది. మాదాపూర్ ఎస్ఓటీ, హెచ్టిఎఫ్ అధికారుల వ్యభిచార గృహంపై దాడులు జరిపారు. కెన్యా, టాంజానియా, బ్యాంకాక్కు చెందిన యువతులతో వ్యభిచారం చేయిస్తున్నట్లు గుర్తించారు. తొమ్మిది మంది ఫారిన్ అమ్మాయిలను అదుపులోకి తీసుకున్నారు.

# స్వాతంత్ర సమరయోధులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కేవి కేశవులు

## –నేడు ఆయన వర్ధంతి

తెలంగాణ రాష్ట్రానికి చెందిన స్వతంత్ర సమరయోధులు కర్నె వెంకట కేశవులు. ఈయన రాజకీయ నాయకుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జౌలి శాఖ సహకార మంత్రిగా పని చేశాడు.కె.వి.కేశవులు 1924 జనవరి 14న తెలంగాణ రాష్ట్రం జగిత్యాల జిల్లా ధర్మపురిలో జన్మించాడు. ఆయన విద్యాభ్యాసమంతా ధర్మపురిలో పూర్తి చేశాడు.

కె.వి.కేశవులు భారత స్వతంత్ర ఉద్యమంలో కీలకంగా పని చేస్తూ ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర సమరయోధుల సంఘం వ్యవస్థాపక కార్యదర్శిగా పని చేశాడు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక హైదరాబాద్ (నైజాం) సంస్థానం భారతదేశంలో కలవలేదు. ఆయన నిజాం నిరంకుశపాలన గురించి ప్రజలను చైతన్య వంతులను చేయడం, వారి అరాచకాలను మొండిగా ఎదిరించి జాతీయ పతాకాన్ని రెప రెప లాడించి, నాటకాలు, సాహిత్యాలతో ప్రజలను కార్మోకులను చేయడంలో కీలక పాత్ర పోషించాడు. హైదరాబాద్ రాష్ట్రం భారతదేశం ప్రభుత్వ పాలనలో విలీనమైన తరువాత ఆయన కాంగ్రెస్ పార్టీలో చేరాడు.

కె.వి.కేశవులు 1972, 1978లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గం నుండి పోటీ చేసి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి జౌళి శాఖ సహకార మంత్రిగా పని చేశాడు.30 జనవరి 2019లో వృద్ధాప్య కారణాలతోహైదరాబాద్ లో మృతి చెందారు.

# ఏపీలో ఏం జరుగుతోంది

విజయవాడ, జనవరి 29 రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకనే సంక్షేమ పథకాలను అమలు చేయలేదని చంద్రబాబు చెబుతున్నారు. రేపు జగన్ కూడా అలా అనరన్న గ్యారంటీ లేదు. చంద్రబాబు చెప్పినట్లు వరసగా అధికారం ఎవరికి ఇవ్వకపోయినా అభివృద్ధి పథకాలు ఆగిపోతాయి. అందులో ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యేక రాజకీయాలున్నాయి. అందుకు రాజకీయ నేతలే కారణం. వ్యక్తిగత కక్షలతో ఏపీలో రాజకీయాలు చేసుకునే వారు ఎక్కువగా ఉన్నారు. ఇందులో ఎవరూ మరొకరికంటే తక్కువ కాదు. వైసీపీ అధికారంలో ఉండగా కమ్మ సామాజికవర్గం వారి ఆర్థిక మూలాలను చెరిపేయడానికి జగన్ ప్రయత్నించారు. అందులో నిజం లేకపోలేదు. ఎందుకంటే టీడీపీకి ఆర్థికంగా సాయం చేయగలిగిన వారిని ఆర్థికంగా లేవనివ్వకుండా కొట్టగలిగితే తాను ఎన్నికలలో సులువుగా విజయం సాధించాలని భావించి ఆ పనికి దిగారు. ఎన్ని విమర్శలు వచ్చినా జగన్ ఆ విషయంలో మాత్రం వెనక్కు తగ్గలేదు. అలాగే చంద్రబాబు 2014లో మొదలు పెట్టిన అనేక అభివృద్ధి పనులను తాను అధికారంలోకి రాగానే నిలిపేశారు. రాజధాని అమరావతి నిర్మాణాన్ని పూర్తిగా నిలిపేశారు. అమర్ రాజా వంటి కంపెనీలపై దాడులు చేశారు. పలు కంపెనీలు వెనక్కు పంపేలా చేశారు. ఎందుకంటే జగన్ ప్రాధాన్యతలు వేరు. ఆయన పూర్తిగా సంక్షేమంపైనే ఆధారపడి పాలన ఐదేళ్ల పాటు సాగించారు. తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకు ఏర్పాటవుతుందని, తద్వారా తన గెలుపు మరోసారి సాధ్యమవుతుందని భావించారు. అందుకే ఆయన సంక్షేమ పథకాలకు దాదాపు ఐదున్నర లక్షల కోట్ల రూపాయలు లబ్దిదారులకు అందచేశారు. అప్పులు తెచ్చి మరీ సంక్షేమాన్ని అమలు చేయడానికి జగన్ ఏమాత్రం వెనకాడలేదు.. ఇక చంద్రబాబు అధికారంలోకి వచ్చీ రాగానే తన ప్రయారిటీ ఇదీ అని చెప్పకనే చెప్పారు. అమరావతి, పోలవరం నిర్మాణం తొలి ప్రాధాన్యత అని ఆయన చెప్పారు. అలాగే వాటికి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కానీ సంక్షేమానికి తన వద్ద డబ్బుల్లేవంటున్నారు. ఈయన ప్రాధాన్యతలు ఇవీ. జగన్ పెట్టిన పలు సంక్షేమ పథకాలకు పేరు మార్చారు. అంతే కాదు ఆరోగ్య శ్రీ వంటి పథకాలను కూడా ఎత్తివేయడానికి బీమా పథకాన్ని తెచ్చే యోచనను చంద్రబాబు చేశారు. అయితే ఎన్నికలకు ముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చంద్రబాబుకు తెలియదా? అంటే అంతా తెలుసు. కానీ గెలుపు కోసం అలివికాని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం తానేమీ చేయలేనని అర్థం చేసుకోవాలంటూ జనాన్ని కోరుతున్నారు. జనం మాత్రం మొన్నటి వరకూ తమ బ్యాంకు ఖాతాల్లో ఏదో ఒక పథకం ద్వారా ప్రభుత్వం నుంచి డబ్బులు పడేవి. అయితే గత ఏడు నెలలుగా అవి అందడం లేదు. సహజంగా ఒకవర్గం ప్రజల్లో ఇది అసంతృప్తి ఎక్కువగానే ఉంది. వారంతా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లు వేసే వారే. కానీ ఎక్కువ మంది చంద్రబాబు ఆలోచనను కూడా సమర్థిస్తున్నారు. సంక్షేమం పేరుతో అభివృద్ధిని పూర్తిగా విస్మరిస్తే ఎలా? రాష్ట్రం ఇక ఎప్పుడు డెవలెప్ అవుతుంది? తమ తర్వాత తరం ఇబ్బందులు పడాల్సి వస్తుందోనన్న ఆందోళన ఎక్కువ మంది ప్రజల్లో ఉందని కూడా అంతే నిజం. అందుకే ఏపీలో ప్రభుత్వం మారినా ఒకరి పాలనపై మరొకరు సాకులు చెప్పుకుంటారు. వారిపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తారు. ఇది ఫిక్స్.. ఇందులో ఏమాత్రం మార్పు ఉండదు. ఎన్నికలకు ముందు ఒకరీతిలో.. ఎన్నికల తర్వాత మరొక తీరులో వ్యవహరించడం ఏపీ పొలిటికల్ లీడర్స్ అందరికీ వెన్నతో పెట్టిన విద్య. మధ్యలో మాత్రం మోసపోయేది జనం మాత్రమేనన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. మరి ఏపీని ఇక ఎవరూ బాగుపర్చే అవకాశం లేదా?

# ఐటీ హబ్ గా విశాఖ

విశాఖపట్టణం, జనవరి 29, ఏపీని టెక్నాలజీ రంగంలోనూ ముందు వరుసలో నిలపాలని భావిస్తున్న కూటమి ప్రభుత్వం.. రాష్ట్రానికి అంతర్జాతీయ టెక్ సంస్థల్ని తీసుకురావాలని భావిస్తోంది. ఐటీ రంగంలో అగ్రగామి నగరాల్లో ఒకటిగా ఉన్న హైదరాబాద్ మోడళ్ ను అనుసరించి ఏపీలోనూ టెక్ రంగానికి సరికొత్త అవకాశాలు కల్పించాలనుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పటికే ఐటీ సంస్థలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికే దృష్టి పెట్టిన సర్కార్.. టెక్ సంస్థల కోసం ప్రత్యేక సిటీని నిర్మించాలని తలపెట్టింది. రానున్న రోజుల్లో టెక్ రంగంలో మంచి అభివృద్ధికి అవకాశం ఉన్న డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆవిష్కరణల కోసం ఒక హబ్‌ను ఏర్పాటు చేయాలనే భావిస్తోంది. ఇందుకోసం.. సముద్ర తీర పట్టణం విశాఖకు సమీపంలో ప్రతిష్టాత్మకమైన "డేటా సిటీ"ని నిర్మించాలని నిర్ణయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్నికల హామీలో మోజార్టీ ఉద్యోగాలను ఈ ప్రాజెక్టు ద్వారానే నెరవేర్చాలని భావిస్తోంది.విశాఖపట్నం సమీపంలోని మధురవాడలో 500 ఎకరాల్లో ఈ డేటా సిటీని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ సిటీ కేంద్రంగానే.. ఐటీలోని విభిన్న కేటగిరీల్లో సేవలందించే ఐటీ సంస్థలకు స్థానం కల్పించనున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. హైదరాబాద్ లో సైబర్ టవర్స్ ను నిర్మించారు. దాని కేంద్రంగా అనేక అంతర్జాతీయ ఐటీ సంస్థలకు ఆఫీస్ స్పేస్ కల్పించి.. అనేక సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేలా ఆకర్షించగలిగారు. సరిగా.. ఇప్పుడు కూడా అలానే విశాఖలో ఐటీ సంస్థలకు భారీ స్థాయిలో ఆఫీస్ స్పేస్ అందుబాటులోకి తీసుకువచ్చి, పెట్టుబడుల్ని ఆకర్షించనున్నారు. ఈ ఐటీ సిటీ.. టెక్నాలజీ, ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా ఉండాలనే ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే.. అంతర్జాతీయంగా అనేక దిగ్గజ టెక్ దిగ్గజాలు రాష్ట్రంలో పెట్టుబడులకు ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో.. ప్రభుత్వం సైతం భూ సేకరణకు కసరత్తు ప్రారంభించింది.ఇప్పటికే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో కొన్ని సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. వాటిలో గూగుల్ ఒకటి. ఈ సంస్థ ఏపీ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయు)పై సంతకాలు చేసింది. ఆ సంస్థ భారీ డేటా సెంటర్ ను ఏర్పాటు చేస్తుండగా, ఇందుకోసం 80 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం అందించనుంది. అదే విధంగా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ 30 ఎకరాల్లో ఐటీ ప్రాంగణాన్ని నెలకొల్పనుండగా, ఇక్కడి నుంచి కార్యకలాపాలు విస్తరించేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించిందిదావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్)లో జరిగిన కీలక చర్చల తర్వాత ఆంధ్రప్రదేశ్ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ రూపొందించిన డేటా సిటీ కాన్సెప్ట్ ఊపందుకుంది. రాష్ట్రానికి డేటా సెంటర్లు, ఏఐ హబ్‌లను తీసుకురావడానికి లోకేశ్ టెమాసెక్ హోల్డింగ్స్, కాగ్నిజెంట్‌తో సహా ప్రముఖ సంస్థలతో చర్చలు జరిపారు.ఐటీ మంత్రి నారా లోకేష్ దావోస్ పర్యటనలో ఐటీ సంస్థలు, డేటా సెంటర్లు, అల్ డీప్ టెక్ సంస్థలు ఏపీలో పెట్టుబడులకు ఆసక్తి ఉన్నట్లు గుర్తించినట్లు వెల్లడించారు.

అందుకోసమే.. ఆయా సంస్థలకు మంచి వసతులు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం.. వైజాగ్ సమీపంలో ఐటీ సంస్థలన్నింటినీ కేంద్రీకృతం చేసేలా ప్రత్యేక ప్రాజెక్టు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

# ఫ్రీ బస్సు భారమా...

హైదరాబాద్, జనవరి 29, తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సుకు భారంగా మారిందని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. తమ డిమాండ్ల సాధన కోసం తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాలు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చాయి. అనేక డిమాండ్లను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం విఫలమయిందని ఆరోపిస్తున్నాయి. కార్మికుల సంక్షేమాన్ని పక్కన పెట్టినందునే తాము సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని చెబుతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో సమ్మె చేయడంతో ఆయన ఆర్టీసీ కార్మికుల డిమాండ్లకు తలొగ్గ లేదు. పైగా ఆర్టీసీపై కఠిన నిర్ణయం తీసుకుంటానని ప్రకటించడంతో పాటు యూనియన్లను కూడా రద్దు చేయాలని నిర్ణయించారు. దీనికి కారణం మహిళలకు ఉచిత బస్సు పథకమేనని కార్మిక సంఘాలు అంటున్నాయి. ఉచిత కోచింగ్ హామీలు అమలు చేయకుండా... తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే అది ఆచరణలో అమలుకు నోచుకోలేదు. దాదాపు మూడున్నర లక్షల మంది వరకూ ఉన్న ఆర్టీసీ కార్మిక కుటుంబాలను మంచి చేసుకునేందుకు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీలు ఇచ్చింది. అయితే రెండు పీఆర్సీలు ఇంత వరకూ చెల్లించలేదు. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనంచేయలేదు. సీసీఎస్, పీఎఫ్ డబ్బులు 2,700 కోట్ల చెల్లింపులు చేయడంతో పాటు ఇరవై ఏడురకాల తమ డిమాండ్లను యాజమాన్యం ముందు ఉంచారు. ప్రధానంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రయివేటు పరం చేయడాన్ని వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పై కూడా ఆర్టీసీ కార్మికసంఘాలు గుర్రుగా ఉన్నాయి. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, 2021 జీతభత్యాల సవరణ, కండక్టర్ డ్రైవర్ల ఉద్యోగ భద్రత, విద్యుత్ బస్సులు ప్రభుత్వమే ఆర్టీసీ కొనుగోలు చేసి ఇవ్వాలన్నది కార్మిక సంఘాల ప్రధాన డిమాండ్లుగా వినిపిస్తున్నాయి. వీటిని పరిష్కరించకపోతే ఫిబ్రవరి 9వ తేదీ నుంచి సమ్మెకు వెళతామని ఆర్టీసీ కార్మిక సంఘాలు హెచ్చరించాయి. అయితే ప్రధానంగా మహిళలకు ఉచిత బస్సు విధానంతోనే ఆర్టీసీ మరింత నష్టాల్లోకి వెళుతుందని, ప్రభుత్వం నెలకు నాలుగు వందల కోట్ల రూపాయలు ఆర్టీసీకి చెల్లించాల్సి రావడంతో కార్మిక సంఘాల డిమాండ్లను పక్కన పెట్టిందని వారు ఆరోపిస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు తెలంగాణలో సమ్మెనోటీసు ఇవ్వడంతో వారితో ప్రభుత్వం చర్చలు జరిపేందుకు

# ఇండియా... ఇప్పుడు సూపర్ పవర్

భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే అగ్రరాజ్యాంగా ఎదుగుతోంది. దీంతో పాటే.. భారత రక్షణ సామర్థ్యాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. భారత్ అమ్ములపొదిలో కొత్త కొత్త ఆయుధాలు వచ్చి చేరుతున్నాయి. ముఖ్యంగా, ఆత్మనిర్భర్ భారత్ తన సొంత టెక్నాలజీతో ప్రపంచం ఉలిక్కిపడే ఆయుధాలను తయారు చేస్తోంది. ఇందులో భాగంగానే.. ఈ రిపబ్లిక్ డే పెరేడ్‌లో రెండు కీలక ఆయుధాలను దేశానికి పరిచయం చేయబోతున్నారు. శత్రు దేశాల వెన్నులో వణుకుపుట్టించే ఈ క్షిపణులు 75 ఏళ్ల గణ తంత్ర దినోత్సవ వేడుకలో మరింత ప్రత్యేకంగా నిలిచాయిభారత్ అంటేనే ఇప్పుడు ప్రపంచమంతా అలెర్ట్ అవుతోంది. అంతర్జాతీయంగా భారతదేశ పరపతి అగ్రదేశాలకు దాదాపు సమానమయ్యింది. ముఖ్యంగా, రక్షణ రంగంలో భారత్ తన సత్తా ఏంటో ప్రపంచానికి చూపిస్తోంది. "ఎప్పుడొచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా.. లేదా" అనే లెవల్లో? ఒకప్పుడు, కాస్త వీక్‌గా ఉన్న భారత రక్షణ రంగం? ఇప్పుడు సగర్వంగా ఛాతి చూపి నిలుస్తోంది. జబ్బ చరిచి కమాన్ అనే స్థాయికి వెళ్లింది. బంగ్లాదేశ్ లాంటి తోక ఊపుళ్లకే కాదు.. ఆగర్భ శత్రువు పాకిస్తాన్‌తో పాటు.. చారిత్రక ఎనిమీ చైనాలకు కూడా చెమటలు పట్టించేంతగా భారత్ రక్షణ సామర్థ్యం పెరిగింది.ఇప్పుడు, అగ్ర రాజ్యాలను సైతం కించింతైనా కేర్ చేయని స్థాయిలో భారత్ త్రివధ దళాలు బలం పుంజుకున్నాయి. ఒకప్పుడు, దిగుమతులపై ఆధారపడిన భారత్ రక్షణ రంగం.. 75 ఏళ్ల గణతంత్రం జరుపుకునే నాటికి ప్రపంచానికి సరికొత్త ఆయుధాలను పరిచయం చేస్తోంది. ఫ్రాన్స్ లాంటి అగ్రదేశాలు కూడా భారత్ ఆయుధాలపై ఆసక్తి చూపుతున్నాయి. దటీజ్ భారత్ అనే విధంగా భారతదేశం తన వెపనరీని అభివృద్ధి చేసుకుంది. అందులో, సరికొత్తగా రెండు కీలకమైన ఆయుధాలను ఈ రిపబ్లిక్ డేలో ప్రదర్శిస్తున్నారు.శత్రుదేశాల కుతంత్రాలను ధీటుగా ఎదుర్కోవాలంటే రక్షణ రంగంలో మెరుగైన ఆయుధ సంపత్తి అవసరం. అందుకే భారత్ కొన్నేళ్లుగా దీనిపై దృష్టి సారించింది. అనేక స్వదేశీ ఆయుధాలను సిద్ధం కూడా చేసింది. అందులో అత్యంత ముఖ్యమైంది పినాక. భారత భూభాగంపై కన్నేసిన చైనాకు షాకిచ్చే విధంగా భారత తన సొంత టెక్నలజీతో ఈ కొత్త వెపన్‌ను తయారుచేసింది. ఇటీవల కాలంలో అభివృద్ధి చేసిన ఈ పినాక ఎంకే-1ను భారత్ ఈ గణతంత్ర దినోత్సవంలో ప్రదర్శించనుంది. భారీ లక్ష్యాలను సైతం ఛేదించగల పినాక మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్, ప్రత్యర్థి తేరుకునేలోపే టార్గెట్‌ను బూడిదగా మార్చేస్తుంది.సాయుధ బలగాల కార్యచరణ సంసిద్ధతను మెరుగుపరచడంలో భాగంగా.. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో పినాక రెజిమెంట్‌లను మోహరిస్తున్నారు. పినాక మార్క్-1 కు 45 కి.మీ., మార్క్-2 కు 65 కి.మీ. పరిధి ఉంది. పినాక వ్యవస్థ 44 సెకండ్లలో 12 హై ఎక్స్‌ప్లోజివ్ రాకెట్లను పేల్చగలదు. ఈ వ్యవస్థ తేలిగ్గా రవాణా చెయ్యగలిగేలా, టాటా ట్రక్కుపై మోహరించి ఉంటుంది. ఇది మొదట కార్గిల్ యుద్ధంలో పాల్గొంది. పర్వతాలపై ఉన్న శత్రు దళాలను విజయవంతంగా నిర్వీర్యం చేసింది. తర్వాత, దీన్ని భారత సైన్యంలో పెద్ద సంఖ్యలో చేర్చుకున్నారు.2014 నాటికి, ఏటా 5,000 పినాక రాకెట్లు ఉత్పత్తిలో ఉన్నాయి. ఎక్కువ పరిధి, అధిక కచ్చితత్వం కలిగిన మెరుగైన పినాక అభివృద్ధి దశలో ఉంది. ఈ పినాక వ్యవస్థ ధర రూ.2.3 కోట్లు. పినాక ఒక సంపూర్ణ రాకెట్ వ్యవస్థ. ఒక్కో పినాక బ్యాటరీలో? ఒక్కో దానిలో 12 రాకెట్లు కలిగిన 6 లాంచరు వాహనాలు, 3 రాకెట్ సరఫరా వాహనాలు, ఫైర్ కంట్రోల్ కంప్యూటర్ ఉన్న 2 కమాండ్ పోస్ట్ వాహనాలు ఉంటాయి. ఇందులో ఒక డిజికోరా మెట్ రాడార్ వ్యవస్థ కూడా ఉంటుంది. 6 లాంచర్లు కలిగిన ఈ బ్యాటరీ.. 1000 మీ విస్తీర్ణంలోని ప్రాంతాన్ని నిర్వీర్యం చెయ్యగల సార్థ్యంతో పనిచేస్తుంది. ఇలాంటి, 72 రాకెట్లు కలిగిన బ్యాటరీని సైన్యం మోహరిస్తుంది.ఈ రాకెట్లన్నిటినీ 44 సెకండ్లలో పేల్చొచ్చు. ఇక, ప్రస్తుత ప్రపంచ ఉద్రిక్తతల మధ్య చాలా దేశాలు మల్టీ బ్యారెల్ రాకెట్ లాంచర్ల పట్ల ఆసక్తిని కనబరుస్తున్న తరుణంలో.. పినాక రాకెట్‌ను ఆర్మేనియాకు కూడా సరఫరా చేయడం ప్రారంభించింది. అత్యంత శక్తివంతమైన ఈ స్వదేశీ పినాక రాకెట్‌పై ఇటీవల ఆగ్నేయాసియా, యూరప్‌లోని అనేక దేశాలు కూడా ఆసక్తి చూపిస్తున్నాయి. అంతెందుకు, ప్రపంచంలోని అతి శక్తిమంతమైన దేశాల్లో ఒకటైన ఫ్రాన్స్? ఓ51 జలాంతర్గాములు, రాఫెల్ యుద్ధవిమానాలు, లుకలెహా శతఘ్నుల వంటి అధునాతన ఆయుధ వ్యవస్థలు ఉన్నప్పటికీ?భారత్‌కు చెందిన పినాకను కావాలనుకుంటోంది. ఇందులో భాగంగా, గతేడాది నవంబర్ నుండి ఫ్రెంచ్ ఆర్మీ అధికారులు భారత్‌తో చర్చలు జరుపుతున్నారు.ఇక, మరో అత్యద్భుతమైన ఆయుధాన్ని కూడా ఈ రిపబ్లిక్ డేలో భారత్ ప్రదర్శిస్తోంది. మొట్టమొదటిసారిగా పరేడ్‌లో ప్రళయ్ మిస్సైల్ కన్పించనుంది. ఇది శత్రువులకు సవాలుగా మారే అత్యాధునిక ఆయుధం. డీఆర్డీవో అభివృద్ధి చేసిన ఈ మిస్సైల్ భారత్ శక్తి సామర్థ్యాలకు ఓ మచ్చుతునక. సరిహద్దు రక్షణలో ప్రళయ్ మిస్సైల్ కీలకంగా మారుతుంది. చైనా, పాక్‌లకు చెక్ పెట్టడానికి, ప్రత్యేకంగా ప్రళయ్‌ను ఎల్ఐసీ, ఎల్ఓసీ వెంట మోహరించేందుకు రూపకల్పన జరిగింది.శత్రువుల వ్యూహాల్ని ఇది ధ్వంసం చేయగలదు. ఇతర మిస్సైల్స్‌తో పోలిక ప్రళయ్ మిస్సైల్‌ను చైనాకు చెందిన డోంగ్ ఫెంగ్ 12, రష్యాకు చెందిన ఇస్కాండర్ మిస్సైల్‌కు సమానమని తెలుస్తోంది. ఈ మిస్సైల్ యుద్ధ మైదానంలో శత్రువులకు దీటైన సమాధానం చెబుతుంది. ప్రళయ్ మిస్సైల్ సాంకేతిక ప్రత్యేకతలు ఈ మిస్సైల్ 350 కిలో మీటర్ల నుండి 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాలను ఛేదించగలదు. అలాగే, 500 నుండి 1000 కిలోల వరకూ పేలోడ్ తీసుకెళ్లగలదు. లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ–ఆఖీఆూ అభివృద్ధి చేసిన ఈ వార్ వెపన్.. భూ ఉపరితలం నుండి ఉపరితలం నుండి ప్రయోగించగలిగిన స్వల్ప-శ్రేణి బాలిస్టిక్ క్షిపణి. అత్యంత కచ్చితత్వంతో ఛేజ్ చేయగలిగిన ఈ మిస్సైల్‌ను మొబైల్ లాంచర్లతో ప్రయోగించొచ్చు. వీటిని క్వాసీ బాలిస్టిక్ మిస్సైల్స్‌గా పిలుస్తారు. ఇవి బాలిస్టిక్, క్రూయిజ్ మిస్సైల్స్ రెండింటి లాగా పనిచేస్తాయి. భారత రక్షణ రంగ వ్యూహంలో భాగంగా దేశ ఉత్తర సరిహద్దులను బలోపేతం చేయడానికి ప్రళయ్ క్షిపణి సేవలను వినియోగిస్తున్నారు.ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఉపయోగించిన 'ప్రలే' క్షిపణి, చైనా 'డాంగ్ ఫెంగ్ 12', రష్యా 'ఇస్కాండర్', దక్షిణ కొరియా హ్యూన్మూ-2తో పోల్చదగని ప్రళయ్‌ను ఇప్పుడు భారత్‌లోనే భారీ ఎత్తున ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటికే, ఇండియన్ ఆర్మీ, ఎయిర్ ఫోర్స్‌ల కోసం దాదాపు 500 వందల ప్రళయ్ క్షిపణులు ఆర్డర్‌లో ఉన్నాయి.ఇక, భారత సైన్యం, నిఘా సామర్థ్యాలను ఆధునీకరించే దిశగా భారత్ కీలక వ్యవస్థలను కూడా రూపొందిస్తోంది. తాజాగా, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ న్యూఢిల్లీలో ఓ యుద్ధభూమి నిఘా వ్యవస్థను ప్రారంభించారు. సంజయ్ అనే పేరుతో ఉన్న ఈ అధునాతన ఆటోమేటెడ్ సిస్టమ్.. గ్రౌండ్, ఏరియల్ సెన్సార్ల నుండి డేటాను సేకరిస్తుంది. ఈ ఇన్‌పుట్‌లు ఆర్మీ డేటా నెట్‌వర్క్, శాటిలైట్ కమ్యూనికేషన్ నెట్‌వర్క్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఏకీకృతం చేసి, కచ్చితత్వాన్ని నిర్ధారిస్తాయి. ఈ వ్యవస్థ యుద్ధభూమిలో ఏం జరుగుతుందో.. అద్దంలా చూపిస్తుంది.దీని ద్వారా, ఆర్మీ కమాండ్, హెడ్‌క్వార్టర్స్‌కు కేంద్రీకృత వెబ్ అప్లికేషన్‌తో నిర్ణయం తీసుకోవడానికి అవసరమయ్యే ఖచ్చితమైన, రియల్-టైమ్ సమచారాన్ని అందిస్తుంది. అత్యాధునిక సెన్సార్‌లు, అత్యాధునిక విశ్లేషణలతో రూపొందించిన 'సంజయ్' భారత భూ సరిహద్దులను పర్యవేక్షించడం, చొరబాట్లను నిరోధించడం, అనుమానమున్న పరిస్థితులపై అవగాహన కల్పించే విధంగా పనిచేస్తుంది. ఇది, ఇంటెలిజెన్స్, నిఘా కార్యకలాపాలలో కీలకంగా ఉంటుంది. ఇది భవిష్యత్ యుద్ధభూమిలో విప్లవాత్మక ఫలితాలను అందిస్తుందిభారత్ యుద్ధ సామర్థ్యం మామూలుగా లేదు. ప్రపంచంలోనే అతి పెద్ద సైన్యం కలిగిన మూడో దేశంగా ఉన్న భారత్‌ను ఎదుర్కోవాలంటే మూడు చెరువుల నీళు తాగాల్సిందే. ఇండియాన్ ఆర్మీ పవర్ తెలిపే ఒక మాట ఇక్కడ చెప్పాలి. "ఒక సైన్యంలో.. బ్రిటీష్ ఆఫీసర్, అమెరికన్ వెపన్స్, భారత సైన్యం ఉంటే? దాన్ని ఎవ్వరూ ఓడించలేరంట". ఈ పాత కాలం నాటి నానుడికి ఇప్పుడు సరికొత్త మార్పు తోడయ్యింది. లేటెస్ట్ టాక్ ఏంటంటే.. "ఇండియన్ ఆఫీసర్, ఇండియన్ సైన్యం, ఇండియా వెపన్స్ ఉంటే.." ఎవ్వరైనా అడుగు ముందుకెయ్యాలంటే హడలిపోవాల్సిందే! ఎందుకంటే, అలాంటి అత్యాధునిక ఆయుధాలు ఇప్పుడు భారత్ సొంతం.అలాగే, క్రూయిజ్ క్షిపణుల్లో భాగంగా.. హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్, నిర్భయా మిస్సైల్, బ్రహ్మోస్-ఔఉ లను కూడా అభివృద్ధి చేస్తోంది. ఇక, 'నాగ్' పేరుతో యాంటీ-గైడెడ్ ట్యాంక్ మిస్సైళ్లను కూడా రూపొందిస్తోంది. ఇక, న్యూక్లియర్ ట్రయాడ్ సామర్థ్యాన్ని కలిగి ఉన్న ప్రపంచంలోని 6వ దేశంగా భారత్ ఉంది. భూమి, నీరు, గాలి నుండి కూడా అణు దాడి చేయగల సామర్థ్యం భారత్ సొంతం. సో.. రక్షణ రంగంలో భారత్ సూపర్ పవర్‌గా ఎదుగుతుందనడాన్ని ఇవన్నీ స్పష్టం చేస్తున్నాయి. దీన్ని బట్టి, ఇకపై కూడా.. భారత్, తన సార్వభౌమత్వాన్ని, మాతృభూమిని ఏ ఇతర దేశం మద్దతు లేకుండా ఒంటరిగా కాపాడుకోగలదు.శత్రు దేశాలకు ధీటుగా.. అత్యాధునిక ఆయుధాలతో, భారత్ ఇప్పుడు తన సామర్థ్యాన్ని నిరూపించుకుంటుంది. ఇక, రాబోయేది ఏ యుద్ధం అయినా.. అది ఎవరితో అయినా.. భారత్ రెడీ!

# చలి పండుగకు అంతా సిద్ధం

విశాఖపట్టణం, జనవరి 29, అరకు వెళ్లే వారికి సూపర్ న్యూస్.. ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చలికాలంలో మంచు దుప్పటి కప్పుకున్న ప్రకృతి అందాలను చూడ్డానికి తెలుగు రాష్ట్రాల నుంచి మాత్రమే కాకుండా పొరుగున ఉన్న రాష్ట్రాల నుంచి కూడా అరకు లోయకు సందర్శకులు తరలివస్తుంటారు. శీతాకాలంలో అరకు లోయ అందాలను చూసి మైమరిచిపోతుంటారు. అలాంటి సందర్శకుల ఆనందాన్ని రెట్టింపు చేసేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఐదేళ్ల తర్వాత మళ్లీ అరకు ఉత్సవ్ నిర్వహిస్తోంది. అరకు ఉత్సవ్ 2025 పేరిట ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి అయ్యాయి.జనవరి 31 నుంచి మూడు రోజుల పాటు అరకు ఉత్సవ్ నిర్వహణకు అధికారులు సిద్ధమయ్యారు. తాజాగా అరకు ఉత్సవ్ నిర్వహణకు కోటి రూపాయలు కేటాయిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అరకు చలి పండుగకు కోటి రూపాయలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అరకు ఉత్సవ్‌తో పాటుగా ఫ్లెమింగ్ ఫెస్టివల్‌కు కూడా కోటి రూపాయలు మంజూరు చేశారు. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 2 వరకూ అరకు చలి పండుగ జరుగుతుంది. అరకు ఉత్సవ్ కోసం అధికారులు ఇప్పటికే కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే అల్లూరి జిల్లా కలెక్టర్ ప్లాస్టిక్ వాడకంపై నిషేధం విధించారు. అరకు ఉత్సవ్ చూడటానికి పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు 2020 ఫిబ్రవరిలో ఆఖరిసారిగా అరకు ఉత్సవ్ నిర్వహించారు. ఆ కార్యక్రమం సూపర్ హిట్టైందని అధికారులు చెప్తున్నారు.. అయితే ఆ తర్వాతి కాలంలో ప్రభుత్వం దీనిపై దృష్టి సారించలేదు. తాజాగా గత అరకు ఉత్సవ్‌ని నిర్ణయించాలని.. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన సంస్కృతిని చాటి చెప్పాలని అల్లూరి జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. ప్రభుత్వం అనుమతించింది. ఇక అరకు ఉత్సవ్ ప్రారంభానికి గుర్తుగా జనవరి 31 ఉదయం మారథాన్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.అరకు ఉత్సవ్‌లో భాగంగా జనవరి 31న పద్మాపురం గార్డెన్స్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జానపద కళాకారులతో కార్నివాల్, ఫ్లవర్ షోను ఏర్పాటు చేశారు. అరకు కాఫీ, గిరిజనులు తయారు చేసిన హస్తకళా రూపాలతో స్టాళ్లు, వన్ ధాన్, ఫుడ్ స్టాళ్లు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రెండో రోజు 20 కి.మీ సైక్లింగ్, పాఠశాల విద్యార్థులకు పోటీలు, ఫ్యాషన్ షో, టాలెంట్ షో నిర్వహించనున్నారు. అరకు ఉత్సవ్ నేపథ్యంలో అరకు ప్రాంతంలోని అన్ని టూరిజం హాట్‌స్పాట్‌ల వద్ద 'నో ప్లాస్టిక్ జోన్' ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. సందర్శకులు పర్యావరణ అనుకూల ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు.

# చంద్రబాబు సాఫ్ట్ కార్నర్ పై గుస్సా..

ఏలూరు, జనవరి 29, వైసీపీ ప్రభుత్వంలో బాధితులుగా ఉన్న వారి విషయంలో చంద్రబాబు సానుకూల ధృక్పదంతోనే ఉన్నారు.. వారిలో కొందరికి నామినేటెడ్ పదవులు కూడా కట్టబెడుతున్నారు.. అయితే పార్టీ కేడర్ని ఇబ్బందులకు గురి చేసిన వారి విషయంలోనూ సాఫ్ట్ కార్నర్ చూపించడం సొంత పార్టీ నేతలకు మింగుడు పడటం లేదంట. దాంతో వారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటారా లేదా అన్న ఒత్తిడి పెంచేస్తున్నారంట.వైసీపీ ప్రభుత్వంలో మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయం ధ్వంసం, చంద్రబాబు నివాసంపై దాడి వంటి దౌర్జన్యాలు ఎన్నో జరిగాయి. అప్పటి నరసాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజుని వైసీపీ సర్కారు తీవ్రంగా వేధించిందన్న ఆరోపణలున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వంపై పోరాటం చేసి సీఐడీ కస్టడీలో టార్చర్ అనుభవించిన ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు..కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అప్పట్లో తనపై దాడి చేసిన వారిపై కేసు పెట్టారు. అయితే ఈ కేసులో ఇద్దరు సీనియర్ ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయుల్ని ఏ1, ఏ2లుగా చేర్చిన ప్రభుత్వం ఇప్పటివరకూ వారిని అరెస్టు చేయలేదు. అలాగే విచారణకు సైతం పిలవడం లేదు.

ఈ వ్యవహారాన్ని జీర్ణించుకోలేకపోతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామరాజు తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందంటూ పరోక్షంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు.ఐపీఎస్ అధికారులు పీవీ సునీల్ కుమార్, పీఎస్సార్ ఆంజనేయుల్ని ఎందుకు సస్పెండ్ కూడా చేయడం లేదో ప్రశ్నించాల్సిన వారిని త్వరలోనే ప్రశిస్తానంటూ రఘురామ టీజర్ రిలీజ్ చేశారు. దీంతో చంద్రబాబు ప్రభుత్వం ఇప్పుడు కచ్చితంగా వారిపై ఏదో ఒక చర్య తీసుకోవాల్సిన పరిస్దితి ఎదురవుతోంది. తాజాగా ఇదే కేసులో రఘురామ గుండెలపై కూర్చుని టార్చర్ చేశాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న కామేపల్లి తులసిబాబును పోలీసులు అరెస్టు చేశారు. జైల్లో తులసిబాబు ఐడెంటిఫికేషన్ పెరేడ్‌కు వెళ్లిన ఆర్ఆర్ఆర్ అతన్ని గుర్తుపట్టి వచ్చారు. దీంతో మూడు రోజుల పాటు పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది.అయితే ఈ కామేపల్లి తులసిబాబు టీడీపీ గుడివాడ ఎమ్మెల్యే అయిన వెనిగండ్ల రాము ప్రధాన అనుచరుడంటారు. దీంతో టీడీపీ తులసిబాబు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఆర్ఆర్ఆర్‌పై దాడి చేసిన నిందితుడిని ఇంకా పార్టీలో ఉంచడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో పార్టీలోనూ అంతర్గతంగా ఎమ్మెల్యేనా, డిప్యూటీ స్పీకరా తేల్చుకోవాల్సిన పరిస్దితి ఏర్పడింది. వెనిగండ్ల రాము ఎన్నారై. ఆయనకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నితో పాటు పార్టీలో బలమైన నేతల అండ ఉందంట. అందుకే ఈ కేసుకు సంబంధించి చర్యల విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోందంటున్నారు.అయితే తన యువగళం పాదయాత్రలో రెడ్ బుక్ ప్రకటన చేసిన టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్.. రెడ్‌బుక్‌లో నోట్ అయిన వారిని ఎవరినీ వదిలి పెట్టే ప్రసక్తి లేదంటున్నారు. విదేశాల్లో కూడా అదే చెప్పుకొస్తున్నారు. గత ప్రభుత్వం అక్రమాలపై ఒక్క సారిగా విచారణలు జరిపి చర్యలు తీసుకోవాలంటే లా అండ్ ఆర్డర్ పోలీసులు సరిపోరని, కాలక్రమేణా అందరిపై చర్యలుంటాయని స్పష్టం చేస్తున్నారు.ఒక వైపు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేష్‌లు అదే విషయాన్ని పదేపదే విషయాన్ని చెప్తున్నప్పటికీ.. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్నా చర్యలు ఎప్పుడు తీసుకుంటారని కూటమి శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. మరి ఆ కన్‌ఫ్యూజన్‌కి కూటమి పెద్దలు ఎప్పుడు తెర దించుతారో అని మిత్రపక్షాల కేడర్ ఉత్కంఠగా ఎదురుచూస్తుంది.

# ఒంటరైన నందిగం...

గుంటూరు, జనవరి 29, వైసీపీ అధికారంలో ఉన్నంత కాలం ఆ నాయకుడి హవా మామూలుగా ఉండేది కాదు. పేరుకి ఎంపీనే అయినప్పటికీ తనదైన దూకుడుతో యావత్తు రాష్ట్రంలో ఫోకస్ అయ్యారు. సామాజిక వర్గం లెక్కలతో జగన్ కూడా ఆయనకు అంతే ప్రాధాన్యత ఇవ్వడంతో సదరు నేత ఆగడాలకు అడ్డు అదుపూ లేకుండా పోయింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు ఆయనకు జగన్ అపాయింట్‌మెంట్ దొరికేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.. అప్పట్లో ఆయన దెబ్బకి స్థానిక ఎమ్మెల్యే కూడా బెంబేలెత్తిపోయారంట. వైసీపీలో అంత కీలకంగా వెలుగొందిన ఆయన ఇప్పుడు ఒంటరి అయ్యారు. లెటజ్ వాచ్‌ఉమ్మడి గుంటూరు జిల్లాలోని బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన నందిగామ సురేష్ 2019లో వీచిన వైసీపీ గాలిలో ఎంపీగా విజయం సాధించారు.. వైసీపీలో సామాన్య కర్యకర్తగా ఎంట్రీ ఇచ్చిన నందిగం సురేశ్? కూటమి అధికారంలో ఉన్నప్పుడు అమరావతి ప్రాంతంలో అధికార పక్షనాయకులు పంట పొలాలను తగులబెట్టి జగన్ దృష్టిలో పడ్డారు. దాంతో జగన్ బాపట్ల ఎస్సీ సెగ్మెంట్ నుంచి సురేష్‌బాబును జగన్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆ ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థి తెలుగు దేశం పార్టీ అభ్యర్థి మాల్యాద్రి శ్రీరాం పై 16, 065 ఓట్ల మెజారిటీతో గెలిచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు.ఎలాంటి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా.. పెద్దగా ఆర్థిక స్థోమత లేకపోయినా జగన్ ఆయనకి టికెట్ ప్రకటించడం అప్పట్లో రాజకీయంగా పెద్ద చర్చకు దారితీసింది. అయితే ఆయన బాపట్ల ఎంపీగా గెలిచినా ఆయన ఎప్పుడూ కూడా గుంటూరు పార్లమెంటు నియోజకవర్గంలోని తాడికొండ నియోజకవర్గం నుంచే రాజకీయ నడిపారు. నందిగం సురేష్ స్వగ్రామం తాడికొండ సెగ్మెంట్లో ఉండటంతో ఆయన వ్యవహారాలన్నీ అక్కడి నుంచే నడిపించారు. ఆ క్రమంలో అప్పటి తాడికొండ వైసీపీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవితో ఆయనకు ఎప్పుడూ గొడవలు జరుగుతూనే ఉండేవి.ఆ ఇద్దరి పంచాయతీల్లో వైసీపీ అధిష్టానం ఎప్పుడూ నందిగం సురేష్‌కు బాసటగా నిలిచిందన్న ప్రచారం ఉంది. ఎమ్మెల్యేని ఎప్పటికప్పుడు బుజ్జగిస్తూ నందిగామ సురేష్ కి పార్టీ అధిష్టానం ఫుల్ సపోర్ట్ చేసిందంటారు. దానికి కారణం నందిగం సురేశ్ ప్రదర్శించే దూకుడే.. ముఖ్యమంత్రిగా జాగన్ ఏ పిలుపు ఇచ్చినా సురేష్ ముందుండేవారు. టీడీపీ కేంద్ర కార్యాలయానికి సంబంధించినటువంటి దాడి కేసులోనూ నందిగామ సురేష్ కీలకంగా ఉన్నారు. అమరావతి రాజధాని ఉద్యమాన్ని అణగదొక్కి, జగన్ గుడ్‌లుక్స్‌లో పడటానికి ఆయన చేయని ప్రయత్నం లేదంటారు.తాడికొండ నియోజకవర్గం తుళ్లూరు పరిధిలో ఆయన ఒక స్థావరాన్ని ఏర్పాటు చేసుకున్నారు ఆయన ఇంటితోపాటు అక్కడ కొన్ని స్థలాలను అక్రమంగా అక్రమించి ఒక ప్లేగ్రౌండ్ ఏర్పాటు చేసే వరకు ఆయన దౌర్జన్యాలు సాగాయి. అమరావతి ఉద్యమంలో ఎవరైతే కీలకంగా మారుతున్నారో వారిపై నిఘా పెట్టి.. వారికి సంబంధించినటువంటి ఇన్ఫర్మేషన్‌లన్నీ అధిష్టానానికి నందిగామ సురేష్ చేరవేసే వారంట. వైసీపీ ఎమ్మెల్సీ, రౌడీ షీటర్ అప్పి రెడ్డి ఏం చెప్తే అది చేసేవారంట. అప్పిరెడ్డికి ప్రధాన అనుచరుడు టిడిపి కేంద్ర కార్యాలయం దాడిలో మొదటి ముద్దాయిగా ఉన్న పానుగంటి చైతన్య ఎప్పుడు కూడా నందిగామ సురేష్‌తోనే ఉంటూ పంచాయతీలు చేసేవారంట.వైసీపీ హయాంలో ప్రతిపక్ష నేతలపై కూడా అనేకసార్లు దూకుడు ప్రదర్శించారాయన.

టీడీపీ కేంద్ర కార్యాలయం పడి దాడి కేసులో నందిగామ సురేష్ ని అరెస్టు చేశాక ఆయనకి బెయిల్ వచ్చింది. అయితే 2020 డిసెంబర్‌లో రెండు సామాజిక వర్గాల మధ్య గొడవలు జరగడం.. ఒకరిపై మరొకరు రాళ్లు రువ్వుకున్న ఘటనలో మరియమ్మ అనే మహిళ మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన కంప్లైంట్ ఆధారంగా అప్పట్లో తుళ్లూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. అయితే, ఈ కేసులో మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను 78వ నిందితుడిగా తుళ్లూరు పోలీసులు చేర్చారు. ఆ కేసుకు సంబంధించి ప్రస్తుతం నందిగామ సురేష్ డిమాండ్ ఖైదీగా ఉన్నారు.ఇదే కాకుండా రాజధాని అమరావతి ప్రాంతంలో పర్యటన చేస్తున్న సమయంలో ప్రస్తుత ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పై దాడి చేసిన కేసులో నందిగామ సురేష్ పై కేసు నమోదు అయింది.. అయితే వరుస కేసులతో నందిగామ సురేష్ అల్లాడుతున్నారు. ప్రస్తుతం ఆ కేసులకు సంబంధించి ఆయన భార్య మాత్రమే బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు .. పార్టీకి సంబంధించిన పెద్దలు ఎవరు కూడా నందిగామ సురేష్ కేసుల విషయంలో పెద్దగా ఇంట్రెస్ట్ గా చూపిస్తున్న పరిస్థితి కనిపించడం లేదు. పార్టీ నాయకులకు, కేడర్‌కు అండగా నిలుస్తామంటూ ఓటమి తర్వాత జగన్ జైలుకెళ్లి సురేష్‌ని పరామర్శించి వచ్చారు. అయితే తర్వాత పట్టించుకోవడం మానేశారంటవైసీపీ కీలక నేతలు ఎవరూ కూడా నందిగామ సురేష్‌ని పలకరించిన పాపాన పోవడం లేదంట. వారి కుటుంబానికి ధైర్యం చెపుతున్న పరిస్థులు ఎక్కడా కనిపించడం లేదు..

స్వయంగా నందిగామ సురేష్ భార్య తన కుటుంబానికి ఎవరూ అండగా నిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారంలో ఉన్నప్పుడు ఆయన సొంత పార్టీ ఎమ్మెల్యేని ఇబ్బంది పెట్టడం, అధికారులను బెదిరించడం, ఇక అమరావతి రైతులపై అనుచితంగా ప్రవర్తించడం వంటివన్నీ ఇప్పుడు చుట్టుకుని.. ప్రస్తుతం ఆయన్ని పట్టించుకునే వారే లేకుండా పోయారంట.ఏది ఏమైనప్పటికీ ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి వైసీపీలో ప్రస్తుతం నందిగామ సురేష్ ఒంటరి అయ్యాడు అని స్పష్టంగా కనిపిస్తుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించిన నేతలెవరు నందిగామ సురేష్ కి సంబంధించిన కేసులు వ్యవహారం గురించి కనీసం తెలుసుకునే ప్రయత్నాలు కూడా చేయడం లేదంట.

తమ పరిస్థితి ఏంటో తెలియక చస్తుంటే ఇక వారి గురించి వీరి గురించి పట్టించుకునే తీరిక ఎక్కడుందని.. నందిగామ సురేష్ ప్రస్తావన వచ్చినప్పుడు కీలక నేతలు అంటున్నారంట. బళ్లు ఓడలు, ఓడలు బళ్లు అవ్వటమంటే ఇదేనేమో..

# చంద్రబాబు వర్సెస్ జగన్



విజయవాడ, జనవరి 29,రాష్ట్ర ప్రభుత్వం పై ముప్పేట విమర్శలు ప్రారంభమయ్యాయి. సంక్షేమ పథకాలు అమలు చేయలేమన్న చంద్రబాబు ప్రకటన ప్రకంపనలు రేపుతోంది.ఏపీలో చంద్రబాబు సర్కార్ పై తిరుగుబాటు ప్రారంభమైంది. అయితే అది ప్రజల నుంచి నేరుగా కాదు. ఇన్నాళ్లు మౌనంగా ఉన్న చాలామంది నేతలు ఇప్పుడు బయటకు వచ్చి విమర్శలు చేయడం ప్రారంభించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని.. సంక్షేమ పథకాలు అమలు చేయడం కష్టమని చంద్రబాబు వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దీనిపై వైసీపీ ఓ రేంజ్ లో విరుచుకుపడుతోంది. మాజీ మంత్రి అంబటి రాంబాబు అయితే..' సంపద సృష్టి లేదు.. సంపంగి పువ్వు లేదు' అంటూ సెటైరికల్ గా మాట్లాడారు. మరోవైపు టీటీడీ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి అయితే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు తల్లికి వందనం కాదు.. తద్దినం పెట్టేసారు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.తాజాగా అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ చంద్రబాబును తగులుకున్నారు. అధికారంలోకి రావడానికి దొంగ హామీలు ఇవ్వడం అనేది చంద్రబాబుకు పరిపాటేనని చెప్పుకొచ్చారు. సంపూర్ణ రైతు రుణమాఫీ అనే ఒకే ఒక్క కారణంతో 2014 ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. అటు తరువాత దానిని ఎలా ఎగ్గొట్టాడో అందరికీ తెలిసిన విషయమేనని చెప్పుకొచ్చారు. 2014 నుంచి 2019 మధ్యకాలంలో చంద్రబాబు అట్టర్ ఫ్లాప్ అయ్యాడని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధించలేకపోయారని.. విశాఖ ఉక్కును కాపాడలేకపోయారని ధ్వజమెత్తారు. అందుకే 2019లో ప్రజలు చంద్రబాబును అతి దారుణంగా ఓడించారని పేర్కొన్నారు. ఓడిపోయిన చంద్రబాబు ఖాళీ బడ్జెట్ తో పాటు ఖాళీ ఖజానాను అప్పటి ముఖ్యమంత్రి జగన్ కు అప్పగించలేదా అని ప్రశ్నించారు.రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న జగన్ సంక్షేమ పథకాలు అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు హర్ష కుమార్. ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయేంతవరకు అమలు చేస్తూనే ఉన్నారని.. తొలిసారి సీఎం అయినా గానీ.. ఖజానా ఖాళీగా ఉన్నా గానీ ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని జగన్ అమలు చేసి చూపించారని హర్షకుమార్ చెప్పుకొచ్చారు. 40 సంవత్సరాల ఇండస్ట్రీ అని పేరు చెప్పుకునే చంద్రబాబు.. సంక్షేమ పథకాలను అమలు చేయలేనంటూ చేతులెత్తేయడం తగునా అంటూ నిలదీశారు. ఈ విషయంలో చంద్రబాబు మంచి అడ్మినిస్ట్రేటరా? లేక జగన్ మంచి అడ్మినిస్ట్రేటరా? అంటూ ప్రశ్నించారు జీవీ హర్ష కుమార్.

అయితే ఒకేసారి హర్ష కుమార్ చంద్రబాబు పై విరుచుకు పడడం విశేషం. చంద్రబాబు ఒక స్ట్రాటజీ ప్రకారం సంక్షేమ పథకాల విషయంలో అమలు చేశారని తెలుస్తోంది. కానీ తటస్థంగా ఉండే నాయకులు సైతం ఇప్పుడు ముందుకు వచ్చి చంద్రబాబుపై విమర్శలు చేస్తుండడం విశేషం. రాష్ట్ర విభజన తర్వాత హర్షకుమార్ సైలెంట్ గా ఉన్నారు. అయితే ఇటీవల జగన్ కు సానుకూలంగా మాట్లాడుతున్నారు. ఈ ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో చేరతారని కూడా ప్రచారం నడిచింది. కానీ ఆయనను అప్పట్లో అడ్డుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు జగన్ కు జీవి హర్ష కుమార్ దగ్గరవుతున్నట్లు టాక్ నడుస్తోంది. ఈ తరుణంలో హర్ష కుమార్ చంద్రబాబు పై హాట్ కామెంట్స్ చేయడం విశేషం.

# మార్చి నుంచి జనాల్లో జగన్

గుంటూరు, జనవరి 29,సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీలో ఒక రకమైన నైరాశ్యం కొనసాగుతోంది. ఇటువంటి తరుణంలో జగన్ జనాల్లోకి వస్తున్నారు. ఆయనతో పాటే మరికొందరు నాయకులు యాక్టివ్ అవుతారని తెలుస్తోంది.వైసీపీ స్వరం పెంచుతోంది. పార్టీ నుంచి పెద్ద ఎత్తున నేతలు బయటకు వెళ్తున్న వేళ.. ఉన్నవారితో రాజకీయం చేయాలని జగన్ భావిస్తున్నారు. అందుకే వీలైనంతవరకు నేతలను క్రియాశీలకం చేస్తున్నారు. తన వెంట ఉండే వారికి తప్పకుండా ప్రాధాన్యం ఇస్తానని చెబుతున్నారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత చాలామంది సైలెంట్ అయ్యారు. కొందరు అజ్ఞాతంలోకి కూడా వెళ్లిపోయారు. మరికొందరైతే సొంత వ్యాపారాలు చూసుకుంటున్నారు. కొందరు ముఖ్య నాయకులు సొంత నియోజకవర్గాల మొఖం కూడా చూడడం లేదు. ఈ తరుణంలో జగన్ జిల్లాల పర్యటనకు సిద్ధపడుతున్నారు. ప్రస్తుతం ఆయన విదేశాల్లో ఉన్నారు. వచ్చిన వెంటనే ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో వారానికి రెండు రోజులపాటు ఉండనున్నారు. అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకోనున్నారు.పార్టీలో నెంబర్ 2 గా ఎదిగిన విజయసాయిరెడ్డి లాంటి నేతలు వెళ్లిపోయిన తర్వాత వైసీపీ శ్రేణుల్లో ఒక రకమైన కలవరం కనిపిస్తోంది. అయితే ఈ విషయంలో వైసీపీ నేతలకు ఫుల్ క్లారిటీ ఇవ్వాలని భావిస్తున్నారు జగన్. పార్టీలో యాక్టివ్ అవ్వండి.. లేకుంటే మీ ప్లేస్ లో కొత్త నాయకులకు బాధ్యతలు అప్పగిస్తామని హెచ్చరిస్తున్నారు. తాను జిల్లాల పర్యటనకు వచ్చేలోగా.. నియోజకవర్గాల్లో క్రియాశీలకం కావాలని సూచిస్తున్నారు. మార్చి నెల నాటికి మొత్తం మాజీ మంత్రులంతా యాక్టివ్ అయ్యేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం.వైసీపీ ఫైర్ బ్రాండ్లలో చాలామంది ఉన్నారు. కొడాలి నాని అనిల్ కుమార్ యాదవ్, పేర్ని నాని, జోగి రమేష్, రోజా లాంటి నేతలు పెద్దగా కనిపించడం లేదు. అనిల్ కుమార్ యాదవ్ జాడలేదు. కొడాలి నాని అయితే నియోజకవర్గానికి రావడం మానేశారు. ఇటువంటి నేతలంతా మార్చి నుంచి యాక్టివ్ అవుతారని తెలుస్తోంది. ఇప్పటికే వైసీపీ కార్యాలయం నుంచి వీరికి సమాచారం వెళ్లిందట. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోతే.. మీ స్థానంలో వేరే నేతలు వస్తారని అల్టిమేటం ఇచ్చినట్లు సమాచారం. దీంతో చాలామంది నేతలు తిరిగి నియోజకవర్గాల్లోకి వచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.ఇంకోవైపు వైసీపీ నేతలు విమర్శల డోసు పెంచారు. కూటమి ప్రభుత్వాన్ని టార్గెట్ చేసుకుంటున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని.. పథకాలు అమలు చేయలేమని చంద్రబాబు తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. దీంతో గతంలో ఎన్నడూ లేనివిధంగా వైసీపీ నేతలు ఒక్కసారిగా చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు అయితే ' సంపద సృష్టి లేదు సంపంగి పువ్వు లేదు ' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. టిటిడి మాజీ చైర్మన్ కరుణాకర్ రెడ్డి అయితే ఓ రేంజ్ లో విరుచుకుపడ్డారు. చంద్రబాబును జిత్తుల మరి నక్కగా అభివర్ణించారు. తల్లికి వందనం కాదు తద్దినం పెట్టాడు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మొత్తానికైతే వైసీపీ నేతలు యాక్టివ్ కావడం.. ప్రభుత్వాన్ని ఉద్దేశించి హాట్ కామెంట్స్ చేస్తుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. జగన్ జనాల్లోకి వస్తే మాత్రం

# బీజేపీ ఛీఫ్ గా కడప నేత

కడప,జనవరి 29, ఎంతో కాలంగా ఏపీలో స్వతహాగా ఎదగాలని స్కెచ్చులు వేస్తోంది బీజేపీ. అందుకోసం అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వాడుకుంటోంది. పొత్తులో కూటమిగా పవర్‌లోకి వచ్చి ఏపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంది. ఎన్డీయేలో టీడీపీ, జనసేనను చేర్చుకుంది. పొత్తు పొత్తే అంటూ..సొంతంగా బలపడే వ్యూహాలకు పదును పెడుతోంది.అందులో భాగంగా ఏపీ బీజేపీ కొత్త అధ్యక్షుడి ఎంపికలో తన మార్క్ స్ట్రాటజీ ఫాలో అవుతుంది బీజేపీ. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలకు ప్రాధాన్యత ఇస్తూ రాయలసీమ ప్రాంతానికి చెందిన ఓ నేతకు రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలని డిసైడ్ అయిందట. టీడీపీ-జనసేనతో పొత్తు వేళ రెడ్డి సామాజికవర్గంపై అధినాయకత్వం ఫోకస్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఇందులో భాగంగానే జగన్ సొంత జిల్లా నుంచే పార్టీకి కొత్త అధ్యక్షుడిని ఖరారు చేసినట్లు సమాచారం.ప్రస్తుతం అధ్యక్షురాలిగా ఉన్న పురందేశ్వరి పదవీ కాలం జూలై వరకు ఉంది. దీంతో కొత్త అధ్యక్షుడి నియామకంపై పార్టీ నాయకత్వం కసరత్తు చేస్తుంది. పలువురు నేతలు బీజేపీ స్టేట్ పదవి రేసులో ఉన్నారు. సుజనా చౌదరికి బీజేపీ రాష్ట్ర పగ్గాలు అప్పగిస్తారని ప్రచారం జరిగింది. రాయలసీమకు చెందిన మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి పేరు కూడా వినిపించింది.విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు ఉత్తరాంధ్రకు చెందిన పీవీఎన్ మాధవ్, పూడి తిరుపతిరావు వంటి వారు ఆశావహులుగా ఉన్నా..హైకమాండ్ మాత్రం ఎవరూ ఊహించనట్లుగా ఓ కామన్ మ్యాన్‌కు పదవి కట్టబెట్టాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. అయితే పురంధేశ్వరినే కంటిన్యూ చేయాలని కూడా కొందరు నేతలు కోరుతున్నట్లు తెలుస్తోందికడప జిల్లాకు చెందిన సింగారెడ్డి రామచంద్రారెడ్డిని స్టేట్ ప్రెసిడెంట్‌గా నియమించాలని ప్రధాని మోదీ టీమ్ డిసైడ్ అయినట్లు ప్రచారం జరుగుతోంది. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తూ సాధారణ కార్యకర్త నుంచి ఎదిగిన వారికి అవకాశం ఇవ్వాలనే ఆలోచనతోనే.. సింగారెడ్డి పేరును పరిశీలిస్తున్నారట.సింగారెడ్డి రామచంద్రారెడ్డిది పులివెందులలోని వేంపల్లె. 1978 నుంచి ఆర్ఎస్ఎస్‌లో పని చేస్తున్నారు. 2017లో ఏపీ బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. 2019లో కడప పార్లమెంట్ నుంచి పోటీ చేశారు. కిసాన్ మోర్చా జాతీయ ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా, కేంద్రప్రభుత్వ పథకాలపై అవగాహన-ప్రచార కమిటీకి ఏపీ కన్వీనర్‌గానూ రామచంద్రారెడ్డి పనిచేశారు.రైతు సమస్యలపై పోరాటాలు చేసిన నేతగా గుర్తింపు ఉంది. దాంతో కేంద్రమంత్రిగా శ్రీనివాస వర్మ లాంటి సాధారణ కార్యకర్తను ఎంపిక చేసినట్లుగానే..ఇప్పుడు పార్టీ అధ్యక్షుడి విషయంలోనూ అదే స్ట్రాటజీని ఫాలో అవ్వాలని డిసైడ్ అయ్యారట. అందులో భాగంగానే సింగారెడ్డి రామచంద్రారెడ్డి పేరు ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అధికారికంగా పార్టీ నాయకత్వం ప్రకటన చేయడమే మిగిలి ఉందంటున్నారు.బీజేపీలో క్రియాశీలకంగా పని చేసిన అనుభవం సింగారెడ్డి రామచంద్రారెడ్డికి ఉందంటున్నారు. కూటమి నేతలతో మంచి సంబంధాలు సింగారెడ్డికి కలిసొచ్చే అంశాలుగా చెబుతున్నారు. పార్టీ విధానపరమైన అంశాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బాగా పనిచేశారని అంటున్నారు.మాజీ సీఎం జగన్ ఇలాఖ అయిన పులివెందుల వాసి కావడం, కడప జిల్లా ప్రజలకు చాలా సుపరిచితుడి కావడం సింగారెడ్డికి కలిసి వచ్చే అంశాలు. మరోవైపు ఆర్థికంగా బలమైన వ్యక్తి కావడంతో సింగారెడ్డి రామచంద్రారెడ్డిపై బీజేపీ అధిష్టానం సీరియస్‌గానే ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది. సింగారెడ్డికే రాష్ట్ర పగ్గాలు దక్కుతాయా? లాస్ట్ మూమెంట్‌లో చక్రం తిప్పి మరే నేతైనా లైమ్‌లైట్ వస్తారా అనేది చూడాలి మరి.

## పెట్రోల్ పంపులో కల్తీ డీజిల్ కలకం

వికారాబాద్ పెట్రోల్ డీజిల్ బంక్ లలో కల్తీలకు పాల్పడుతుండటంతో తమ వాహనాలు చెడిపోతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా వికారాబాద్ జిల్లా పరిగి కేంద్రంలోని భారత్ పెట్రోల్ బంక్లో డీజిల్ లో కల్తీ జరిగిందని వినియోగదారులు ఆందోళనకు దిగారు. డీజిల్ లో కల్తీ జరిగింది అంటూ వినియోగదారులు పెట్రోల్ బంక్ సిబ్బందిని నిలదీశారు. పంపులో పని చేస్తున్న వ్యక్తులు ఒక్కో పంపులో ఒక్కో రకంగా డీజిల్ ఉంటుందని అన్నారు. మీకు కావాలంటే డెన్సిటీ చూపిస్తాం ,డిజిల్ లో మీటర్ పెట్టి చూపించడం జరిగింది. డీజిల్ డబ్బులో నురగలు రావడం డబ్బా కింది భాగం వాటర్ కనిపించడంతో వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు వేల రూపాయలు ఇచ్చి జెసిబిలు, ట్రాక్టర్లు లారీలు, కార్లలో డీజిల్ వేయిస్తున్నాం. పంపులలో కల్తీ డీజిల్ విక్రయిస్తే ఆలస్యంగా వాహనాలు రిపేర్ అయ్యే అవకాశాలు ఉన్నాయని తొందరగా రిపేర్ కు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్రోల్ ,డీజిల్ లో కల్తీలకు పాల్పడే పెట్రోల్ బంక్ లపై చట్టరీత్యా సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పెట్రోల్ డీజిల్ వినియోగదారులు డిమాండ్ చేశారు. డీజిల్ను డెన్సిటీ చేసి చూపించిన పంపులో పనిచేసిన వ్యక్తులు టెస్ట్ పేపర్ పై టెస్ట్ చేసి చూపకపోవడం పట్ల పెట్రోల్ డీజిల్ వినియోగదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ లో డీజిల్ లో మరి టెస్ట్ పేపర్ పై ఎందుకు టెస్టు చేయలేదని వినియోగదారులు నిలదీస్తున్నారు.పెట్రోల్ డీజిల్ వినియోగదారులకు డెన్సిటీ పట్ల పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం సిబ్బంది ఎంత చెబితే అంతకి ఒప్పుకోవడం అనేది వినియోగదారులకు అర్థమయ్యే విషయం. కానీ ఇక్కడ టెస్ట్ పేపర్ పై డీజిల్ గాని పెట్రోల్ గాని ఒక చుక్క వేస్తే మొత్తం విస్తరిస్తుంది . ఏమాత్రం కల్తీ ఉన్నా వెంబడి టెస్ట్ పేపర్ పై మచ్చల రూపకంగా వినియోగదారులకు కనబడుతుంది. కనుకనే టెస్ట్ పేపర్ పై టెస్ట్ చేయకుండా అక్కడ సిబ్బంది తప్పుతోవ పట్టించారని ఆరోపించారు. అధికారులు కల్తీలకు పాల్పడుతున్న పెట్రోల్ పంపు లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

# ద్విముఖ పోరుగా మారిన ఢిల్లీ ఎన్నికలు

న్యూఢిల్లీ, జనవరి 29, (న్యూస్ పల్స్) ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల తేదీలు సమీపిస్తున్న వేళ.. కాంగ్రెస్ పార్టీ తన మిత్రపక్షాల మద్దతు సమకూర్చుకోలేకపోతోంది. ఇప్పటికే ఇండియా కూటమిలో భాగస్వామ్యపక్షాలైన సమాజ్‌వాదీ, తృణమూల్ కాంగ్రెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ శరద్ పవార్ వర్గం సహా మరికొన్ని ఇండి కూటమి పార్టీలు కాంగ్రెస్‌ను కాదని ఆమ్ ఆద్మీ పార్టీ కి మద్దతు ప్రకటించాయి. ఇప్పుడు ముస్లిం ఓటర్లలో పట్టున్న 'ఆలిండియా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్' అధినేత మౌలానా బద్రుద్దీన్ అజ్మల్ కూడా కాంగ్రెస్‌ను కాదని ఆప్ వైపు నిలిచారు. లౌకికవాదుల ఓట్లు చీలకుండా చూడాలని, ఈ క్రమంలో ముస్లిం ఓటర్లంతా కేజ్రీవాల్‌కే ఓటేసి గెలిపించాలని అజ్మల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇప్పటికే మిత్రపక్షాల్లో ఒక్కొక్క పార్టీ కాంగ్రెస్‌ను కాదని ఆప్‌కు మద్దతు ప్రకటిస్తుండగా.. మైనారిటీ ఓట్లపై ఆశలు పెట్టుకున్న కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు అజ్మల్ ప్రకటన మరొక శరాఘాతంగా మారింది. దేశంలో పరిస్థితులు అత్యంత సమస్యాత్మకంగా ఉన్నాయని, ఈ పరిస్థితుల్లో సెక్యులర్ ఓట్లను విభజించవద్దని అజ్మల్ వారించారు.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో ఉన్న ప్రధాన రాజకీయ పార్టీల్లో భారతీయ జనతా పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ తో పాటు గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ కూడా ఉంది. పూర్తిగా పట్టణ ప్రాంత ఓటర్లు ఢిల్లీలో ఒకప్పుడు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం తర్వాత ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ మధ్య జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మిత్రపక్షాల మద్దతుతో దేశవ్యాప్తంగా కొంత పుంజుకున్న కాంగ్రెస్.. ఆ తర్వాత హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో పరాభవాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లోనైనా గెలుపొంది, తన పూర్వవైభవాన్ని చాటుకోవాలని తహతహలాడింది. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేసిన ఆమ్ ఆద్మీ పార్టీకి వ్యతిరేకంగా బరిలోకి దిగి గెలుపు కోసం శ్రమిస్తోంది. కాంగ్రెస్ ప్రయత్నాలతో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ముక్కోణపు పోటీగా మారాయి. ముస్లిం మైనారిటీలు, దళిత వర్గాల్లో పట్టున్న కాంగ్రెస్ పార్టీ.. ఆ వర్గాలు ఎక్కువ సంఖ్యలో నివసించే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. అయితే ఇది పరోక్షంగా భారతీయ జనతా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారింది. ముస్లిం మైనారిటీ, దళిత ఓట్లను కాంగ్రెస్ పార్టీ చీల్చితే.. మిగతా ఓట్లలో మెజారిటీ ఓట్లను బీజేపీ కైవసం చేసుకోవడం సులభతరమవుతుంది. ఒకవేళ ఈ వర్గాలు ఆమ్ ఆద్మీ పార్టీ వెంట నిలిస్తే.. బీజేపీ గెలుపు కష్టతరమవుతుంది. ఈ పరిస్థితిని గ్రహించిన ఇండి-కూటమి పార్టీలు.. కాంగ్రెస్ ప్రయత్నాలను బహిరంగంగా విమర్శించకపోయినా.. తమ మద్దతు కేజ్రీవాల్‌కు ప్రకటించి ముక్కోణపు పోటీని కాస్తా ద్విముఖ పోరుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయి. తద్వారా ఆప్ విజయావకాశాలను దెబ్బతీయకుండా కాపాడాలని చూస్తున్నాయి. అస్సాం నేత బద్రుద్దీన్ అజ్మల్ ప్రకటన ఈ కోవలోనిదేనని అర్థమవుతోంది.ముస్లిం సమాజంలో పాపులారిటీ ఉన్న ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో అడుగుపెట్టి తన పార్టీ అభ్యర్థులను బరిలోకి దించారు. వారిలో సీఏఏ వ్యతిరేక అల్లర్ల కేసు నిందితుడు షిఫా ఉర్ రెహమాన్‌ను ముస్లిం జనాభా ఎక్కువగా ఉన్న ఓఖ్లా నియోజకవర్గం నుంచి బరిలోకి దించారు. పౌరసత్వ (సవరణ) బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన జరిగిన షహీన్‌బాగ్ ఈ నియోజకవర్గం పరిధిలోనే ఉంది. ఇక్కడ ముస్లిం జనాభా పెద్ద సంఖ్యలో నివసిస్తోంది. మరోవైపు నార్త్ ఈస్ట్ ఢిల్లీలో ముస్తాఫాబాద్ నుంచి ఆప్ మాజీ కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్‌కు ఎంఐఎం టికెట్ ఇచ్చింది. ఢిల్లీ అల్లర్ల కేసులో తాహిర్ హుస్సేన్ నిందితుడు. ఐబీ అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో జైల్లో ఉన్న ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు వీలుకల్పిస్తూ.. కోర్టు 12 గంటల కస్టడీ పేరోల్ మంజూరుచేసింది. జైల్లో ఉన్న షిఫా ఉర్ రెహమాన్ తరఫున ఆయన భార్య నూరీన్ ఫాతిమా ప్రచారం చేస్తుండగా.. తాహిర్ హుస్సేన్ తరఫున షమా అంజుమ్ కూడా ప్రచారం చేస్తోంది.తమ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం అసదుద్దీన్ ఓవైసీ కూడా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తన సహజశైలిలో రెచ్చగొట్టే ప్రసంగాలతో ముస్లిం ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. జైల్లో ఉన్న నేతల తరఫున ఆడవాళ్లు చేస్తున్న ప్రచారం సెంటిమెంటును రాజేస్తోంది. మొత్తంగా ఈ రెండు ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లో మజ్లిస్ పార్టీ ప్రచారంలో ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో ఈ ఎఐఎంఐఎం పోటీలో ఉన్నచోట ఆ పార్టీకి, లేనిచోట ఆమ్ ఆద్మీ పార్టీకి అన్న చందంగా ముస్లిం ఓటర్ల మనోగతం మారిందని కొందరు రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు.ఇదిలా ఉంటే ఢిల్లీలో గెలుపు ఎలాగూ సాధ్యం కాదని గ్రహించిందో.. మరే కారణమో.. కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో జోరు తగ్గించింది. తద్వారా ఎన్నికల్లో ముక్కోణపు పోటీ పరిస్థితిని నివారించి బీజేపీ విజయావకాశాలను దెబ్బతీయాలని చూస్తున్నట్టుగా అర్థమవుతోంది.ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌కు మద్దతు ప్రకటించిన సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ అర్వింద్ కేజ్రీవాల్‌తో కలిసి జనవరి 30న ఢిల్లీలో ఉమ్మడి రోడ్‌షో నిర్వహించనున్నారు రితాల నియోజకవర్గంలో వారి రోడ్ షో జరుగుతుందని తెలుస్తోంది. ఎస్పీకి చెందిన పలువురు ఎంపీలు కూడా ఆప్ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. అలాగే తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎంపీ శతృఘ్న సిన్హా ఢిల్లీలో ఆప్‌కు మద్ధతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జనవరి 31న శతృఘ్న సిన్హా ప్రచారం చేస్తారని ఆప్ వర్గాలు తెలిపాయి ఢిల్లీ అసెంబ్లీని 70 స్థానాలకు ఫిబ్రవరి 5న ఒకే విడతలో ఎన్నికల నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2020 ఎన్నికల్లో ఢిల్లీలోని మొత్తం 70 స్థానాల్లో 62లో ఆప్ గెలుపొందగా.. 8 స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. కాంగ్రెస్ ఖాతా తెరవలేకపోయింది.

# ఆమెజాన్ లో ఇంటి దొంగలు...

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:జనవరి 29,** అమెజాన్ కంపెనీ సరకు రవాణాలో వేయని ట్రిప్పులకు చెల్లింపులు జరిపి ఏకంగా రూ.102కోట్లు కొట్టేశారు. హైదరాబాద్ కేంద్రంగా జరిగిన ఈ మోసంలో సంస్థ ఉద్యోగులు కీలక పాత్ర పోషించారు. ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ సరకు రవాణా పర్యవేక్షణ హైదరాబాద్ నుంచి జరుగుతుండటంతో కుట్ర పూరితంగా మోసం చేశారు.: పనిచేస్తున్న సంస్థకు ఉద్యోగులు టోకరా వేయడంతో ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌కు భారీ నష్టం వాటిల్లింది. అందులో పనిచేసే ఉద్యోగులే హైదరాబాద్ కేంద్రంగా భారీ మోసానికి పాల్పడ్డారు. నకిలీ ట్రిప్పులతో డెలివరీ చేసే వారికి చెల్లించే కమిషన్ పేరిట భారీగా సొమ్ము చేసుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగాఈ మోసం జరగడంతో పోలీస్ కేసు నమోదు అయ్యింది. అమెజాన్ కాల్ సెంటర్‌లో పనిచేసే ఉద్యో గులు, గతంలో పనిచేసి మానేసిన వారు.. అమెరికాలో సరకులు సరఫరా చేసే వారితో కలిసి ఈ కుట్రకు పాల్పడినట్టు అమెజాన్ సంస్థ ఫిర్యాదు చేసింది. ఈ మోసంతో అమెజాన్‌కు దాదాపు రూ.102 కోట్ల నష్టం వాటిల్లినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మొదలుపెట్టారు.ప్రపంచవ్యాప్తంగా అమెజాన్ సంస్థ ఈ కామర్స్ వ్యాపారాన్ని నిర్వహిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో సరకుల డెలివరీ వ్యాపారంలో అగ్రస్థానంలో ఉంది. ఈ క్రమంలో కస్టమర్లకు అవసరమైన సాంకేతిక సాయం మొత్తం హైదరాబాద్ నుంచి అందుతుంది.కస్టమర్ అమెజాన్ అప్లికేషన్‌లో కావాల్సిన వస్తువులను కొనుగోలు చేసిన తర్వాత.. దానిని సమీపంలోని షిప్పింగ్ సెంటర్‌కు పంపిస్తారు. అక్కడి నుంచి వినియోగదారుడు ఉన్న ప్రాంతంలోని కేంద్రానికి వెళుతుంది. స్థానిక షిప్పింగ్ సెంటర్ నుంచి వినియోగదారుడి చిరునామాకు ఏజెంట్ల ద్వారా డెలివరీ చేస్తారు. ఇదంతా పూర్తిగా సాంకేతికతతో నడుస్తుంది.కస్టమర్ ఆర్డర్ చేసిన సరకు ఎక్కడుందనే విషయం ఎప్పటికప్పుడు అమెజాన్ కార్యాలయంలో ట్రాక్ అవుతుంది. బార్ కోడ్‌లను స్కాన్ చేయగానే ఈ సరుకు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాలనే స్పష్టత వచ్చేస్తుంది. కస్టమర్‌కు డెలివరీ ఇచ్చే వారి ఫోన్లలో ప్రత్యేక యాప్ ఉంటుంది. డెలివరీ కోసం స్థానిక షిప్పింగ్ సెంటర్ నుంచి వస్తువులను తీసుకున్న తర్వాత చెక్-ఇన్ చేస్తారు.ఆర్డర్లను వినియోగదారుడికి అందజేసిన తర్వాత చెక్-వుట్ చేస్తారు. డెలవరీ చేసే వారి జీపీఎస్‌ను ఎప్పటికప్పుడు అమెజాన్ ట్రాక్ చేస్తుంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ।అమెజాన్ డెలివరీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తుంటారు. ఇది అమెజాన్ కమ్యూనికేషన్ రిలే కేంద్రంగా వ్యవహరిస్తుంది.సరకు డెలివరీ చేసే ఒక్కో వ్యక్తికి అదే రూట్లో ఉండే ఆర్డర్లను డెలివరీ చేయడానికి వస్తువులను అందిస్తారు. డెలివరీ సాధారణంగా కమిషన్ రూపేణా చెల్లిస్తారు. స్థానికంగా ఏజెన్సీలను నియమించుకుంటారు. డెలివరీ కోసం వెళ్లినపుడు కస్టమర్ స్పందించకపోయినా, అందుబాటులో లేకపోయినా, వివిధ కారణాలతో వస్తువులను తీసుకోడానికి నిరాకరించినా ఆ విషయం యాప్‌లో నమోదు చేస్తారు. దీనిని హైదరాబాద్‌లో కమ్యూనికేషన్ సెంటర్ ధృవీకరించాల్సి ఉంటుంది.కస్టమర్ ఆర్డర్ చేసిన వస్తువులను డెలివరీ చేయడానికి ఎంత దూరం ప్రయాణించారో లెక్కించి అందుకైన ఖర్చును డెలివరీ సంస్థలకు అమెజాన్ చెల్లిస్తుంది. ఇక్కడే ఉద్యోగులు, ఏజెన్సీలు మోసానికి పాల్పడ్డాయి. హైదరాబాద్‌లో రిలే కమ్యూనికేషన్ సెంటర్ ఉద్యోగులను ప్రలోభ పెట్టారు. గతంలో అమెజాన్‌లో పనిచేసి మానేసిన వారు దీనికి సూత్రధారులుగా వ్యవహరించారు. అమెరికాలో సరకుల డెలివరీకి వెళ్లకుండానే వెళ్లినట్లు నకిలీ ట్రిప్పులు నమోదు చేయించడం, ఆ తర్వాత వినియోగదారులు లేరని చెబుతూ వారికి కమిషన్లు చెల్లించారు.ఇలా కొంత కాలంగా ట్రాన్స్‌పోర్ట్ కమిషన్ల రూపంలో రూ.102.88 కోట్లను స్వాహా చేశారు. అమెజాన్ ఇంటర్నల్ ఆడిట్‌లో పెద్ద ఎత్తున ఇలాంటి లావాదేవీలు గుర్తించి ఆరా తీయడంతో అవన్నీ నకిలీగా తేలింది. ఈ మేరకు హైదరాబాద్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు అమెజాన్ ప్రతినిధి జీవన్ అర్జున్ కుమార్ ఫిర్యాదు చేశారు.అమెజాన్ ఫిర్యాదు మేరకు మహ్మద్ అబ్దుల్ పహీమ్, కె అనిల్ కుమార్. ఆకాంక్షా పట్నాయక్, అవినాష్ కరి, కునాల్ కౌశిక్ దేవళ?ల, మహ్మద్ రిజావుల్లా, ఎండీ షాబాద్ అలీబాన్, ఎండీ. షోయబుద్దీన్, మహ్మద్ ముపాసిల్, షేక్ ఫర్హాన్, దువ్వాడ శివగణేశ్, బుడ్డి శివకుమార్ రాజ్, అబిలాష్, అజయ్ కుమార్, దాశరథి, హృదయ్ కుమార్, కొడారి తులసీరాజ్, పృథ్వీరెడ్డి చింతారెడ్డి, మహ్మద్ రహేల్, లోహిత్ మద్దాబత్తుల, మహ్మద్ ఆదిల్, సాయికుమార్, కమతం శివభారత్ కృష్ణలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు..

## తిరుమలపై తప్పుడు ప్రచారం..
## మూడు యూట్యూబ్ ఛానళ్లపై కేసు

తిరుమల ఆలయంపై తప్పుడు ప్రచారం చేసిన మూడు యూట్యూబ్ ఛానళ్లపై ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రవచనకర్త చాగంటి ఇటీవల శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేశారు. ఆయనకు సరైన దర్శనం కల్పించినప్పటికీ తప్పుడు ప్రచారం జరగడంపై టీటీడీ ఆగ్రహం వ్యక్తం చేసింది. తప్పుడు ప్రచారం చేసిన మూడు యూట్యూబ్ ఛానళ్లపై టీటీడీ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి విభీషణ్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్ సేవలు

హైదరాబాద్ బుధవారం ఉదయం నగరంలో మెట్రో రైల్ సేవలు కొంతసేపు నిలిచిపోయాయి. సాంకేతిక కారణాలతో దాదాపు రెండు గంటలుగా నిలిచిపోయాయి. నాగోల్-రాయదుర్గం రూట్లో మెట్రో సేవల్లో ఆలస్యం అయింది. అమీర్పేట్ నుంచి హైటెక్ సిటీ, నాగోల్ నుంచి సికింద్రాబాద్, మియాపూర్ నుంచి అమీర్పేట్ మధ్య మెట్రో రైళ్లు ఆగాయి.

# మల్లన్న మాయం....

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: జనవరి 29,**మాస్ మల్లన్న.. తెలంగాణ రాజకీయాల్లో ఆయన ఒక సోషల్ మీడియా స్టార్. పబ్లిక్లో భలే క్రేజ్..! ఎక్కడికి వెళ్లినా ఆయనతో సెల్ఫీ దిగడానికి పోటీలు పడే జనం. కొన్ని సందర్భాల్లో మాజీ మంత్రి కేటీ రామారావు సైతం నాకంటే మల్లన్నకే ఎక్కువగా క్రేజ్ ఉందని చెప్పిన సందర్భం. ఆయనే మన మాజీ మంత్రి మల్లారెడ్డి. యూత్‌ను అట్రాక్ట్ చేసే డైలాగ్స్‌తో, ప్లీజ్ వాయిస్ తో ఆయనే చెప్పే పంచ్ డైలాగులు సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో తిరుగుతూ ఉంటాయి.ఆయనే రాజకీయాల్లో అంతే చురుగ్గా కనిపిస్తూ ఉంటారు. అసెంబ్లీలో మాట్లాడిన నవ్వులే నవ్వులు. ఆయననే చామకూర మల్లారెడ్డి. మొదటిసారిగా 2014లో మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులుగా తెలుగు దేశం పార్టీ తరుపున గెలుపొంది, కొద్ది రోజులకే గులాబీ కండువా కప్పుకున్నారు. 2018 ఎన్నికల్లో మేడ్చల్ నుంచి బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. వెంటనే కేసీఆర్ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. మొన్నటి ఎన్నికల్లో కూడా మేడ్చల్ నుంచి మళ్లీ రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు మల్లారెడ్డి.మంత్రిగా ఉన్నప్పుడు హల్చల్ చేసిన మాస్ మల్లన్న గత కొద్ది నెలలుగా మాత్రం చాలా సైలెంట్‌గా కనిపిస్తున్నారు. రాజకీయ ప్రసంగాలు లేవు, పవర్ ఫుల్ డైలాగులు లేవు, అసలు మీడియాలోనే కనిపించకుండాపోయారు. అంత యాక్టివ్‌గా ఉండే మాజీ మంత్రి మల్లారెడ్డి ఎందుకు ఇంత తెరవ వెనక్కి వెళ్లిపోయారని పార్టీలో చర్చ జరుగుతుంది. ఇందుకు కారణం ఆయన మనవరాలు పెళ్ళికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడమే అని కొంతమంది కార్యకర్తలు బహిరంగంగానే గుసగుసలాడుకుంటున్నారు.మల్లారెడ్డి యూనివర్సిటీ, మల్లారెడ్డి కాలేజీలు ఇలా భారీ ఎత్తున విద్యాసంస్థలు ఉన్న మల్లారెడ్డి ప్రభుత్వంతో కొరివి పెట్టుకోవడం ఎందుకు అని సైలెంట్ గా ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదట్లో ఆయనే భారతీయ జనతా పార్టీలోకి వెళదామని ఆలోచన కూడా చేసినట్లు కార్యకర్తలు అంటున్నారు. అది కుదరక కాంగ్రెస్ కండువా కప్పుకోనైన వ్యాపారాలు కాపాడుకుందాం అనుకుంటే, అక్కడ అడ్డుపుల్ల పడిందంట..! మనవరాలు పెళ్ళికి ముఖ్యమంత్రి హాజరు కావడం, పెళ్లి కార్డు పేరుతో ఇటు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలవడం, మొత్తానికి మల్లన్న ఏదో సెట్టింగ్ చేసుకున్నారని పార్టీలో గుసగుస. అందుకోసమే గులాబీ పార్టీలోనే ఉన్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎక్కడ మాట్లాడకుండా ఉంటున్నారట. అసలు హడావుడి కనిపించడం లేదట.ఇదిలావుంటే, బీఆర్ఎస పార్టీ కార్యక్రమాల్లో కూడా ఎప్పుడో ఒకసారి కనిపిస్తున్నారు మాజీ మంత్రి మల్లారెడ్డి. మీడియాకు ఎప్పుడు అందుబాటులో ఉండి, సోషల్ మీడియాకు కావలసినంత మసాలా అందించే ఈ మాస్ మల్లన్న ఇప్పుడు మాత్రం కొద్ది రోజులు బ్రేక్ అంటున్నాడట.

## నిన్నూ.. సితారను చూడాలి.. గౌతమ్ తో గేమ్స్ ఆడాలి

**హైదరాబాద్,ప్రజాబలం ప్రతినిధి: జనవరి 29,** రాజమౌళి మూవీ అంటే అందరిలోనూ ఆసక్తి ఉంటుంది. ఆయన సినిమా అంటే ఏళ్ల తరబడి షూటింగ్ జరగాల్సిందే. నటీనటులు దగ్గర నుంచి సాంకేతిక సిబ్బంది వరకూ లాక్ అయిపోయినట్లే. ఎందుకంటే జక్కన్న మూవీ అంటే అంతే మరి. కొన్ని సంవత్సరాల తరబడి షూటింగ్ చేసే రాజమౌళి సినిమా వచ్చిందంటే బాక్సాఫీస్ బద్దలు కావాల్సిందే. బాహుబలి రెండు పార్ట్ లు కానీ, తర్వాత త్రిబుల్ ఆర్ మూవీ కానీ ఏళ్ల తరబడి షూటింగ్ పూర్తి చేసుకుని ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయినా సరే రికార్డులన్నీ బ్రేక్ చేసేశాయి. త్రిబుల్ ఆర్ మూవీలో పాట కూడా ఆస్కార్ అవార్డు కొట్టేసింది. అలా ఉంటది జక్కన్నతో మరి. అందుకే వెరీ వెరీ స్పెషల్ జక్కన్న సినిమాకు ముందు నుంచే ప్రమోషన్స్ ప్లాన్ చేయడంలో ఆయనను మించిన వారు మరొకరు ఉండరు.తన సినిమాకు తాను హైప్ సృష్టించుకోవడంలో విన్నూత్నంగా జనంలోకి వెళ్లడంలో రాజమౌళి తర్వాతే ఎవరైనా. రాజమౌళి దర్శకత్వం వహించిన ఒక్క సినిమాలోనైనా నటించాలని చాలా మంది అగ్రహీరోలు కూడా కోరుకుంటారంటే ఇదే కారణం. ఇక తాజాగా రాజమౌళి - సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్ లో మూవీ షూటింగ్ ప్రారంభమయింది. షూటింగ్ ప్రారంభమయినట్లు అఫిషియల్ న్యూస్ వచ్చేసింది. మహేష్ బాబు పాస్ పోర్టును స్వాధీనం చేసుకున్నట్లు వీడియో షేర్ చేయడంతో ఇక ఫ్యాన్స్ కు పూనకాలు వచ్చేశాయి.

బోనులో సింహాన్ని బంధించినట్లు వచ్చిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇక దీనపై నెట్టింట్ మీమ్స్ కూడా వస్తున్నాయి. పాపం పసివాడు సినిమాలో పాటను మహేష్ బాబుకు మార్చి పాడుతూ నమ్రతా చూడాలి.. నిన్నూ.. సితారను చూడాలి.. గౌతమ్ తో గేమ్స్ ఆడాలి అంటూ వచ్చిన వీడియో కూడా వైరల్ అయింది. అయితే తాజాగా రాజమౌళి షూటింగ్ లో కొన్ని షరతులను విధించినట్లు చెబుతుంది. ఈ సినిమాలో రాజమౌళి - మహేష్ బాబు కాకుండా మరొకరి పేరు బయటకు రాలేదు. ప్రియాంక చోప్రా పేరు బయటకు వచ్చినా అధికారికంగా చిత్ర యూనిట్ ప్రకటించలేదు. అలాగే మలయాళనటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నాడంటూ వార్తలు హల్ చల్ చేసింది. అందులో నిజమెంతో తెలియదు. తాజాగా బాలివుడ్ నటుడు జాన్ అబ్రహాం పేరు కూడా బాగా వినిపిస్తుంది. అయితే ఇవన్నీ ఊహాగానాలే. రాజమౌళి ఎలాంటి ప్రకటన చేయలేదు. అంతేకాదు ఆయన కొన్ని నెలలు ముందుగానే షూటింగ్ స్పాట్ లను చూసి వచ్చి కెమెరా స్విచ్ ఆన్ చేశారన్న నేపథ్యంలో కొన్ని షరతులు విధించారంటున్నారు. బాలీవుడ్ స్థాయిలో భారీగా ఖర్చు పెట్టి తీస్తున్న సినిమా కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

కొన్ని నెలల పాటు జరిగే షూటింగ్ కు వందల సంఖ్యలో సాంకేతిక సిబ్బంది, నటీనటులు వస్తారు. అయితే వీరెవ్వరూ సెల్ ఫోన్ తేవడానికి వీలులేదని రాజమౌళి షరతు విధించినట్లు ఇంగ్లీష్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చిత్రంలో నటించే వారి పేర్లు కానీ, సాంకేతిక నిపుణుల పేర్లు కానీ బయటకు వెల్లడించకూడదని ఒప్పందం కూడా అందరి చేత రాజమౌళి రాయించుకున్నారని చెబుతున్నారు. హీరో తో పాటు సెట్ లో ఉన్న అందరూ సెల్ ఫోన్లను తేవద్దని, అలా అతిక్రమించిన వారిపై చర్యలుంటాయని కూడా హెచ్చరించారు. సమాచారం ఏమాత్రం బయటకు పొక్కినా సహించేది లేదన్న హెచ్చరికను తొలి రోజు షూటింగ్ లోనే జక్కన్న ఇచ్చారని తెలిసింది. దీంతో ఇప్పుడు మహేష్ బాబు కూడా ఫోన్ తీసుకురాకపోవడంతో నమ్రతా చూడాలి.. నిన్నూ సితారను చూడాలి.. గౌతమ్ తో గేమ్స్ ఆడాలి అన్న పేరడీ సాంగ్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

# కాంగ్రెస్, బీజేపీ... పద్మా వార్...

**హైదరాబాద్‌ప్రజాబలం ప్రతినిధి: జనవరి 29,** తెలంగాణలో పద్మ అవార్డుల పంచాయితీ తెగడం లేదు. ఈ వ్యవహారంపై ఇటు కాంగ్రెస్..అటు బీజేపీ నేతలు తగ్గేదే లేదంటూ కౌంటర్లు విసురుతున్నారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వానిది..ముమ్మాటికి వివక్షే అని మండిపడుతోంది కాంగ్రెస్ పార్టీ. అటు బీజేపీ మాత్రం..లిస్ట్ పంపించినంత మాత్రాన అనర్హులకు అవార్డులు ఇవ్వాలా అంటూ ప్రశ్నిస్తోంది..? ఇలా.. రిపబ్లిక్‌డే ముగిసినా.. తెలంగాణలో పద్మ అవార్డులపై రాజకీయ రచ్చమాత్రం చల్లారడం లేదు. ఈ వ్యవహారంపై పొలిటికల్ పార్టీల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు అవార్డులు వచ్చినప్పుడు తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులు కూడా ఇవ్వకపోవడం వివక్ష కాదా అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారు.. తెలంగాణ ప్రభుత్వ సిఫార్సులను కనీసం పట్టించుకోలేదని మండిపడ్డారు.పద్మ అవార్డుల కోసం గద్దర్, చుక్కా రామయ్య, అందెశ్రీ, గోరేటి వెంకన్న, జయధీర్ తిరుమలరావు పేర్లను రాష్ట్ర ప్రభుత్వం సిఫారసు చేసింది. కానీ వీరిలో ఏ ఒక్కరి పేరును కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదన్నారు సీఎం రేవంత్. ఈ విషయంలో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై కేంద్రానికి నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు.ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందించారు. అయితే నక్సల్స్ భావజాలంతో ఎందరో బీజేపీ నేతలను చంపించిన గద్దర్‌లాంటి వ్యక్తులకు..పద్మ అవార్డులు ఎలా ఇస్తామని ప్రశ్నించారు కేంద్రమంత్రి బండి సంజయ్. అలాంటి వ్యక్తులకు బరాబర్ అవార్డులు ఇవ్వమని స్పష్టం చేశారు. రాష్ట్రం ప్రభుత్వం పంపించిన పేర్లను కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తుందన్న బండి.. అర్హులైన వారికే పద్మ అవార్డులు వస్తాయని తేల్చిచెప్పారు.గద్దర్‌పై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు..ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్. మాజీ నక్సలైట్లకు ఎంపీ, ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వొచ్చు కానీ.. పద్మ అవార్డులు ఇవ్వడానికి పనికి రారా? అని ప్రశ్నలు సంధించారు. తెలంగాణ కోసం పోరాడిన గద్దర్ లాంటి వ్యక్తిని పద్మ అవార్డులకు ప్రతిపాదిస్తే తప్పా అని ప్రశ్నించారు.బీజేపీ భావజాలం ఉన్నవారికి మాత్రమే అవార్డులు ఇస్తారా? అని ప్రశ్నించారు కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం గద్దర్ పోరాటం చేశారన్న చామల.. గద్దర్‌పై సంజయ్ చేసిన వ్యాఖ్యలను విత్ డ్రా చేసుకోవాలి అని కామెంట్స్ చేశారు.గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించారు..కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్. బుద్దిస్ట్ మీకు మావోయిస్టుగానే కనబడ్డారా? అని ప్రశ్నించారు. గద్దర్‌లోని తెలంగాణ ఉద్యమకారుడు, దళిత ప్రజా ఉద్యమకారుడు కనిపించలేదా? అని నిలదీశారు. గద్దర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యలు వ్యక్తిగతమా.. పార్టీ విధానమా? చెప్పాలని డిమాండ్ చేశారు అద్దంకి.అయితే.. కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు బండి సంజయ్. భావజాలం వేరు మావోయిస్టుగా చేయడం వేరన్న బండి.. మావోయిస్టులతో ఈటలకు సంబంధం లేదని చెప్పారు. ప్రభుత్వం ఇస్తామంటున్న గద్దర్ అవార్డులను బీజేపీ వాళ్లు తీసుకోరని స్పష్టం చేశారు.అటు ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కూడా పద్మ అవార్డులపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో సత్సంబంధాలు ఉన్న వారికే కేంద్ర ప్రభుత్వం అవార్డులు ఇచ్చిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చిరంజీవికి ఇస్తే, ఇప్పుడు బీజేపీ బాలకృష్ణకి ఇచ్చిందని విమర్శించారు కేఏ పాల్..గద్దర్‌కు, ఎల్టీటీఈకి పెద్దతేడా లేదంటూ బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అనేక మంది ప్రాణాలు తీసిన నరహంతకుడు గద్దర్.. ఆయనపై అనేక కేసులు ఉన్నాయన్నారు. భారత ప్రజాస్వామ్య విధానాలకు గద్దర్ వ్యతిరేకి.. నిషేధిత మావోయిస్టు సంస్థలో ఉన్న గద్దర్‌కు.. అవార్డు ఎలా ఇవ్వమంటారు? ఎల్టీటీఈకి కూడా పద్మ అవార్డులు ఇవ్వాలని రేవంత్ అంటారా? అంటూ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు.కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న పలు విధానాలపై ఇప్పటికే మండిపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. లేటెస్ట్‌గా యూజీసీ, పద్మ అవార్డుల అంశంలోనూ మోదీ సర్కారు తీరును తప్పుబడుతోంది. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. మరి ఈ వ్యవహారం ఎంతవరకూ వెళ్తుందో చూడాలి.

## పొలం పిలుస్తోంది

విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారిణి విజయకుమారి రైతులకు , విద్యార్దులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం పై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగివుండాలని సూచించారు. ప్రతి కుటుంబం సమగ్ర ఆర్గానిక్ ఫార్మింగ్ ద్వారా కూరగాయాలను పండించి కలుషితం లేని ఆహారాన్ని తీసుకోవాలని కోరారు. తరువాత వ్యవసాయ సహాయ సంచాలకులు : వెంకటేశ్వరావు మాట్లాడుతూ రబీ సీజన్ కు అవసరమైన రసాయన ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. విజయవాడ రూరల్ ఉద్యాన అధికారిణి వి నీలిమ ఉద్యానపంటల పై విద్యార్దులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.. మామిడి పంట పూత, పింద దశలో అవసరమగు సస్యరక్షణ చర్యలు గురించి రైతులకు వివరించారు..కార్యక్రమంలో నున్న టీడీపీ ప్రెసిడెంట్ కలకోటి శ్రీనివాసరెడ్డి, నున్న హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు

# మావోయిస్టులపై క్లైమాక్స్ ఆపరేషన్... టార్గెట్ తెలుగు నేతలు

మావోయిస్టులను పూర్తిగా హతమార్చేందుకు కేంద్ర ప్రభుత్వం భారీ స్కెచ్ వేసింది. రౌండప్ చేస్తోంది. దొరికిన వారిని దొరికినట్లు ఎన్‌కౌంటర్ చేసేస్తున్నారు. ఇక ఆనవాళ్లు ఉండేదే లేదంటున్నారు. మొన్నటికి మొన్న ల్యాండ్‌మైన్ పేల్చి భద్రతా సిబ్బందిని హతమార్చడంతో రివేంజ్ ఎటాక్స్ ఓ రేంజ్‌లో నడుస్తోంది.

మావోయిస్టులు బలంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో సెక్యూరిటీ ఫోర్సెస్ వేసిన స్కెచ్ చూస్తే నక్సల్స్ మ్యాటర్ క్లోజ్ అన్నట్లుగానే అనిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు మావోయిస్టుల లీడర్లను టోటల్‌గా ఎలిమినేట్ చేసేలా లిస్ట్ రెడీ చేసుకున్నారుతెలంగాణ ? ఛత్తీస్‌గఢ్ బోర్డర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా కీలక ట్వీట్ పెట్టారు. దేశంలో నక్సలిజం క్లైమాక్స్‌లో ఉందని, మొత్తం ఎలిమినేట్ చేసి పడేస్తామంటూ గట్టిగానే వార్నింగ్ ఇచ్చారు. ఏ అడవుల్లో అయితే మావోయిస్టులు బలంగా ఉన్నారో.. అదే అడవుల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసే పనిలో ఉంది కేంద్రం. ముఖ్యంగా అబూజ్‌మడ్ దండకారణ్యం మావోయిస్టులకు సేఫ్ జోన్‌గా చెబుతారు.

ఇక్కడ బయటి వారు లోపలికి వెళ్లడమే తప్ప బయటకు తిరిగి వెళ్లడం కష్టం. కానీ సెక్యూరిటీ ఫోర్సెస్ ఇక్కడే సైనిక స్థావరాలు ఏర్పాటు చేసుకునే ప్లాన్‌తో ఉన్నాయి. పై నుంచి డ్రోన్లు, గ్రౌండ్‌లో ఆర్మీ క్యాంప్‌లు.. సో కేంద్ర ప్రభుత్వ స్ట్రాటజీ చూస్తుంటే 2026 మావోయిస్టుల అంతానికి గట్టిగానే ఫిక్స్ అయినట్టు స్పష్టమవుతుంది. ఈ మాట ఇంత గట్టిగా చెప్పడానికి కారణం.. ఛత్తీస్‌గడ్‌లో జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లే కారణం. దొరికిన వారిని దొరికినట్లు ఎలిమినేట్ చేసేస్తున్నారు. మొన్నటికి మొన్న బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ అడవుల్లో ఫైరింగ్‌తో మోతెక్కిపోయింది. అక్కడ పెద్ద సంఖ్యలో మావోయిస్టులు హతమయ్యారు. భద్రతా దళాలు పైచేయి సాధించాయి. లేటెస్ట్‌గా ఒడిశా -ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని గరియాబంద్ జిల్లాలో మావోయిస్ట్‌లు, భద్రతా బలగాలకు జరిగిన ఎన్ కౌంటర్‌లోనూ మావోలకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటి వరకు ఎన్ని కూంబింగ్‌లు జరిగినా.. ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగినా చిన్న గాయాలు కాకుండా తప్పించుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు లీడర్లు ఇప్పుడు హతమవుతున్నారు.

లేటెస్ట్‌గా కేంద్ర కమిటీ సభ్యుడైన చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు ఉన్నట్లు గుర్తించారు. చలపతి తలపై కోటి రూపాయల రివార్డు ఉంది. అటు బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తెలంగాణ రాష్ట్ర మావోయిస్టు కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మృతి చెందారనే ప్రచారం జరిగింది. దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. మావోయిస్టు బస్తర్ డివిజన్ కమిటీ పేరుతో చేసిన ప్రకటనలో దామోదర్ వీరమరణం పొందారని ఉంది.

అయితే పోలీసులు రిలీజ్ చేసిన ఫోటోల్లో బడే చొక్కారావు లేదు. సో చనిపోతే డెడ్ బాడీ ఎక్కడ ఉందన్నది కీలకంగా మారింది. ఛత్తీస్‌గఢ్‌లో యాంటీ నక్సల్స్ ఆపరేషన్‌లో భాగంగా మిషన్-2026 పేరు పెట్టారు. దీని అర్థం.. వచ్చే ఏడాది చివరి నాటికి ఎక్కడెక్కడైతే మావోయిస్టులు బలంగా ఉండి ఉనికి చాటుకుంటున్నారో అక్కడ మొత్తం మ్యాటర్ క్లోజ్ చేసే పనిలో ఉన్నారు. ఇందుకు నిదర్శనం కేంద్ర హోంమంత్రి అమిత్ షా పెట్టిన ట్వీటే. ప్రస్తుతం మావోయిస్టులు గడ్చిరోలి, బీజాపూర్, ఛత్తీస్‌గఢ్, ఏఓబీ, ములుగు సరిహద్దుల్లో ఉనికి చాటుకుంటున్నారు. గట్టిగా ఫోకస్ పెడితే వచ్చే ఏడాది నాటికి మ్యాటర్ అంతా ఫినిష్ చేస్తామంటున్నారు. ఇప్పటి వరకు ఒక లెక్క, ఇకపై మరో లెక్క అంటున్నారు. మొన్న భద్రతా సిబ్బందిని ల్యాండ్‌మైన్ పెట్టి చంపేయడంతో మరింత సీరియస్‌గా తీసుకున్నారు. యాంటీ మావోయిస్టుల ఫోర్సెస్ అన్నీ అంటే ఛత్తీస్‌గఢ్ డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్, అభీఖఈ, కోబ్రా, ఒడిశాకు చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ ఇలా అన్ని బలగాలు జాయింట్ ఆపరేషన్స్‌తో అడవులను జల్లెడపడుతున్నాయి. మాట విన్నారా.. జనజీవన స్రవంతిలో కలిపేస్తామంటున్నారు. వినకపోతే లేపేస్తామంటున్నారు. ఇదే సెక్యూరిటీ ఫోర్సెస్ టార్గెట్.

ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన మావోలకు నెలకు 10 వేల రూపాయలు ఇవ్వడంతోపాటు మూడేళ్ల పాటు ఉచిత భోజనం, వసతి, వారికి నైపుణ్యం ఉన్న రంగాల్లో శిక్షణ ఇచ్చి జనజీవనంలో కలిపే లక్ష్యం పెట్టుకున్నారు. అందుకోసం బిల్డింగ్‌లు కూడా రెడీ చేస్తున్నారు. సో నక్సల్స్ వింటే ఒకలా.. వినకపోతే మరోలా ట్రీట్‌మెంట్ ఇచ్చేందుకు ఆపరేషన్ అంతా రెడీ అయింది. అందులో భాగంగానే వరుస ఎన్‌కౌంటర్లు రెడ్ కారిడార్‌ను దడదడలాడిస్తున్నాయి. దండకారణ్యాలు తుపాకుల మోతతో మోతెక్కిపోతున్నాయి. ఇన్నాళ్లూ చిక్కకుండా తప్పించుకున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన మావోయిస్టు లీడర్లు ఇప్పుడు ఒక్కొక్కరుగా ఎలిమినేట్ అవుతున్నారు. ఇందులో మావోయిస్టు అగ్రనేత చలపతికి పెద్ద హిస్టరీయే ఉంది. సల్వాజుడుం వ్యవస్థాపకుడు మహేంద్ర కర్మ హత్య ఘటనలో చలపతి కీలకంగా పాల్గొన్నాడు. మావోయిస్టు అగ్రనేత హిడ్మాలకు అత్యంత సన్నిహితంగా మెలిగాడు. హిడ్మాలకు గురువుగానూ చెబుతుంటారు. 2018లో నాటి అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోముల హత్యాకాండలో చలపతి కీలకంగా పాల్గొన్నాడు. ఇదే ఎన్‌కౌంటర్‌లో మోడెమ్ బాలకృష్ణ అలియాన్ బాలన్న కూడా హతమైనట్లు చెబుతున్నారు. ఈయన వరంగల్ జిల్లా మడికొండ వాసి. మావోయిస్టు కేంద్రకమిటీలో కీలకంగా ఉన్నారు. సో వీళ్లే కాదు.. రాబోయే రోజుల్లో కీలక నేతలందరినీ రౌండప్ చేసి అభీఖఈ ర్యాంపేజ్ చేస్తుందంటున్నారు. ఏపీ, తెలంగాణలో మావోయిస్టు అణచివేత చర్యలు విపరీతంగా జరగడంతో ఒక దశలో ఇక్కడున్న మావో లీడర్లంతా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, గడ్చిరోలి లాంటి సేఫ్ జోన్లకు తరలిపోవాల్సి వచ్చింది. అక్కడ దట్టమైన దండకారణ్యాల నుంచి టోటల్ మ్యాటర్ నడిపించారు. జోనల్ కమిటీలను, దళాల్లో రిక్రూట్‌మెంట్లు, ఆయుధాలను సమకూర్చుకోవడం ఇలా అన్నిట్లోనూ తెలుగు రాష్ట్రాల మావోయిస్టు లీడర్లే ముందున్నారు. నిజానికి ఏపీ, తెలంగాణ నుంచి షిఫ్ట్ అయిన వారు తమ కుటుంబాలకు టచ్‌లోకి వెళ్లలేదు. అజ్ఞాతంలోనే ఉండిపోయారు. ఇప్పుడిప్పుడే ఎన్ కౌంటర్ల ద్వారా వారి వివరాలు బయటికొస్తున్నాయి. అయితే వారంతా ప్రాణాలతో మాత్రం మిగలడం లేదు. ఛత్తీస్‌గఢ్, ఒడిశా బార్డర్‌లో ఏ ఎన్‌కౌంటర్ జరిగినా అందులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఉంటున్నారు. లేటెస్ట్ ఎన్‌కౌంటర్లతో చనిపోయిన వారి సంఖ్య పెరిగింది. గతేడాది మేలో అబూజ్‌మడ్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు చనిపోగా అందులో ముగ్గురు తెలుగువారిగా గుర్తించారు.

వారిలో పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జియ్యారం గ్రామానికి చెందిన జోగన్న అలియాస్ చీమల నర్సయ్య, మంచిర్యాల జిల్లాకు చెందిన వినయ్ అలియాస్ రవి, వరంగల్‌కు చెందిన సుష్మిత అలియాస్ చైత ఉన్నారు. వీరు చాలాకాలంగా ఛత్తీస్‌గఢ్‌లో పనిచేస్తున్నారు. స్పెషల్ జోనల్ కమిటీ సభ్యునిగా పనిచేస్తున్న జోగన్నపై 196 కేసులు ఉండగా ప్రభుత్వం 25 లక్షల రివార్డు ప్రకటించింది. మావోయిస్టు డివిజనల్ కమిటీ సభ్యుడైన రవిపై 8 లక్షలు, మావోయిస్టు పార్టీ సభ్యురాలైన తిక్క సుష్మితపై 2 లక్షల రివార్డు ఉంది. 2016లో ఇంటర్ చదువుతున్న టైంలోనే సుష్మిత మావోయిస్టు దళంలో చేరింది. గతేడాది ఏప్రిల్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా దండకారణ్యంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్లో 29 మంది మావోయిస్టులు మరణించగా వారిలో భూపాలపల్లి జిల్లాకు చెందిన శంకర్‌రావు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సుమన అలియాస్ రజిత ఉన్నారు. వీరిద్దరూ భార్యా భర్తలు. ఛత్తీస్‌గఢ్ పోలీసులు వెతుకుతున్న వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారి వివరాలను ఇప్పుడు చూద్దాం. వారి రిలీజ్ చేసిన లిస్టు ప్రకారం 37 మంది ఉన్నారు. ఇందులో లేటెస్ట్‌గా గరియాబంద్ ఎన్ కౌంటర్‌లో చలపతి, బాలన్న చనిపోయారు. సో మరో 35 మందిని టార్గెట్ చేసినట్లుగా చెబుతున్నారు. వీరిని పట్టుకుంటే నక్సల్స్ కథ క్లైమాక్స్‌కు చేరుకున్నట్లే అని భావిస్తున్నారు. లిస్టులో ఉన్న వారిలో గణేష్, రాజమోహన్ అలియాస్ యాదగిరి హన్మకొండ వాసి. చిన్నన్న అలియాస్ నాగన్న ఆత్మకూర్ ఏపీ వాసి. సుజాత అలియాస్ సుజాతక్క, మధు అలియాస్ కమలాకర్, గోపి అలియాస్ గోపన్న ఏపీ వాసి. దీనా అలియాస్ నందే, సరిత అలియాస్ అరుణ నల్గొండ వాసి. రుపీ, అనిత, తక్కళ్లపల్లి వాసుదేవరావు వరంగల్ వాసి, సత్యగంగాధర్ రావు విశాఖపట్నం వాసి. ప్రమోద్ అలియాస్ పాండూ యాప్రాల్ రంగారెడ్డి వాసి, కమలేష్ అలియాస్ రామకృష్ణ విజయవాడ వాసి, కేశవరావ్ అలియాస్ గంగన్న శ్రీకాకుళం వాసి, గణపతి అలియాస్ లక్ష్మణ్ రావు కరీంనగర్ వాసి, మల్లోజుల వేణుగోపాల్ కరీంనగర్, తిరుపతి కరీంనగర్, మోడెం బాలకృష్ణ అలియాస్ బాలన్న ఈయన లేటెస్ట్ ఎన్ కౌంటర్ లో చనిపోయాడు. ఉదయ్ అలియాస్ గణేష్ నల్గొండ వాసి, రామచంద్రారెడ్డి కరీంనగర్, చందూ అలియాస్ చందర్ వరంగల్ వాసి, చలపతి మంథని వాసి. ఈయన గరియాబంద్ ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడు. విమల్ అలియాస్ వెంకటి ఆదిలాబాద్ వాసి. గౌతమ్ అలియాస్ గోపన్న కరీంనగర్ వాసి, పూలూరి ప్రసాద్ రావు పెద్దపల్లి వాసి, కంకణాల రాజిరెడ్డి మంథని వాసి, సంజీవ్ అలియాస్ అశోక్ రంగారెడ్డి వాసి ఉన్నారు. రవి అలియాస్ భాస్కర్ నిజామాబాద్ వాసి, రెడ్డి అలియాస్ శ్యాం వరంగల్ వాసి, కమలేష్ అలియాస్ నాగరాజు విజయవాడ వాసి,చందు వరంగల్ వాసి, రఘు అలియాస్ వికాస్ వరంగల్ వాసి, విమల ఆదిలాబాద్ వాసి, ప్రతాప్ ఏపీ వాసి, రణధీర్ వరంగల్ వాసి, నిర్మల అలియాస్ కోడి మంజుల తెలంగాణ వాసి వీరంతా మావోయిస్టు కమిటీల్లో వివిధ హోదాల్లో ఛత్తీస్ గఢ్ దండకారణ్యాల్లో పని చేస్తున్నారు. ఈ 37 మందిలో ఇద్దరు చలపతి, బాలన్న గరియాబంద్ ఎన్ కౌంటర్ లో చనిపోయారు. మిగితా వారిని ప్రాణాలతో పట్టుకోవడం లేదంటే లొంగిపోయేలా చూడడం లేదంటే ఎదురుకాల్పులు జరిగితే హతమార్చడమే టార్గెట్ గా బలగాలు కూంబింగ్ జరుపుతున్నాయి. 2026 చివరి నాటికి మొత్తం లిస్ట్ క్లియర్ చేస్తామని ఛత్తీస్ గఢ్ పోలీసులు అంటున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉద్యమం బలహీనపడగా, ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్న వారు వరుసగా హతమవుతుండడంతో మావోయిస్టు పార్టీలో ఆందోళన పెరగడానికి కారణమవుతోంది. మరోవైపు ఉడుకు రక్తం విప్లవ భావజాలంతో వీరంతా 40 యాభై ఏళ్ల క్రితం నక్సల్స్‌లో కలిశారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాల్లో తలదాచుకుని ఉద్యమాన్ని నడిపిస్తున్నారు. ఇంకోవైపు వీరి రాక కోసం తమ వాళ్లు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఒక్కసారి కనిపించు బిడ్డా అంటున్నారు. ఎన్‌కౌంటర్‌లో హతమై ఇంటికి వచ్చే బదులు ప్రాణాలతోనే రావాలని, జనజీవన స్రవంతిలో కలవాలని వారి కుటుంబీకులు వేడుకుంటున్నారు. కానీ 80, 90వ దశకంలో అడవి బాట పట్టిన వారు అనారోగ్యాలు చుట్టు ముట్టినా సరే అడవి దాటి రామంటున్నారు. మరి ఇప్పుడు ఎలిమినేషన్ ఆపరేషన్‌తో ఏం జరుగుతుందో చూడాలి.

## మండలి ఎన్నికలకు గులాబీ దూరం

**అదిలాబాద్‌ప్రజాబలం ప్రతినిధి:** జనవరి 29,తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు మార్చిలో జరిగే అవకాశం ఉంది. బీజేపీ ఇప్పటికే అభ్యర్థుల్ని ఖరారు చేసింది. కాంగ్రెస్ పార్టీ కూడా అభ్యర్థుల కసరత్తు చేస్తోంది. అయితే భారత రాష్ట్ర సమితిలో మాత్రం సందడి కనిపించడం లేదు. మూడు స్థానాల్లో ఒకటి ఉత్తర తెలంగాణలోని కీలక జిల్లాలు కలిపి ఉండే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గం. మిగతా రెండు టీచర్స్ నియోజకవర్గాలు. ఒకప్పుడు అన్ని చోట్లా తిరుగులేని విజయాలు సాధించిన బీఆర్ఎస్ ఇప్పుడు పోటీకే ముందుకు రావడం లేదు. మూడు ఎమ్మెల్సీ స్థానాల పదవీ కాలం మార్చి 29తో ముగియనుంది.

అందులో రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాలు, ఒకటి పట్టభద్రుల నియోజకవర్గం . ఆదిలాబాద్ - నిజామాబాద్ - కరీంనగర్ - మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి పదవి కాలం ముగుస్తుంది. ఆదిలాబాద్ - నిజామాబాద్ - కరీంనగర్ - మెదక్ టీచర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన రఘోత్తమ్ రెడ్డి, వరంగల్ - ఖమ్మం - నల్గొండ టీచర్ నియోజకవర్గం నుంచి ఎన్నికైన నర్సిరెడ్డి పదవీ కాలం కూడా పూర్తి అవుతుంది. ఈ మూడు స్థానాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతోంది. మార్చి నెలలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం బీజేపీ ముందుగా రెడీ అయింది. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి పటాన్ చెరు నియోజకవర్గానికి చెందిన అంజిరెడ్డిని ప్రకటించారు. ఉపాధ్యాయ నియోజకవర్గాలకు విద్యాసంస్థల యజమానుల్ని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డికి చాన్స్ ఇవ్వాలా లేకపోతే కొత్త వారికి చాన్సివ్వాలా అని ఆలోచిస్తోంది. ఉపాధ్యాయ నియోజకవర్గాల్లో మాత్రం మిత్రపక్షాలు అయిన కమ్యూనిస్టులకు మద్దతు ఇవ్వాలన్న ఆలోచన చేస్తున్నారు. త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు. ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రదానంగా ఆయా టీచర్ల సంఘాల మధ్యనే పోటీ ఉంటుంది. అందుకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై రాజకీయ పార్టీలు ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. 2019లో రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పటికీ గులాబీ పార్టీ అధికారికంగా అభ్యర్థిని ఎన్నికల బరిలో నిలపలేదు. స్వతంత్రంగా పోటీ చేసిన చంద్రశేఖర్ గౌడ్‌కు చివరి నిమిషంలో అనధికారిక మద్దతు పలికింది. కానీ జీవన్ రెడ్డి గెలిచారు. ఈ సారి ఏం చేయబోతున్నారన్నది మాత్రం స్పష్టత లేదు. పోటీ చేసేందుకు పలవురు ఆసక్తిగా ఉన్నారు. కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, టీఎస్టీఎస్ మాజీ ఛైర్మన్ చిరుమల్ల రాకేష్, టీఎన్జీఓ మాజీ అధ్యక్షుడు దేవీ ప్రసాద్, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ అవకాశంపై హామీ ఇస్తే పని చేసుకుంటామన్నారు.

కానీ ఎవరికీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడంతో సైలెంట్ గా ఉన్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధారణంగా రాజకీయ పార్టీలు పోటీ చేయబోవని, ఉద్యమ సమయంలో తెలంగాణ వాదం ఎజెండాగా పార్టీ అధినేత కేసీఆర్ ఆ ఎన్నికలను ఉపయోగించుకున్నారని కేటీఆర్ ఇటీవల వ్యాఖ్యానించారు. ఓటర్ల సంఖ్య కూడా చాలా తక్కువగా ఉంటుందని, వాటి కంటే స్థానిక సంస్థల ఎన్నికలు చాలా కీలకమని ఆయన చెప్పారు. అంటే ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నారని అనుకుంటున్నారు. దానికి తగ్గట్లుగానే ఓటర్ల నమోదు సహా ఏ విషయంలోనూ బీఆర్ఎస్ చురుగ్గా లేదు. పరిస్థితి చూస్తూంటే.. ఎన్నికల గ్రౌండ్‌ను బీఆర్ఎస్.. కాంగ్రెస్, బీజేపీలకు వదిలేస్తున్నట్లుగా ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

## నిజామాబాద్ నుంచి ఖమ్మం వరకు... దొంగ నోట్ల దందా...

**ఖమ్మంప్రజాబలం ప్రతినిధి: జనవరి 29,** తెలంగాణలో దొంగనోట్ల దందా రోజురోజుకూ పెరుగుతోంది. దేవుడి హుండీలు మొదలు.. కిరాణా షాపుల వరకు ఎక్కడ చూసినా దొంగనోట్లు దర్శనమిస్తున్నాయి. దీంతో సామాన్యులు మోసపోతున్నారు. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా.. ఈ దందా ఆగడం లేదు. దీనికి కారణాలు ఏంటో ఓసారి చూద్దాం. ఈ కాలం యువత రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలని కలలు కంటోంది. అందుకోసం అక్రమ మార్గాలను ఎంచుకుంటోంది. వాటిల్లో ప్రధానమైంది దొంగనోట్ల దందా. దీంట్లో చిక్కుకొని ఇప్పటికే చాలామంది కటకటాలపాలయ్యారు. అయినా పరిస్థితి మారడం లేదు. తెలంగాణలో ఇటీవల చాలాచోట్ల ఈ దందా జోరుగా సాగుతోంది. తాజాగా.. వరంగల్ పోలీసులు ఓ ముఠాను పట్టుకున్నారు. వారి నుంచి భారీగా నకిలీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. నకిలీ కరెన్సీని ముద్రించి, చలామణి చేస్తున్న ఎనిమిది మందిని కాకతీయ విశ్వవిద్యాలయ క్యాంపస్ పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ కరెన్సీ ముద్రణకు ఉపయోగించే కాగితంతో పాటు రూ.38.84 లక్షల నగదు, రూ.21 లక్షల విలువైన నకిలీ నోట్లు, ఒక కారు, తొమ్మిది మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లక్ష రూపాయల నిజమైన కరెన్సీకి.. నాలుగు రెట్లు విలువైన నకిలీ నోట్లను అందిస్తామని ఈ ముఠా ఆకర్షిస్తున్నట్టు.. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వివరించారు. ఈ ముఠాలో ప్రధాన నిందితుడిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మణికళ కృష్ణ (57) గా గుర్తించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే తపనతో, నకిలీ కరెన్సీని చలామణి చేయడానికి ఇతను ప్లాన్ వేశాడు. దీని కోసం, హన్మకొండకు చెందిన ఎర్రగొల్ల శ్రీనివాస్‌తో జతకట్టాడు. నకిలీ కరెన్సీని హన్మకొండలో తనకు అప్పగించాలని కోరాడు. కృష్ణ ఆ షరతుకు అంగీకరించి.. ఒప్పందం ప్రకారం, కృష్ణ, మరో నలుగురితో కలిసి శుక్రవారం రాత్రి వరంగల్ ఔటర్ రింగ్ రోడ్‌లోని పెగడపల్లి క్రాస్‌రోడ్‌కు కారులో వచ్చాడు. శ్రీనివాస్, మరో ఇద్దరు నిందితులు అప్పటికే అక్కడ ఉన్నారు. నోట్ల మార్పిడీ జరుగుతున్న సమయంలో పోలీసు పెట్రోలింగ్ బృందం వారిని పట్టుకుంది. వారిని ప్రశ్నించగా.. నిందితులు నేరం అంగీకరించారని కమిషనర్ చెప్పారు. ఈ ముఠాలోని ప్రధాన నిందితుడు కృష్ణపై గతంలో సత్తుపల్లి, వీఎం బంజర, లక్ష్మీదేవి పేట పోలీస్ స్టేషన్లలో రూ.500 నకిలీ నోట్లను ముద్రించి, తన స్నేహితులతో కలిసి చెలామణి చేసినందుకు కేసులు నమోదయ్యాయి. కేవలం వరంగల్ జిల్లాలోనే కాదు.. ఉత్తర తెలంగాణలో నిజామాబాద్ నుంచి ఖమ్మం వరకు.. అటు నల్గొండ నుంచి మహబూబ్ నగర్ వరకు ఇలాంటి దందాలే జరుగుతున్నాయే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల దేవుడి ఆలయ హుండీలోనూ నకిలీ కరెన్సీ బయటపడింది. ఇటీవల కామారెడ్డి జిల్లా బిచ్కుందలోని ఓ వ్యాపారి దొంగనోట్లు చలామణి చేస్తున్నాడని పోలీసులకు సమాచారం వచ్చింది. పోలీసులు అతడిపై నిఘా పెట్టారు. ఎవరెవరిని కలుస్తున్నాడు? దొంగనోట్లు ఎలా సమకూర్చుతున్నాడు అనే వివరాలు సేకరించారు. పూర్తి సమాచారం వచ్చిన తర్వాత గుట్టురట్టు చేశారు. అతను హైదరాబాద్ నుంచి బాన్సువాడకు, అక్కడి నుంచి బిచ్కుందకు నకిలీ కరెన్సీ తీసుకొస్తున్నట్టు పోలీసులు గుర్తించారు.

అయితే.. ఈ వ్యవహారంపై మూలాలపై పోలీసులు ఫోకస్ పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. చాలాచోట్ల నకిలీ కరెన్సీని పట్టుకుంటున్న పోలీసులు.. వాటి చలామణిని ఆపగలుగుతున్నారు. చలామణి చేస్తున్నవారిని అరెస్టు చేస్తున్నారు. కానీ.. ఎవరు తయారు చేస్తున్నారు.. ఎక్కడ తయారు చేస్తున్నారు.. చలామణి చేసేవారికి ఎక్కడి నుంచి దొంగనోట్లు వస్తున్నాయనేది మాత్రం తేల్చడం లేదు. వరంగల్‌లో దొరికిన ముఠా వెనక మరో వ్యక్తి ఉన్నాడనే ప్రచారం జరుగుతోంది. అతనే నోట్లను ముద్రించి.. కృష్ణ వంటి వారికి సరఫరా చేస్తున్నాడని తెలుస్తోంది. పోలీసుల విచారణలో ముఠా సభ్యులు రవి అనే పేరును పోలీసులకు చెప్పారని తెలిసింది. కానీ.. ఆ రవి ఎవరో ఎవ్వరికీ తెలియదు. అతని దగ్గరే నోట్లను ముద్రించే మిషన్ ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. చలామణి చేస్తున్న వారినే కాకుండా.. మూమాలపై దెబ్బకొడితే.. నకిలీ కరెన్సీ దందా ఆగే అవకాశం ఉంది.

## లంగర్ హౌస్ పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్

**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** లంగర్ హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ లో బుధవారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని వాహనాలు , సరైన నంబర్ ప్లేట్లు లేకుండా మరియు పెండింగ్ ఛానల్ మొత్తం 34 ద్విచక్ర వాహనాలతో పాటు నాలుగు ఫోర్ వీలర్ వాహనాలు అలాగే అనుమతులు లేకుండా ఇంట్లో నిలువ పెట్టుకున్న నాలుగు కమర్షియల్ సిలిండర్ లను స్వాధీనం చేసుకున్నారు, బెల్టు షాపులో రైడ్ చేసిన పోలీసులు అక్కడి నుండి పది బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు తమ చుట్టూ పక్కల ప్రాంతాలలో ఎలాంటి ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు. అలాగే ప్రజలలో భద్రతాభావన కల్పించడానికి ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించామని ఎసిపి సయ్యద్ ఫయాజ్ తెలిపారు.

## రెండు గ్రూపుల ఘర్షణలో రెండు వాహనాలు దగ్ధం

నర్సీపట్నం మున్సిపాలిటీ మూడో వార్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఘర్షణలో రెండు స్కూటీలు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం రెండు గ్రూపుల మధ్య జరిగిన తగాదాలో స్కూటీలు దగ్ధమైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న టౌన్ సిఐ గోవిందరావు ఘటన స్థలానికి వెళ్లి దర్యాప్తు మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో కొంతమంది యువకులను అదుపులో తీసుకున్నట్లు సమాచారం. జరిగిన ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# సినిమా





## కొత్త కోణంలో రాచరికం సినిమా




రాచరికం సినిమా కొత్త కోణంలో రాయలసీమ ఇతివృత్తాంతంగా మహిళా శక్తిని తెలియజేసే సన్నివేశంతో తీశామని యూనిట్ ప్రొడ్యూసర్ ఈశ్వర్, డైరక్టర్ సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "రాయలసీమకు చెందిన అనంతపురం జిల్లాలో ఒక సంఘటనను తీసుకుని మహిళా శక్తిని సినిమాలో చూపించామన్నారు. హీరోయిన్ అప్సర రాణి మాట్లాడుతూ... తొలిసారి కడపకు వచ్చామని చెప్పారు. దర్గా కు వెళ్లి ప్రార్థనలు చేశామని, ఇది తన తొలి సినిమా అని అన్నారు. ఈ నెల 31న ప్రేక్షకుల ముందుకు వస్తోందని వెల్లడించారు. సినిమాను అంతా ఆదరించాలని కోరారు. హీరో జయ శంకర్ మాట్లాడుతూ.. రాచరికం టీం ప్రమోషన్ కోసం ఇక్కడకు వచ్చామని తెలిపారు. ఒక రోజు కడపలో స్టే చేస్తున్నామన్నారు. రాయలసీమ నేపథ్యంలో తీసిన సినిమా ఇది తెలిపారు. ఇప్పటివరకు ఎవరూ చూపని ఇతివృత్తం తో సినిమాను తీశారన్నారు. బడ్జెట్ ఎక్కువ పెట్టి చాలా రిస్క్ తీసుకున్నామని తెలిపారు. ఒక కొత్త విషయాన్ని ప్రపంచానికి చెప్పడానికి ప్రయత్నం చేశామన్నారు. అంతా సినిమాను చూసి విజయవంతం చేయాలని కోరారు. యూత్, కొన్ని వర్గాలు ఓన్ చేసుకునేలా క్యారెక్టర్లు ఉంటాయని, ఇందులో మహిళా సాధికారితకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని వివరించారు. మీడియం థియేటర్ రైట్స్ కూడా తీసుకోవడం ఒక గొప్ప పరిణామమన్నారు. వరుణ్ సందేశ్ నటన చాలా గొప్పగా చూస్తారని చెప్పారు. కొత్త కోణంలో ఉంటుందని వివరించారు. యాక్షన్ మూవీ కాదు, మహిళ ప్రధాన పాత్రతో కథనం నడుస్తుందని చెప్పారు.

## మంచి కమర్షియల్ సినిమా మదగజరాజా..



విశాల్ సెన్సేషనల్ హిట్ 'మదగజరాజా' సిని మా సంక్రాంతి సందర్భంగా తమిళంలో వి డుదలై భారీ విజయాన్ని సాధించింది. వరలక్ష్మి శరత్ కుమార్, అంజలి హీరోయిన్స్‌గా సుందర్ సి దర్శకత్వంలో జెమిని ఫిల్మ్ సర్క్యూట్ నిర్మించిన ఈ సినిమా 50 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టి, పం డుగ సీజన్‌లో తమిళంలో నంబర్ వన్ చిత్రంగా రికార్డు సృష్టించింది. ఈ యాక్షన్ -కామెడీ ఎంటర్‌టైనర్ సత్యకృష్ణన్ ప్రొడక్షన్స్ ద్వారా జనవరి 31న తెలుగులో విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అంజలి మాట్లాడు తూ "ఇది మంచి కమర్షియల్ సినిమా. ఇందులో చేసిన క్యారెక్టర్‌ని చాలా ఎంజాయ్ చేశాను. విశా ల్ ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశారు. ఈ సినిమా తమిళ్‌లో పెద్ద హిట్ అయ్యింది. తెలుగు ఆడియన్స్ కి కూడా నచ్చుతుందని ఆశిస్తున్నాను. విశాల్ యాక్షన్, సంతానం కామెడీ, మ్యూజిక్, సుందర్ డైరెక్షన్‌తో కలర్ ఫుల్ మూవీ ఇది. మూ వీ లవర్స్ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది"అని అన్నారు. హీరోయిన్ వరలక్ష్మి శరత్ కుమార్ మాట్లాడుతూ "ఇది హీరోయిన్‌గా నా ఫస్ట్ కమర్షియల్ సినిమా. అంజలి నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఇందులో వెస్ట్రన్ హీరోయిన్‌గా కనిపించాను. మంచి ఎంటర్‌టైనర్ ఇది. మూవీ ఫుల్ అండ్ ఫుల్ ఎంటర్‌టైనర్"అని తెలిపారు.

## ప్రతి స్త్రీ ప్రతిరోజూ వీటిని ఎదుర్కొంటుంది



బాలీవుడ్ చిత్రం 'దంగల్' సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఫాతిమా సనా షేక్ కాస్టింగ్ కౌచ్‌ని ఎదుర్కొన్నట్లు తాజా ఇంటర్వ్యూలో వెల్లడించారు. 'నువ్వు నేను ఒక్కటవుదాం' అనే చిత్రంతో ఆమె టాలీవుడ్‌కి పరిచయం అయ్యారు. తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ కెరీర్ ప్రారంభంలోనే 'క్యాస్టింగ్ కౌచ్'ను ఎదుర్కొన్నట్లు చెప్పారు. హైదరాబాద్ వచ్చినప్పుడు ఓ నిర్మాత మాటలకు తాను ఇబ్బంది పడినట్లు తెలిపారు. 'ఇండస్ట్రీలో కొత్త వారికి అవకాశం రావడం చాలా కష్టం. ఒకవేళ ఎంతో కష్టపడి అవకాశం అందుకున్నా రిఫరెన్స్ పేరుతో నిర్మాతలే 15 శాతం పారితోషికాన్ని తీసుకుంటారు. బాలీవుడ్ లోకి రావడానికి ముందు సౌత్ ఇండస్ట్రీలో ఓ అవకాశం వచ్చింది. అది నా కెరీర్‌ను మలుపు తిప్పుతుందని అనుకున్నా. హైదరాబాద్‌లో ఆ చిత్ర నిర్మాతను కలిసినప్పుడు ఆయన నాతో అనుచితంగా ప్రవర్తించారు. 'మీకు అవకాశం కావాలంటే ప్రతి పనిని చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఏది చేయడానికైనా అంగీకరించాలి' అన్నారు. సినిమాకు ఏం అవసరమైనా నేను చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పాను. ఆ నిర్మాత క్యాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడారు. దాంతో ఇబ్బంది పడి మౌనంగా వచ్చేశాను. లైంగిక వేధింపుల కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయా. ఈ తరహా పరిస్థితులు చిత్ర పరిశ్రమలోనే కాదు అన్ని రంగాల్లోనూ ఉన్నాయని తర్వాత అర్థం అయింది. ప్రతి స్త్రీ ప్రతిరోజూ వీటిని ఎదుర్కొంటుంది' అన్నారు.

## నా జీవితాన్ని గౌరవిస్తాను



నా జీవితాన్ని గౌరవిస్తాను అని సినీ హీరోయిన్ రష్మిక అన్నారు. ప్రస్తుతం విక్కీ కౌశల్‌తో కలిసి 'ఛావా' అంటూ %ొ% రష్మిక సందడి చేయనున్నారు. లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14వ తేదీన విడుదల కానున్న సందర్భంగా ఈ సినిమా ప్రచారంలో భాగంగా నిర్వహించిన ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ... " నాకు సంతోషకరమైన ప్రదేశం ఏది అని అడిగితే వెంటనే ఇల్లు అని చెబుతాను. ఇంట్లో ఉంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. పాజిటివ్‌గా అనిపిస్తుంది. ఎక్కడా పొందలేని ఆనందం ఇంట్లో లభిస్తుంది. ఎంతోమంది ప్రేమాభిమానాలు పొందినప్పటికీ నేను ఒక కుమార్తె, సోదరి, భాగస్వామిగా నా జీవితాన్ని గౌరవిస్తాను. అది పూర్తిగా నా వ్యక్తిగత జీవితం" అని చెప్పారు. ఇక ఎదుటి వ్యక్తిలో తనను ఆకర్షించే విషయాల గురించి మాట్లాడుతూ.. "కళ్లు మన మనసుకు ప్రతిబింబాలు. కళ్లతో పలికించే హావభావాలను నేను నమ్ముతాను. నవ్వుతూ ఉండే వ్యక్తులను ఇష్టపడతాను. అలాగే ఎదుటివారిని గౌరవించే వారంటే నాకు ఇష్టం" అని తెలిపారు.

## మరోసారి పోలీస్‌గా రవితేజ



మాస్ మహారాజ్ రవితేజ హీరో గా వస్తున్న మాస్ జాతర మూవీకి సంబంధించిన గ్లింప్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. భాను భోగవరపు దర్శకత్వం లో తెరకెక్కిన చిత్రం మాస్ జాతర మనదే ఇదంతా అనే ట్యాగ్ లైన్ తో వస్తోంది. ఇదిలావుండ గా రవితేజ పుట్టిన రోజు సందర్భం గా ఈ మూవీకి సంబంధించిన వీడియో గ్లింప్స్ ను విడుదల చేశారు. ఇందు లో ఎప్పటిలాగానే రవితేజ తన ఎనర్జిటిక్ యాక్టింగ్, కామెడీ ఎక్స్ ప్రెషన్స్ తో అదరగొట్టాడు. విక్రమార్కుడు లెవల్లో మాస్ యాక్షన్ సీన్స్ ఉన్నాయి. ఈసారి రవితేజ అభిమానులకు నిజంగానే మాస్ జాతర ఉండేలా ఉందని నెట్టింట చర్చ జరుగుతోంది. ఈ మూవీ లో రవితేజ సరసన హీరోయిన్ శ్రీలీల నటిస్తోంది. మే 9న మాస్ జాతర థియేటర్ల ముందుకు రానుంది. ఈ క్రమంలో మాస్ ఇమేజ్ తెచ్చుకున్న ప్రతి హీరో కెరీర్లో ఒక్కసారైనా పోలీస్ పాత్ర చేయాలని అనుకుంటాడు. ఆ పాత్రల్లో ఉండే హీరోయిజం వేరు. వాటికి పడే ఎలివేషన్లు వేరు. టాలీవుడ్లో ఖాకీ పాత్రల్లో అదిరిపోయే పెర్ఫామెన్స్ ఇచ్చి మరపురాని విజయాలు అందుకున్న హీరో ల్లో మాస్ రాజా రవితేజ ఒకడు. అతను విక్రమార్కుడు, పవర్, క్రాక్ సినిమా ల్లో పోలీస్ పాత్రలను ఎంత గొప్పగా పండించాడో అవి ఎంత పెద్ద విజయాలు సాధించాయో తెలిసిందే. మాస్ రాజా పోలీస్ పాత్రలు చేసిన సినిమాల్లో ఒక్క టచ్ చేసి చూడు మాత్రమే సరిగా ఆడలేదు. చివరగా క్రాక్ సినిమాలో పోలీస్ పాత్రను గొప్ప గా పండించాడు మాస్ రాజా. ఇప్పుడు మళ్లీ అతను ఖాకీ చొక్కా తొడిగాడు.

## సెట్స్‌పై వెళుతున్న దేవవకొండ మూవీ



టాలీవుడ్ రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ అంటే ఒక ఫేమ్ ఉంది. విజయ్, అర్జున్ రెడ్డి మూవీతో అందరినీ తన వైపుకి తిప్పుకున్నాడు. ఆ సినిమాతో మంచి హిట్ అందుకొని.. ప్రేక్షకుల మనసు దోచుకున్నాడు. ఇక ఈ మధ్యకాలంలో విజయ్ దేవరకొండ సినిమాలలో చాలా తక్కువగా కనిపిస్తున్నాడు. ఫ్యామిలీ మ్యాన్ సినిమా తర్వాత విజయ్ అసలు సినిమాలలో కనిపించలేదు. ఇదిలా ఉండగా.. విజయ్ ఇప్పటికే గౌతమ్ తిన్ననూరితో ప్రాజెక్ట్ చేస్తున్నాడు. ఇక ఎఱ14 సినిమా రాహుల్ సంకృత్యాన్‌తో చేయనున్నాడు అని సమాచారం వచ్చిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్, విజయ్ దేవరకొండతో చేయబోయే మూవీకి ఇప్పటికే హైప్ పెంచేశాడు. నేడు రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా ప్రారంభానికి పూజ కార్యక్రమాలు చేశారు. సినిమా సెట్ వర్క్స్ కోసం మొదటి ఇటుకని కూడా పెట్టారు అంట. అయితే ఈ సినిమా కొత్త ప్రపంచాన్ని క్రియేట్ చేసేలా ఉంటుందని తెలుస్తోంది. ఈ సినిమా కోసం భారీ సెట్లు పెడుతున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. ఇంత వరకు ఇండియన్ స్క్రీన్ ఎవ్వరూ చెప్పని, చూపించని కథను, చరిత్రను డైరెక్టర్ రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్నట్లు సమాచారం వస్తుంది. ఈ సినిమా హీరోయిన్ గా రష్మిక ను తీసుకుంటునట్లు తెలుస్తోంది. విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యాన్ కాంబోలో వస్తున్న రెండో సినిమా ఇది. ఈ సినిమాకు బాలీవుడ్ ద్వయం అజయ్ అతుల్ సంగీతాన్ని అందిస్తున్నారు అంట. ఇక రౌడీ బాయ్ వరుస హిట్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకి రానున్నట్లు టాక్ వినిపిస్తుంది. అందరిలా మామూలు స్టోరీలతో రౌడీ బాయ్ రాడని.. అన్నీ డిఫరెంట్ మూవీస్ తోనే వస్తాడని అభిమానులు ఈ విషయాన్ని తెగ వైరల్ చేస్తున్నారు. ఇక రౌడీ హీరో ఈ సారి ఎన్ని హిట్ లు కోడతాడో చూడాలి.

## బుద్ధిలేక ఆ సినిమా చేశా



ఈ మధ్యకాలంలో సమంత పేరు మళ్లీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా ట్రెండ్ అవ్వడం మొదలుపెట్టింది. సమంత - నాగచైతన్యకు విడాకులు ఇచ్చేసిన తర్వాత ఆమె పేరుపై ఎలాంటి ట్రోలింగ్ జరిగింది అన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఆ తర్వాత సమంత పేరు కన్నా నాగచైతన్య పేరుపై ఎక్కువగా పాజిటివ్ కామెంట్స్ వినిపించాయి. మళ్లీ నాగచైతన్య రెండో పెళ్లి చేసుకోవడంతో నాగ చైతన్య మూవ్ ఆన్ అవుతున్నాడు అని.. నాగచైతన్య మంచోడు అని ఒక వర్గం ప్రేక్షకులు అంటుంటే నాగచైతన్య వాడుకొని వదిలేసాడు సమంత అని మరొక వర్గం ప్రేక్షకులు మాట్లాడుతున్నారు. కానీ కొంతమంది సమంతపై ఇప్పటికి నెగటివ్గా మాట్లాడుతూ ఉండడం అందరికీ షాకింగ్ గా ఉంది . నాగచైతన్య రెండో పెళ్లిపై ఏ విధమైనటువంటి కామెంట్స్ చేయనే చేయలేదు సమంత. వాళ్ళ లైఫ్ వాళ్ళది నా లైఫ్ నాది అన్న రేంజ్ లోనే సమంత తన పని తాను చూసుకుంటుంది. కానీ కావాలనే కొంతమంది గెలికి సమంతను సమంత పేరుని ట్రోల్ చేస్తున్నారు. అయితే ఇలాంటి మూమెంట్లోనే సమంత ఫ్యాన్స్ కూడా సమంతకు సపోర్ట్ చేస్తూ మాట్లాడుతున్నారు. కాగా కొంతమంది సమంత అసలు "ఏం మాయ చేసావే" సినిమా చేయకుండా ఉండాల్సింది అని.. ఆ సినిమా చేయడం కారణంగానే కదా నాగచైతన్య పరిచయమయ్యాడు. ఆమె లైఫ్ ఇలా దాపరించింది. అదే ఆమె 'ఏం మాయ చేసావే-గురించి లేటెస్ట్ అప్డేట్స్, ఫోటోలు, వీడియోల కొరకు వెంటనే క్లిక్ చేయండి. 'ఏం మాయ చేసావే సినిమా చేయకుండా ఉండి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదిగా అంటూ చెప్పుకొస్తున్నారు. అయితే సమంత ఇన్నర్ ఫీలింగ్ కూడా ఇదే అంటూ కొంతమంది సామ్ ఫ్యాన్స్ చెబుతున్నారు.



# క్రీడలు



## రోహిత్, శ్రేయస్‌లపై గవాస్కర్ ఫైర్



భారత సీనియర్ క్రికెటర్లు రోహిత్ శర్మ, శ్రేయస్ అయ్యర్‌లపై మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. జమ్ముకశ్మీర్‌తో జరిగిన రంజీ మ్యాచ్‌లో రోహిత్, అయ్యర్, యశస్వి జైస్వాల్‌లు ముంబైకి ప్రాతినిధ్యం వహించిన సంగతి తెలిసిందే. అయితే ముగ్గురు కూడా రంజీ మ్యాచ్‌లో ఘోరంగా విఫలమయ్యారు. టెస్టు సిరీస్‌లోని పేలవమైన ప్రదర్శనను రోహిత్ రంజీలోనూ కొనసాగించాడు. యువ ఆటగాడు యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్‌లు కూడా చెత్త బ్యాటింగ్‌తో నిరాశ పరిచాడు. వీరి బ్యాటింగ్ తీరుపై గవాస్కర్ తీవ్ర అసంతృప్తి వెల్లగక్కాడు. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై ఎటాకింగ్ చేయాలనే రోహిత్, అయ్యర్‌ల ఆలోచన విడ్డూరమన్నాడు. దేశవాళీ క్రికెట్‌పై భారత కీలక ఆటగాళ్లకు ఉన్న ప్రేమకు ఇది నిదర్శనమన్నాడు. ఇతర దేశాల క్రికెటర్లు డొమెస్టిక్ క్రికెట్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తారని, దీనికి విరుద్ధంగా భారత ఆటగాళ్ల తీరు ఉంటుందన్నాడు. బిసిసిఐ చెప్పిందని ఏదో తూతూ మంత్రంగా రంజీ బరిలోకి దిగారని గవాస్కర్ విమర్శించాడు.

## తెలంగాణ అమ్మాయి.. ప్రపంచ రికార్డు



మహిళల అండర్ 19 టి20 వరల్డ్‌కప్‌లో భారత్ తన జైత్రయాత్రను కొనసాగిస్తోంది. మంగళవారం స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ 150 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియాకు ఇది వరుసగా నాలుగో విజయం కావడం గమనార్హం. తెలంగాణ ఆణిముత్యం గొంగడి త్రిష ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 208 పరుగుల భారీ స్కోరును సాధించింది. త్రిష అద్భుత సెంచరీతో జట్టును ఆదుకుంది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన స్కాట్లాండ్ 14 ఓవర్లలో కేవలం 58 పరుగులకే కుప్పకూలింది. క్లిష్టమైన లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన స్కాట్లాండ్‌కు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ప్రారంభం నుంచే భారత బౌలర్లు అద్భుత బౌలింగ్‌ను కనబరిచారు. వరుస క్రమంలో వికెట్లను పడగొడుతూ ప్రత్యర్థి జట్టు బ్యాటర్లను హడలెత్తించారు. స్కాట్లాండ్ టీమ్‌లో ఓపెనర్లు పిప్పా (12), వాల్‌సింగమ్ (12)లతో స్ప్రాల్ పిప్పా (11)లు మాత్రమే రెండంకెల స్కోరును అందుకున్నారు. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. భారత బౌలర్లలో ఆయూషి 8 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లను పడగొట్టింది. సెంచరీ స్టార్ త్రిష బౌలింగ్‌లోనూ అదరగొట్టింది. ఆరు పరుగులకే మూడు వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. వైష్ణవి శర్మ మరోసారి సత్తా చాటింది. ఐదు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లను తన ఖాతాలో వేసుకుంది. భారత బౌలర్ల ధాటికి స్కాట్లాండ్ ఇన్నింగ్స్ 58 పరుగుల వద్దే ముగిసింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు తెలంగాణ యువ సంచలనం గొంగడి త్రిష అండగా నిలిచింది. మరో ఓపెనర్ కమలినితో కలిసి స్కాట్లాండ్ బౌలర్లను హడలెత్తించింది. కమలిని సమన్వయంతో బ్యాటింగ్ చేయగా త్రిష ఆరంభం నుంచే దూకుడును ప్రదర్శించింది. అద్భుత బ్యాటింగ్‌తో అభిమానులను కనువిందు చేసింది. త్రిషను కట్టడి చేసేందుకు ప్రత్యర్థి జట్టు బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వరుస ఫోర్లు, సిక్సర్లతో త్రిష హోరెత్తించింది. కమిలిని కూడా అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలించింది. అంతేగాక త్రిషకు ఎక్కువ సేపు స్ట్రయిక్ లభించేలా చూసింది. ఇద్దరు అద్భుత సమన్వయంతో ఆడి జట్టును పటిష్టస్థితికి చేర్చారు. కీలక ఇన్నింగ్స్ ఆడిన కమిలిని 42 బంతుల్లో 9 ఫోర్లతో 51 పరుగులు చేసింది. ఈ క్రమంలో తొలి వికెట్‌కు 147 పరుగుల భాగస్వామ్యంలో పాలుపంచుకుంది. మరోవైపు చెలరేగి ఆడిన త్రిష రికార్డు సెంచరీని నమోదు చేసింది. దూకుడుగా ఆడిన త్రిష 59 బంతుల్లోనే 13 ఫోర్లు, 4 భారీ సిక్సర్లతో 110 పరుగులు చేసి అజేయంగా నిలిచింది. ఇదే సమయంలో సానియా చల్కె 29 (నాటౌట్)తో కలిసి రెండో వికెట్‌కు అభేద్యంగా 61 పరుగులు చేసింది. ఇదిలావుండగా త్రిష ఈమ్యాచ్‌లో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. అండర్ 19 వరల్డ్‌కప్‌లో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు నెలకొల్పింది. ఇప్పటి వరకు ఏ ఒక్క బ్యాటర్ కూడా ఇలాంటి ఫీట్‌ను సాధించలేదు.

## అతడే మా కొంప ముంచాడు:



మూడో టి20లో టీమిండియా ఓటమి చవి చూడడంతో హ్యాట్రిక్‌కు బ్రేక్ పడింది. మూడో టి20లో ఇంగ్లాండ్ జట్టు 26 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్ స్పిన్నర్ అదిల్ రషీద్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి ఒక వికెట్ తీసి 15 పరుగులు ఇచ్చాడు. ఈ సందర్భంగా కెప్టెన్ సూర్యకుమార్ స్పందించారు. రషిద్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతోనే ఇంగ్లాండ్ గెలిచిందని సూర్యకుమార్ తెలిపాడు. తిలక్ వర్మను అదిల్ ఔట్ చేయడంతో మ్యాచ్ టర్న్ అయిందన్నారు. అతడు కనీసం స్ట్రైక్ రొటేట్ చేయనీయలేదని, ప్రపంచంలో అత్యుత్తమ బౌలర్‌గా కొనసాగుతున్నాడని ప్రశంసించారు. మ్యాచ్‌కు మంచు ప్రభావం ఎక్కువగా ఉంటుందని భావించామని, కానీ అలా జరగలేదన్నారు. హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్ క్రీజులో ఉన్నప్పుడు టీమిండియా చేతిలోనే మ్యాచ్ ఉందన్నారు. జట్టులోకి ఎక్కువ మంది స్పిన్నర్లు అందుకే తీసుకున్నామని, బౌలింగ్ పరంగా ఎలాంటి ఇబ్బంది లేదని, వరుణ్ చక్రవర్తి బౌలింగ్ బాగుందన్నారు. బ్యాటింగ్‌లో ఇంకా తాము మెరుగుపడాలని, ఓటమి నుంచి గుణపాఠాలు నేర్చుకుంటామని సూర్యకుమార్ తెలిపాడు.

## ఖేల్‌రత్నకు జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోండి



మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ పేరును పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖకు ఆదేశిస్తూ.. హైకోర్టు తీర్పు చెప్పింది. 2023 ఏడాదికి బాడ్మింటన్ క్రీడాకారులు సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ చంద్రశేఖర్ శెట్టిలతో పాటు వెన్నం జ్యోతి సురేఖ పేరును కూడా పరిగణనలోకి తీసుకోవాలంది. ఆ అవార్డుకు ఎంపికైన వారి కంటే జ్యోతి సురేఖ ప్రతిభావంతురాలని పేర్కొంది. 2024 సంవత్సరం కూడా ముగిసినందున 2023 సంవత్సరం నాటి సెలక్షన్‌ను కొట్టేయడం సరికాదంది. తిరిగి దరఖాస్తు చేసుకోవాలని జ్యోతి సురేఖను ఒత్తిడి చేయొద్దని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు తీర్పు చెప్పారు. గతేడాది జ్యోతి సురేఖ హైకోర్టులో వేసిన పిటిషన్‌పై తీర్పు వెలువరించారు. పాయింట్ల ప్రకారం చూసుకుంటే సురేఖకు 148.74 శాతం మార్కులు వస్తాయన్నారు. అవార్డుకు ఎంపికైన సాయిరాజ్, చిరాగ్ శెట్టీలకు 58.5 మార్కులే వచ్చాయన్నారు. ఎంపిక విధానానికి విరుద్ధంగా కమిటీ వ్యవహరించిందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జ్యోతి సురేఖ అధిక మెడల్స్ సాధించినా ఆమె పేరును అవార్డుకు ఎంపిక చేయకపోవడం చెల్లదన్నారు.

## పాండ్యాపై మాజీ క్రికెటర్లు ఫైర్



ఇంగ్లండ్ జట్టుతో జరిగిన మూడో టీ20లో హార్దిక్ పాండ్యా బ్యాటింగ్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలువురు మాజీ క్రికెటర్లు పాండ్యా ఆట తీరుపై మండిపడుతున్నారు. టీ20లో ఆది నుంచే వేగంగా ఆడాల్సి ఉంటుందని.. కానీ, పాండ్యా మాత్రం బంతులను వృథా చేయడంపై పార్థివ్ పటేల్, ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ కెవిన్ పీటర్సన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మిడిల్ ఓవర్లలోనూ హార్దిక్.. దూకుడుగా ఆడకుండా నెమ్మదిగా బ్యాటింగ్ చేయడం టీమిండియాకు నష్టం జరిగేలా చేసిందన్నారు.ఓ వైపు జట్టు వికెట్లు కోల్పోతుండగా.. మరోవైపు రన్ రేట్ పెరుగిపోతున్నా.. మెయిన్ బ్యాటర్‌గా క్రీజులో ఉన్న పాండ్యా ప్రత్యర్థులపై ఒత్తడి పెంచే విధంగా షాట్లు ఆడకుండా సింగిల్స్ కే పరిమితమయ్యాడని విమర్శించారు. తన ఇన్నింగ్స్ లో 35 బంతులు ఎదుర్కొన్న పాండ్యా.. కేవలం 40 పరుగులు మాత్రమే చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక, ధ్రువ్ జురెల్‌ను కూడా సరిగ్గా వినియోగించుకోవడం లేదని.. ఇప్పటికే తనేంటో నిరూపించుకున్న జురెల్ ను లోయర్ ఆర్డర్ లో బ్యాటింగ్ కు పంపడాన్ని మాజీలు తప్పుబడుతున్నారు. భారత బ్యాటింగ్ ఆర్డర్ సరిగా లేదని కెవిన్ పీటర్సన్ అన్నాడు. జురెల్ ను ఇంకాస్త ముందుగా బ్యాటింగ్ కు పంపించాల్సిందని పేర్కొన్నాడు. కాగా, మంగళవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్ లో టీమిండియాపై ఇంగ్లండ్ 26 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లీష్ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన టీమిండియా.. వరుసగా వికెట్లు చేజార్చుకుంది. ఓపెనర్ సంజు శాంసన్(03), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(14)లు మరోసారి విఫలమయ్యారు. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ(24) ఉన్నంత సేపు దూకుడుగా ఆడాడు. ఆ తర్వాత ఎవరూ చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయారు. హార్దిక్(40) కీలక సమయంలో ఔటయ్యాడు.దీంతో భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 145 పరుగులకే పరిమితమైంది.

## ఛేదనలో తడబడ్డ టీమిండియా



టీమిండియా సీనియర్ పేసర్ మహ్మద్ షమీ టి20ల్లో పునరాగమనం చేసినా.. వరుణ్ చక్రవర్తి ఐదు వికెట్లతో అద్భుత ప్రదర్శనతో మెరిసినా.. మూడో టి20లో టీమిండియా పరాజయాన్ని చవిచూసింది. తొలి రెండు టి20ల్లో నెగ్గి ఐదు సిరీస్‌ను చేజిక్కించుకోవాలన్న టీమిండియా ఆశలపై ఇంగ్లండ్ నీళ్లు చల్లింది. మంగళవారం జరిగిన మూడో టి20లో టీమిండియా 26 పరుగుల తేడాతో అనూహ్య పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను 171పరుగులకే పరిమితం చేసినా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో టీమిండియా నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 145 పరుగులే చేయగల్గింది. ఛేదనలో భాగంగా టీమిండియా బ్యాటర్లు హార్దిక్(40), అభిషేక్(24) మినహా.. మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. తొలి ఐదు వికెట్లను 85పరుగులకే కోల్పోయిన టీమిండియా ఆ తర్వాత రక్షణాత్మక ధోరణితో ఆడి ఓటమిపాలైంది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న టీమిండియా బౌలర్లు ఇంగ్లండ్ బ్యాటర్లను కట్టడి చేశారు. ఓపెనర్ డకెట్(51) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ బట్లర్(24), లివింగ్‌స్టోన్(43) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. 3వికెట్ల నష్టానికి 108పరుగులతో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్‌ను వరుణ్ చక్రవర్తి(5/24) అద్భుత బౌలింగ్‌తో కట్టడి చేశాడు. దీంతో ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 171 పరుగులు చేసింది. హార్దిక్ పాండ్యాకు రెండు, రవి బిష్ణోరు, అక్షర్ పటేల్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. దీంతో ఐదు టి20ల సిరీస్‌లో టీమిండియా 2-1తో ఆధిక్యతలో ఉండగా.. నాల్గో టి20 పూణే వేదికగా శుక్రవారం జరగనుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ వరుణ్ చక్రవర్తికి దక్కింది.

# మణికొండలో అమావాస్య అన్న ప్రసాద వితరణ సేవ



**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 29 జనవరి 2025** తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభకు అనుబంధంగా మణికొండలోని సముద్రాల వాణి రమేష్ ఆద్వర్యంలో అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ సేవకై మణికొండ క్వార్టర్స్ నందు గల పోచమ్మ దేవాలయంలో ప్రసాదం సిద్ధం కావించి అమ్మ వారికి నైవైద్యం సమర్పించిన తర్వాత విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగిన దరిమిలా కార్యక్రమమునకు స్థానిక నాయకులు కందాట రాఘవ రెడ్డి, దొడ్డి లక్ష్మణ్, శ్రీనివాస్, బోడ్డు శ్రీధర్, స్రవంతి, మోహన కృష్ణ, అందె లక్ష్మణ్ రావు, సందీప్, బాబు తదిరులతో పాటు పురజనులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం కావించినారు.

# మినీ మేడారం జాతరకు సంబంధించిన పనులను త్వరగా ముగించాలి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి** జనవరి 29మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ తల్లులను శ్రీ వరుణ్ డ్డి సిఎండి %u+చీూణజూ% గారు దర్శించుకోవడం జరిగింది మరియు మినీ మేడారం జాతరకు సంబంధించిన పనులను త్వరగా ముగించాలని మేడారం జాతరకు ఎటువంటి అంతరాయం రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ అధికారులకు మరియు సిబ్బందికి ఆదేశించడం జరిగింది. అలాగే నూతనంగా నిర్మిస్తున్న 33 కెవి లైన్ ములుగు నుండి మల్లంపల్లి వరకు పరిశీలించడం జరిగింది , వరుణ్ రెడ్డి గారు మాట్లాడుతూ మినీ జాతరకు విద్యుత్ సిబ్బంది అందరూ సన్నద్ధంగా ఉన్నారని జాతరకు ఎటువంటి అంతరాయం రాకుండా జాగ్రత్తలు తీసుకుంటారని తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ బీకాం సింగ్ గారు , ఎస్ ఈ భూపాలపల్లి మల్చూర్ నాయక్ గారు మరియు డి ఈ ములుగు నాగేశ్వరావు గారు డి ఈ ఎం ఆర్ టి సదనందం గారు మరియు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## చదువుతోపాటు క్రీడలను ప్రొత్సహించాలి

## స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ ను సందర్శించిన జిల్లా కలెక్టర్ గౌతమ్





**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనవరి 29:** చదువుతోపాటు క్రీడలను ప్రొత్సహించాలని, క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు.

బుధవారం హకీంపేట్ లోని తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ ను జిల్లా కలెక్టరు గౌతం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ స్పోర్ట్స్ స్కూల్ లో రాకెట్ క్రీడలను ప్రవేశపెట్టి ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కు సూచించారు. టెన్నీస్, బ్యాడ్ మెంటన్, టేబుల్ టెన్నిస్ వంటి రాకెట్ క్రీడలను తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ లో స్పెషల్ ఆఫీసర్ కు కలెక్టరు సూచించారు. స్కూలులో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, వారికి విద్యతోపాటు క్రీడలను ఏవిధంగా నేర్పిస్తూన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూలులో గల విద్యార్థుల తరగతి గదులు, క్రీడల ప్రాక్టీస్ హాలులను, గ్రౌండ్స్, డైనింగ్ హాల్, కలియ తిరిగి పరిశీలించారు. విద్యార్థులకు అందించే మెనూ చార్టును పరిశీలించి మెను ప్రకారం విద్యార్థులను భోనజం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. క్రీడల ప్రాక్టీస్ హాల్ లో పరికరాలను పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసకున్నారు. ఓపెన్ గ్రౌండ్స్ లలో వీక్షకులకు సిట్టింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. తెలంగాణ స్టేట్ స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ సుధాకర్ రావు ప్రస్తుతం స్కూల్ లో 4 వతరగతి నుండి 12వ తరగతి వరకు 430 మంది విద్యార్థులు ఉన్నారని, ప్రతి సంవత్సరం 40 మంది విద్యార్థులను అడ్మిషన్ తీసుకోవడం జరుగుతుందని కలెక్టరుకు తెలియజేసారు. ఉదయం 10 గంటల నుండి 3 గంటల వరకు క్లాసులు జరుగుతాయని, ఉదయం సాయంత్రం క్రీడల ప్రాక్టీసు ఉంటుందని తెలిపారు. మెడికల్ రూంలో మెడికల్ ఆఫీసర్, మెడిసిన్, ఫిజియోథెరపి అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాయువజన క్రీడల అధికారి గోపాల్ రావు, స్కూల్ ప్రిన్సిపల్ ప్రకాష్, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిది

### గద్దర్‌పై బిజెపి ఎంపి బండి సంజయ విమర్శలు కరెక్ట్ కాదు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

హైదరాబాద్ జనవరి 29 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ పాత్ర మరువలేనిదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. గద్దర్‌పై బిజెపి ఎంపి బండి సంజయ విమర్శలను కోమటిరెడ్డి తప్పుబట్టారు. ఊరువాడా తిరిగి తెలంగాణ కోసం ఆయన పోరాడారని గుర్తు చేశారు. గద్దర్‌పై బండి విమర్శలు కరెక్ట్ కాదు అని దుయ్యబట్టారు. బుధవారం కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ ఉన్నాడా? బండి సంజయ్ ఉన్నాడా? అని అడిగారు. ఊరూరు తిరిగి పాటలు పాడి ప్రజలను చైతన్యపరిచిన వ్యక్తి గద్దర్ అని కొనియాడారు. ఆయన చనిపోతే ప్రధాని మోడీ కూడా నివాళులర్పించారని, కేంద్రమంత్రి హోదాలో బండి సంజయ్ అలాంటి వ్యాఖ్యలు చేయకూడదన్నారు.సామాన్యుల నుంచి ఆర్జీలు తీసుకుంటున్నామని, ప్రజలతో మంత్రుల ముఖాముఖి మంచి కార్యక్రమం అని ప్రశంసించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటున్నామన్నారు. నల్లగొండలో బిఆర్ఎస్ మీటింగ్‌కు ప్రజల నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అట్టర్ ఫ్లాప్ అయిందని విమర్శలు గుప్పించారు. పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ నల్లగొండను పట్టించుకోలేదని దుయ్యబట్టారు. నల్లగొండ ప్రాజెక్టులను బిఆర్ఎస్ పడావు పెట్టిందని, 70 శాతం పనులు పూర్తయినా ఎస్ఎల్‌బిసిని బిఆర్ఎస్ ఎందుకు పట్టించుకోలేదన్నారు.300 ఎకరాల్లో నల్లగొండలో మహాత్మాగాంధీ వర్సిటీ ఏర్పాటు చేయించామని, కేవలం ఎన్నికల కోసమే నల్లగొండలో ఐటి టవర్ ఓపెన్ చేశారని ధ్వజమెత్తారు. 300 ఎకరాల్లో నల్లగొండలో మహాత్మాగాంధీ వర్సిటీ ఏర్పాటు చేయించామని, తెలంగాణ కోసం మంత్రి పదవిని వదిలిపెట్టి పోరాటం చేశానని, ఫ్లోరైడ్ నిర్మూలన కోసమే నిరాహార దీక్షలు చేశామన్నారు. అమెరికా నుంచి డైరెక్ట్‌గా వచ్చి కెటిఆర్ ఎంఎల్ఎ అయ్యారని, కెటిఆర్, హరీష్ రావు తన కాలి గోటికి సరిపోరని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ధ్వజమెత్తారు. కెసిఆర్ కొడుకుగా, అల్లుడిగా మీరు రాజకీయాల్లోకి వచ్చారని చురకలంటించారు.

# కుంభమేళ లో జరిగిన తోకిసలాట కు నైతిక బాధ్యత వహిస్తూ సీఎం రాజీనామా చేయాలి

## ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి మహ్మద్ రసూల్



**ఖమ్మం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం)** మహా కుంభమేళాలో తొక్కిసలాట చోటు చేసుకుని పలువురు భక్తులు తమ నిండు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి మహ్మద్ రసూల్ తీవ్ర దిగ్భ్రాంతి చెందారు కోట్లాది మంది హాజరయ్యే ఇటువంటి సందర్భాలలో తొక్కిసలాటలు అవాంఛనీయమైన దుర్ఘటనలు సంభవించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన ముందు జాగ్రత్తలు తీసుకోకపోవడం తీవ్ర విచారకరమని ఒక ప్రకటనలో ఎంపీ కంటెస్టెడ్ అభ్యర్థి మహ్మద్ రసూల్ పేర్కొన్నారు తొక్కిసలాటలో తమ కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఃఖంతో ఉన్న వారిని వెంటనే ఆదుకోవాలని తగిన నష్టపరిహారం చెల్లించాలని గాయపడిన వాళ్లకు మెరుగైన వైద్య సేవలందించాలని ఎంపీ రసూల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు అదేవిధంగా సంఘటన సంబంధించి నైతిక బాధ్యతవహిస్తూ ఉత్తరప్రదేశ్ సీఎం రాజీనామా చేయాలి అని కోరారు

# దళితబంధు సాధన సమితి సంబరాలు

# జమ్మికుంట అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి** డిసెంబర్ 29 హుజురాబాద్ నియోజకవర్గంలోని దళితబంధు రెండవ విడత నిధులు మంజూరు చేయాలనీ ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి ధన్యవాదలు తెలిపిన దళితబంధు సాధన సమితి హుజురాబాద్ నియోజకవర్గం సభ్యులు గత సంవత్సరం కాలం నుండి దళితబంధు రెండవ విడత నిదుల కోసం అలుపెరగని పోరాటం చేసిన సాధన సమితి సభ్యులు హుజురాబాద్ నియోజకవర్గం దళితబంధు నిధులు మంజూరు కావడానికి కృషచేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి కరీంనగర్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు అలాగే హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అలాగే సాధన సమితికి మద్దతు తెలిపారు. నియోజకవర్గం లోని ప్రతి లబ్ధిదారులకు పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నాం ఎన్నో పోరాటాలు ఎన్నో ధర్నాలు ఎన్నో రాస్తారోకోలు అక్రమ అరెస్టులు పోలీస్ కేసులు అన్నింటిని ఆదిగమించి దేనికి భయపడకుండా అనుక్షణం ప్రభుత్వం పై దళితబంధు కోసం పోరాటం చేసిన దళితబంధు సాధన సమితి



కష్టాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వనికి దళితబంధు సాధన సమితి మరియు లబ్ధిదారులు రుణపడి ఉంటామని తెలియజేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వనికి కృతజ్ఞతగా గురువారం ఉదయం 10:00గంటలకు హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో దళితబంధు సాధన సమితి నిర్వహించే పాలాభిషేకం కార్యక్రమం ఉంట్టుంది కావున నియోజకవర్గంలోని ప్రతి ఒక్క లబ్ధిదారులు తప్పకుండ హాజరు కావాలని పిలుపునిస్తున్నాం ఇది మన దళిత జాతి తరుపున కృతజ్ఞతలు తెలుపల్సిన సమయం కావున అందరు హాజరు కావాలి ఈ కార్యక్రమంలో దళితబంధు సాధన సమితి ఇంచార్జ్ కోలుగూరి సురేష్,మంద రాజేష్,కోలుగూరి నరేష్,అకినపల్లి ఆకాష్,ఇనుగాల బిక్షపతి, మహంకాళి రమేష్,సరిగోమ్ముల విజయ్,రామంచ శ్రీకాంత్,చందు, రాజేష్,రత్నాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు

## టి పి టి ఎఫ్ పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పన్నాల గోపాల్ రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిపించండి





**ఖమ్మం ప్రతినిధి జనవరి29 (ప్రజాబలం)** ఖమ్మం నాణ్యమైన ఉచిత విద్య అందించుటకు ప్రభుత్వ పాఠశాలల ను దశలవారీగా సెమి రెసిడెన్షియల్ స్కూల్ గా మార్చి, ప్రైవేటు పాఠశాలలను నిషేధించాలని ప్రధాన ఉద్దేశంతో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలొ పాల్గొంటున్నాం. 2014లో స్పెషల్ టీచర్ల వివరాలను సేకరించిన ప్రభుత్వం 10 సంవత్సరాలు అయినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2019 నుండి స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇచ్చి పెన్షన్ బెనిఫిట్ కు వర్తింప చేసినది, కానీ మన రాష్ట్రములో ఉన్న ఉపాధ్యాయ సంఘాలు కానీ, ఎమ్మెల్సీలు గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేసి పెన్షన్ కు బెనిఫిట్ కల్పించాలని ,317 జీవో వలన ఉపాధ్యాయ, ఉద్యోగులను స్థానిక జిల్లాల నుండి స్థానికేతర ప్రాంతాలకు బదిలీ చేసినప్పటికీ ఎవరు పట్టించుకోలేదు దీని మూలంగా దాదాపు 20 మంది ఉపాధ్యాయులు హార్ట్ ఎటాక్ వచ్చి చనిపోయిన విషయం తెలిసినదే, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు గానీ, ఉపాధ్యాయ సంఘాలు గాని ఉపాధ్యాయ విద్యా సంక్షేమానికి పాటు పడక పోవడం మూలంగా విద్యార్థి దశ నుండి ఉద్యమాలలో పాల్గొన్నాను ఉపాధ్యాయుడిగా ఏపీటీఎఫ్, టి పి టి ఎఫ్ జిల్లా స్థాయి నుండి రాష్ట్ర కార్యదర్శిగా కూడా పని చేసినాను పదవి విరమణ పొందినప్పటికీ ఉపాధ్యాయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటున్నాను అందుకే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేయాలని అధ్యాపక, ఉపాధ్యాయ, తెలంగాణ ఉద్యమకారుల మద్దతో పోటీ చేస్తున్నాను . ఐదు సంవత్సరాలు పనిచేసిన ప్రజా ప్రతినిధులకు ఎమ్మెల్యే, ఎంపీలకు పెన్షన్ మంజూరు చేస్తున్నప్పటికీ 30 సంవత్సరాలకు పైగా ప్రజలకు సేవ చేస్తున్న ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వకపోవడం చాలా విచారకరం సి పి ఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ కొనసాగించాలి. మధ్యాహ్న భోజనం వలన ప్రధానోపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారు వారికి అకాడమిక్ పని మాత్రమే ఉండాలి, మధ్యాహ్నం భోజనానికి ప్రత్యేక వ్యవస్థ





ఏర్పాటు చేయాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు వేతనాలు ఒకటో తేదీ కాకుండా 17 - 20 తేదీలలో వేతనాలు చెల్లిస్తున్నారు . జీరో వన్ జీరో పద్దు పై మొదటి తేదీన వేతనాలు చెల్లించాలని , ఎయిడెడ్, గురుకుల, కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయు లందరికీ జీరో వన్ జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లింపు జరగాలి సమగ్ర శిక్ష ఉద్యోగు లందరినీ రెగ్యులర్ చేయాలి ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలి. విద్యావ్యవస్థను పూర్తిగా ఒకే బోర్డు క్రిందికి తీసుకురావాలి. గత సంవత్సరం నుండి పెండింగ్ లో ఉన్న అన్ని బిల్లులను క్లియర్ చేయాలని , ఈ - కుబేర్ వ్యవస్థను రద్దు చేస్తూ ట్రెజరీ డిపార్ట్మెంట్ ద్వారా బిల్లులను క్లియర్ చేసే పాత విధానాన్ని పునరుద్ధరించి, ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలతో కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పరిష్కారము నకు కృషి చేస్తాము అని అన్నారు . ఈ కార్యక్రమంలో పన్నాల గోపాల్ రెడ్డి , గుండెబోయిన నాగేశ్వరరావు , కాట్ల జగన్నాథం , సుభాని షేక్ తదితరులు పాల్గొన్నారు

# మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన మాస్టర్ మైండ్స్ స్కూల్స్ అధినేతలు



ప్రజాబలం ప్రతినిధి ఉప్పల్ నియోజకవర్గం జనవరి 29:విదేశాల్లో పర్యటించిన తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీదర్ బాబు ను మాజీ సైనికుడు, యూత్ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శి సంతోష్ రెడ్డి, మాస్టర్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేతలు సుధాకర రెడ్డి, హరిబ్రహ్మం, రామకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, అభిజిత్, భాను ప్రకాష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించినట్లు తెలిపారు. విదేశీ పర్యటనలో అనేక ముఖ్యమైన కంపెనీ లతో,ఒప్పందాలు కుదుర్చుకుని, రాష్ట్ర అభివృద్ధికి గర్వకారణం అన్నారు. విదేశీ పర్యటనలో భాగం గా మొత్తం 1,78,950 కోట్ల పెట్టుబడుల ను తెలంగాణ రాష్ట్రానికి ఆకర్షించడమే కాకుండా 49,500 ఉద్యోగాల భరోసాను కూడా సాధించారని మంత్రి శ్రీధర్ బాబును కొనియాడారు. ఈ పెట్టుబడుల ద్వారా తెలంగాణ రాష్ట్రం ప్రపంచ ఆర్థిక ప్రాధాన్యత కలిగిన అగ్రరాజ్యాలలో బహుళ జాతి కంపెనీల తో భాగ స్వామ్యం గా మారింది అన్నారు. ఈ పర్యటనలో ఎన్నో ప్రముఖ కంపెనీ ల ప్రతినిధులతో మం త్రి సమావేశమై, రాష్ట్రంలో%ు% పరిశ్రమల స్థాపనకు అనువైన పరిస్థితుల గురించి వివరిస్తూ, పారదర్శకతతో కూడిన పాలన, అవలంబ నీయమైన విధానాలను చూపించారు అని తెలిపారు. మంత్రి స్వదేశానికి, స్వరాష్ట్రానికి తిరిగి వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి, ఈ ఘనతను అభినందిస్తూ సత్కరించామని అన్నారు. విజయవంతమైన పర్యటన తెలంగాణ రాష్ట్రానికి ఒక కొత్త మార్గదర్శకంగా నిలవడం తథ్యం అన్నారు.

# గైర్హాజర్ కార్మికులు విధులకు హాజరు కావాలి

## నాగాల పేరిట ఉద్యోగాలు కోల్పోవద్దు

## కేకే - 5 గని మేనేజర్ ప్రవీణ్



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 29 :గైర్హాజరు కార్మికులు విధులకు హాజరు కావాలని నాగాల పేరిట ఉద్యోగాలు కోల్పోవద్దని కేకే 5 గని మేనేజర్ ప్రవీణ్ తెలిపారు. బుధవారం కేకే 5 గని పై గైర్హాజరు కార్మికులకు కౌన్సిలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మేనేజర్ మాట్లాడుతూ ఏ సంస్థలో లేని విధంగా సింగరేణిలో మంచి వేతనాలు ఉన్నాయని తెలిపారు. కార్మికులకు విధుల వద్ద ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అంతే కాకుండా ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నా ఇతరులకు చెప్పడం ద్వారా పరిష్కారానికి మార్గం దొరుకుతుందని అన్నారు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయంలో నుండి కార్పొరేట్ కార్యాలయం నుండి గైర్హాజర్ కు సంబంధించి సర్కులర్ వచ్చిందని తెలిపారు. దీనిలో భూగర్భ కార్మికులు ప్రతినెల 16 మాస్టర్లు ఉపరి తల కార్మికులు 20 మస్టర్లు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గైహాజర్ కార్మికులకు ప్రతినెల కౌన్సిలింగ్ ఉంటుందని చెప్పారు. తరచూ విధులకు గైర్హాజరు అయి మస్టర్లు లేక డిస్మిస్ అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. దీనితో డిస్మిస్ కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని దీనిని అర్థం చేసుకోవాలని అన్నారు. అనారోగ్యం తో పాటు ప్రమాదాల బారిన పడి గాయాలు మానిన ఒళ్ళు నొప్పులు ఉన్నటువంటి కార్మికులు వారి పరిస్థితిని తనతో పాటు పై అధికారుల దృష్టికి తీసుకు వెళితే కొద్ది రోజులు సర్ఫేస్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. పని లేకుండా విధులకు గైహాజరవుతూ అటు వారి కుటుంబాల కు ఇటు సింగరేణి సంస్థకు భారం కావద్దని విజ్ఞప్తి చేశారు. గైహాజర్ కార్మికు లు విధులకు హాజరయ్యేందుకే ఈ అవగాహన కౌన్సిలింగ్ కార్యక్రమాన్ని చెప్పారు. వారిలో మార్పు వచ్చి విధులకు హాజరయ్యే వరకు కౌన్సిలింగ్ కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రక్షణాధికారి రమేష్ సంక్షేమ అధికారి మాస్కుల కార్తీక్, ఆఫీస్ సూపరిన్ టెండెంట్ బుచ్చయ్య గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి గాండ్ల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 29మందమర్రి పట్టణంలో మున్నూరు కాపు సంఘం నూతన క్యాలెండర్ ను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు మిట్ట లక్ష్మణ్ పటేల్, చీట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి పార్వతి రాజిరెడ్డి యువజన అధ్యక్ష కార్యదర్శులు రాకం సంతోష్ గాండ్ల సంజీవ్ ఉపాధ్యక్షులు మిట్ట సూర్యనారాయణ దాసరి జనార్ధన్ తేంద్ర శ్యామ్ మాదాసు కుమార్ నల్లుల వెంకటేష్ రామిడి కుమార్ కోల శ్రీనివాస్ పోలు శ్రీనివాస్, పడారి శ్రీధర్, సకినాల శంకర్, గాండ్ల రవి గాండ్ల సదానందం, తోట సురేందర్, ఆర్టిఏ వేణు సంతోష్, తుపాకుల శ్రీనివాస్, సాతిని శ్రీనివాస్, బొలిశెట్టి రాజన్న, ఎం శ్రీనివాస్, మేడిపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి సాఫ్టుబాల్ అండర్ 14బాల బాలికల క్రీడోత్సవాలను ప్రారంభించిన జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ



గజ్వేల్ నియోజకవర్గం జనవరి 29 ప్రజాబలం ప్రతినిధి :- ఒలింపియా ఇంటర్నేషనల్ స్కూల్, తూప్రాన్ క్రీడా మైదానంలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ అండర్ 14 బాల బాలికల క్రీడోత్సవాలు నేడు ప్రారంభం అయ్యాయి.
ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాధికారి శ్రీ రాధా కిషన్ హాజరయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రమేష్ గంగాల సభాధ్యక్షులుగా వ్యవహరించారు. విశిష్ట అతిథిగా మండల విద్యాధికారి పర్వతి సత్యనారాయణ. జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు పేట మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు అథ్లెటిక్ అసోసియేషన్ మెదక్ జిల్లా కార్యదర్శి మధుసూదన్ క్రీడోత్సవాల పరిశీలకులు గంగమోహన్ రవికుమార్టోర్నమెంట్ కోఆర్డినేటర్ శ్యామ్ సుందర్ శర్మ పాల్గొని మాట్లాడారు.టోర్నమెంట్లో ఉమ్మడి పది జిల్లాలలో హైదరాబాద్ మినహా మిగతా జిల్లాల నుండి 300 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్,మేనేజర్లు పాల్గొన్నారు.
కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు, మాధవరెడ్డి, గోవర్ధన్, చంద్రమోహన్, మాలతి, లతిఫా ఉన్నిస, పద్మ, సరోజినీ,దేవేందర్ రెడ్డి,శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యంలో మీడియా కీలక రంగం కలెక్టర్ క్రాంతి వల్లూరు



ప్రజాబలం సంగారెడ్డి ప్రతినిధి జనవరి29 ప్రజాస్వామ్యంలో మీడియా రంగం అత్యంత ప్రాధాన్యత కలిగినదని, ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజాస్వామ్యానికి మూలస్తంభం మీడియా అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ లో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ 2025 డైరీని కలెక్టర్ క్రాంతి వల్లూరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు, పాలకులకు వారధిగా ఉంటూ ఎప్పటికప్పుడు సమాచారం అందించడం గొప్ప విషయమని తెలిపారు. టెక్నాలజీకి అనుగుణంగా మీడియా రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకొని రిపోర్టర్లు పనిచేస్తున్నారని మెచ్చుకున్నారు. సమాజం కోసం నిరంతరం పనిచేస్తున్న విలేకరులు ఆదర్శప్రాయులని కొనియాడారు. ఈ సందర్భంగా అందరినీ పలకరించి, మీడియా రంగంలో వస్తున్న మార్పులు, సమస్యల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. జర్నలిస్ట్ డైరీలో జిల్లాకు సంబంధించిన జిల్లా జర్నలిస్టు ప్రతినిధుల, ఫోటో జర్నలిస్టు వీడియో జర్నలిస్టుల, జిల్లా అధికారులు, పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ల మంచి సమాచారంతో రూపొందించిన అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సాయినాథ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ సలహాదారుడు సునీల్, గౌరవ అధ్యక్షులు శంకర్రావు, ఉపాధ్యక్షులు ఎర్ర. వీరేందర్ గౌడ్, రాజ్ కిషోర్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి నాగభూషణం, అసోసియేషన్ సభ్యులు, పుండరీకం, లక్ష్మణ్, నర్సింలు, సంగమేశ్వర్, రాజేష్, బక్కప్ప, ప్రవీణ్, అంజిరెడ్డి, సకినాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి: హైదరాబాద్ పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో రాంకోట శ్రీ శక్తి గణపతి దేవాలయంలో అమావాస్య అన్నప్రసాద కార్యక్రమానికి హాజరయిన కాంగ్రెస్ నాయకులు సంతోష్‌గుప్తా తదితరులు

# పులిగుండల ప్రాజెక్టు కు సందర్శకులు పెంచేలా చర్యలు

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**

**ప్రకృతి సోయగంతో కనువిందు చేస్తున్న పులిగుండల ప్రాజెక్టు ఎకో టూరిజంను ఫిబ్రవరి నుండి ప్రారంభానికి సన్నాహాలు**

**అడవులను, ప్రాణవాయివు ఇచ్చే ప్రకతిని మనం కాపాడుకోవాలి**

**అడవి మార్గంలో కాలినడకన పులిగుండల ప్రాజెక్టు ను సందర్శించిన జిల్లా కలెక్టర్**



ఖమ్మం ప్రతినిధి జనవరి 29 (ప్రజాబలం) ఖమ్మం పచ్చని అడవి, ఆహ్లాదకరమైన వాతావరణంలో కనువిందు చేస్తున్న పులిగుండాల ప్రాజెక్టు ను ఎకో టూరిజం ప్రాంతంగా ఫిబ్రవరి నుండి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టుతున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.
బుధవారం జిల్లా కలెక్టర్, సత్తుపల్లి డివిజన్ తల్లాడ పరిధిలోని కనకగిరి రిజర్వ్ ఫారెస్ట్ పులిగుండల ప్రాజెక్ట్ ను ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ లతో కలిసి పరిశీలించారు సుమారు 5 కిలోమీటర్లు అడవిమార్గం గుండా కాలినడకన గుట్ట పైకి ఎక్కి పులిగుండాలను కలెక్టర్ సందర్శించారు ఎకో టూరిజం ప్రణాళికలో భాగంగా కలెక్టర్ కమాండర్ జీపులో ప్రయాణించి పచ్చని సోయగంతో ఉన్న అటవీని సంరక్షిస్తూ ఇక్కడ ఆహ్లాదకరమైన పరిస్థితులు ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ కోసం మొత్తం ఏరియాని పరిశీలించారు. పాలపిట్ట ఓరియల్ టవర్ ఎక్కి బైనాక్యులర్ ద్వారా చుట్టుపక్కల ఏరియల్ వ్యూ కలెక్టర్ చూశారు ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కువగా మనకు ప్రకృతి పరంగా అందమైన గుట్టలు, చెరువు, గుట్టల నుండి జాలూవారే నీళ్ల తో అడవిని పర్యాటక రంగంగా అభివృద్ధి చేసుకోవాలని, దీనివల్ల ఆర్యోగమనే సంపద వస్తుందని అన్నారు. రానున్న తరాలకు పర్యాటక ప్రాంతంగా తీసుకొని వచ్చి ప్రకృతిని కాపాడుతూ, అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రకృతిని కాపాడుకోలేక మనకు అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని దానిని నివారించేందు కు అభివృద్ధి చేపట్టామన్నారు.



పులిగుండల ప్రాజెక్టు లో ఆహ్లాదం పంచే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేసి సందర్శకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు పర్యాటకుల కోసం చెరువులో బోటింగ్, వసతి కాటెజ్ లు, భోజనం, త్రాగునీరు వసతులను కల్పిస్తున్నామని అన్నారు. ప్రతి ఒక్కరూ కుటుంబం, పిల్లలతో సందర్శించి ఆనందంగా గడిపేలా కార్యక్రమం తయారు చేస్తామని అన్నారు. చెరువులో సంచరించే పక్షులు, పులిగుండల చరిత్ర చెప్పే విధంగా వినూత్న కార్యక్రమాల నిర్వహణకు గైడ్ లు కూడా అందుబాటులో ఉంటారని అన్నారు. పిల్లలకు సైక్లింగ్, ఓపెన్ జిమ్, అడ్వెంచర్ యాక్టివిటీస్ వంటివి అభివృద్ధి చేస్తామని కలెక్టర్ తెలిపారు ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, అటవీ అభివృద్ధి అధికారిణి మంజుల, అటవీ రేంజ్ అధికారి జి. నాగేశ్వరరావు, అటవీశాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించాలి

### సబ్ కలెక్టర్ సభావాత్ మోతిలాల్



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 29 :వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించాలని ఆ దిశగా మహిళలు ముందుకు వెళ్లాలని మంచిర్యాల జిల్లా సబ్ కలెక్టర్ సభావాత్ మోతిలాల్ అన్నారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని రైతు కేంద్రంలో ఏర్పాటు చేసిన వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో అక్షర వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే కానిదంటే ఏమీ లేదని సంకల్ప దీక్షతో వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యతను సాధించి రాష్ట్రంలోనే నెంబర్ వన్ మండలంగా నిలపాలని ఆయన అన్నారు. కాసిపేట మండల ఐకెపి, అంగన్వాడి, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమం కొనసాగాలని



ఆయన కోరారు. జిల్లా వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి అజ్మీర పురుషోత్తమ నాయక్ అధ్యక్షత వహించారు. విద్యా ఆవశ్యకతను వివరిస్తూ సాంస్కృతిక సారధి కళాకారులు పాడిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి ఎస్. కిషన్, సిపిఓ దొంతినేని వెంకటేశ్వరరావు, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మంచిర్యాల ఆర్డిఓ శ్రీనివాసరావు, సిడిపిఓ స్వరూప రాణి తహసిల్దార్ భోజన్న ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి క్వాలిటీ కోఆర్డినేటర్, డి.ఆర్.పి లు బి. శాంకరి, కొండు జనార్ధన్, ఎర్ర సువర్ణ, సుమన్, కో-ఆర్డినేటర్ లు , సంధ్య, ధనలక్ష్మి అంగన్వాడీ, ఐ. కె. పి కార్యకర్తలు పాల్గొన్నారు.


## వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించాలి

### సబ్ కలెక్టర్ సభావాత్ మోతిలాల్




ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జనవరి 29 :వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యత సాధించాలని ఆ దిశగా మహిళలు ముందుకు వెళ్లాలని మంచిర్యాల జిల్లా సబ్ కలెక్టర్ సభావాత్ మోతిలాల్ అన్నారు. బుధవారం కాసిపేట మండల కేంద్రంలోని రైతు కేంద్రంలో ఏర్పాటు చేసిన వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో అక్షర వాలంటీర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తలుచుకుంటే కానిదంటే ఏమీ లేదని సంకల్ప దీక్షతో వంద రోజుల్లో వంద శాతం అక్షరాస్యతను సాధించి రాష్ట్రంలోనే నెంబర్ వన్ మండలంగా నిలపాలని ఆయన అన్నారు. కాసిపేట మండల ఐకెపి, అంగన్వాడి, రెవెన్యూ శాఖలు సమన్వయంతో ఈ కార్యక్రమం



కొనసాగాలని ఆయన కోరారు. జిల్లా వయోజన విద్య ప్రాజెక్ట్ అధికారి అజ్మీర పురుషోత్తమ నాయక్ అధ్యక్షత వహించారు. విద్యా ఆవశ్యకతను వివరిస్తూ సాంస్కృతిక సారధి కళాకారులు పాడిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ పిడి ఎస్. కిషన్, సిపిఓ దొంతినేని వెంకటేశ్వరరావు, బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, మంచిర్యాల ఆర్డిఓ శ్రీనివాసరావు, సిడిపిఓ స్వరూప రాణి తహసిల్దార్ భోజన్న ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి క్వాలిటీ కోఆర్డినేటర్, డి.ఆర్.పి లు బి. శాంకరి, కొండు జనార్ధన్, ఎర్ర సువర్ణ, సుమన్, కో-ఆర్డినేటర్ లు , సంధ్య, ధనలక్ష్మి అంగన్వాడీ, ఐ. కె. పి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలి.

### జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.





ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. బుధవారం రోడ్డు భద్రత మాస ఉత్సవాల్లో భాగంగా, స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి శివాజీ చౌక్ (మంచిర్యాల చౌరస్తా) వరకు వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ మిని స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. రవాణా శాఖ అధికారులు కలెక్టర్ కు పూల మొక్కతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలందరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించే విధంగా విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి నిర్మల్ ను రోడ్డు ప్రమాదాల రహిత జిల్లాగా మార్చాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 26 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాల నియంత్రణ చర్యలను చేపట్టడం ద్వారా 23 ప్రమాద రహిత ప్రదేశాలుగా మార్చినట్లు తెలిపారు. హెల్మెట్ లేని డ్రైవింగ్, సీట్ బెల్ట్ లేని ప్రయాణం,మైనర్ డ్రైవింగ్ వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. పోలీసు శాఖ సహకారంతో ఎప్పటికప్పుడు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. భద్రత నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు కి కచ్చితంగా వాహన బీమా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే, బాధిత కుటుంబాలకు బీమాతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించి, వాహనదారులందరికీ బీమా,లైసెన్స్ కలిగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 'గిఫ్ట్ ఎ హెల్మెట్' అనే కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలు వేడుకలు, పండుగలలో బహుమతులు, మిఠాయిలకు బదులుగా సోదరులకు హెల్మెట్ లను బహుమతిగా ఇవ్వాలి అన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి కలెక్టర్,ఇతర అధికారులు కలిసి హెల్మెట్ లను అందజేశారు.జెండా ఊపి వాహనాల ర్యాలీని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులచే రోడ్డు భద్రత పై అవగాహన కలిగించేలా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్పి జానకి షర్మిళ, అదనపు ఎస్పీలు రాజేష్ మీనా, ఉపేంద్రారెడ్డి లు, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలి,ఆటో యునియన్ అధ్యక్షులు మల్లేష్, నిర్మల్ పట్టణ తహసిల్దార్ రాజు,డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, సహాయ మోటార్ వెహికల్ ఇన్స్ పెక్టర్లు,ఎన్సీసీ విద్యార్థులు,డ్రైవర్లు, ఇతర అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

## ప్రజా యుద్ధ నౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం కేంద్రమంత్రి బండి సంజయ్ కి తగదు

### అడ్వకేట్ జగన్ మోహన్,బిఎస్పీ నిర్మల్ జిల్లా ఇంచార్జీ



ప్రజాబలం ప్రతినిధి నిర్మల్ జిల్లా.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ప్రజాయుద్ధనౌక గద్దర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతున్న విధానం సమంజసం కాదని బిఎస్పీ నిర్మల్ జిల్లా ఇంచార్జీ అడ్వకేట్ జగన్ మోహన్ అన్నారు. భారతదేశ తొలి ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి పదవిని సైతం కించపరిచే విధంగా ఉన్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్థాయికి తగదని అన్నారు,విచక్షణారహితంగా మాట్లాడడం సరైంది కాదని జగన్ మోహన్ విమర్శించారు,ప్రత్యేకించి ఒకటే పార్టీకి సంబంధించిన వారికి ఇవ్వాలి అని చెప్పేసి రాజ్యాంగంలో ఉందా అని ప్రశ్నించారు!రాజ్యాంగము పై ప్రమాణము చేసి,రాజ్యాంగ స్పూర్తికి విరుద్ధంగా మాట్లాడడం కేంద్రమంత్రి స్థాయికి తగదని అన్నారు, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రతి ఒక్కరిని చైతన్యపరిచి చరిత్ర గద్దర్ గారిది అని కొనియాడారు,పద్మశ్రీ అవార్డులను,పద్మ విభూషణ్ అవార్డులను పారదర్శకంగా చేపట్టాలి కాని వివాదాలకు దారి తీసే విదంగా కేంద్రమంత్రి వైఖరి ఉన్నదని జగన్ మోహన్ విమర్శించారు

## జన జాతరగా వనదుర్గా మాత సన్నిధి

### దుర్గామాతనుదర్శించుకున్న జిల్లా అదనపు కలెక్టర్, ఎస్పీ లు



మెదక్ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి :- తెలంగాణ రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన ఏడుపాయల వన దుర్గ మాత సన్నిధి మాఘ అమావాస్యను పురస్కరించుకొని జన జాతరగా మారింది. రాష్ట్రంలోని పలు జిల్లాల నుండే గాక మహారాష్ట్ర కర్ణాటక రాష్ట్రాల నుండి భారీ ఎత్తున భక్తులు చేరుకొని వేకువ జాము నుండే మాఘస్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నాగేష్, జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి దుర్గామాత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. సింగూరు ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేయడంతోభక్తుల సౌకర్యార్థం షవర్ బాత్ లను ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. టి ఎస్ ఆర్ టి సి బస్సులు పలు పట్టణాల నుండి ఏడుపాయలకు ఏర్పాట్లు చేయడం జరిగింది.అనంతరం ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో పోలీస్ , ప్రత్యేక దళాలతోబందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## మున్సిపల్ రచ్చ....

కరీంనగర్, జనవరి 29, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం గడువు ముగిసింది. ముగింపు సందర్భంగా కార్పొరేటర్లకు కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ సన్మానం ఏర్పాటు చేయగా బిఆర్ఎస్ కార్పొరేటర్ నిరసన ఆందోళన స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. ఐదేళ్ళ పాలనలో విమర్శలు, ఆరోపణలు చేసుకోవడం సహజమే అయినా చివరి సమావేశం రోజున ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని పదవి కాలం ముగిసిన రోజున కలిసిపోతుంటారు.రాజకీయంగా నొప్పించే విధంగా మాట్లాడినట్టయితే క్షమపణలు చెప్పుకుని తమ పదవి కాలంలో జరిగిన అనుభవాలను నెమరువేసుకోవడం సహజం. కానీ కరీంనగర్ కార్పొరేషన్ చివరి సమావేశం రచ్చరచ్చగా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.మేయర్ వై.సునీల్ రావు నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ ను వీడి బిజెపిలో చేరడంతో బిఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన ఆందోళన వ్యక్తం చేశారు. మేయర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మహిళా కార్పొరేటర్ భర్తలను సమావేశంలోకి అనుమతించకుండా గేటు వద్దనే పోలీసులు అడ్డుకోవడం పై నిరసన తెలిపారు. నిరసన ఆందోళనతో మహిళా కార్పొరేటర్ ల భర్తలను సమావేశంలోకి అనుమతించారు.కాషాయ కండువా వేసుకుని మేయర్.. కార్పోరేటర్‌లను సన్మానించడాన్ని వ్యతిరేకించారు. సాంప్రదాయ పద్దతిలో మేయర్ గౌను వేసుకోకుండా కాషాయ కండువా కప్పుకుని సన్మానం చేయడం అవమానకరంగా భావిస్తు సమావేశం నుండి బిఆర్ఎస్ కార్పోరేటర్ లు వాకౌట్ చేశారు.కార్పొరేషన్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. సాంప్రదాయాన్ని మేయర్ కాలరాస్తున్నాడని కాషాయ కండువా వేసుకొని సన్మానించడాన్ని వ్యతిరేకించామని మాజీ మేయర్ రవీందర్ సింగ్ తెలిపారుమేయర్ వై.సునీల్ రావు బిఆర్ఎస్ ను వీడి బిజెపిలో చేరడంతో బిఆర్ఎస్ కార్పోరేటర్ లు నిరసన మధ్య కౌన్సిల్ చివరి సమావేశం అట్టుడికింది. పదవి కాలం ముగింపు సందర్భంగా కార్పొరేటర్ ల సన్మానానికి సమావేశాన్ని పరిమితం చేయగా మేయర్ తీరును నిరసిస్తూ బిఆర్ఎస్ కార్పొరేటర్లు నిరసన ఆందోళన వ్యక్తం చేసి సన్మానాన్ని బహిష్కరించారు.బిఆర్ఎస్ తీరు నచ్చక అభివృద్ధి బిజేపి ద్వారానే సాధ్యమని బిజేపి లో చేరితే ఎమ్మెల్యే మెప్పు కోసం కొందరు అలజడి సృష్టించారని మేయర్ విమర్శించారు. ఎవరు ఏమనుకున్నా, గడిచినా ఐదేళ్ళలో మునుపెన్నడు లేనంతగా అభివృద్ధి చేశామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మెజార్టీ డివిజన్ లను బిజేపి కైవసం చేసుకుని కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరవేస్తామని మేయర్ స్పష్టం చేశారు.బిఆర్ఎస్ బిజెపి మధ్య పార్టీ ఫిరాయింపు వార్ జరుగుతుండగా కాంగ్రెస్ ఎంఐఎం కార్పొరేటర్ లు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేశారు. రాబోయే ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను గెలిచి కార్పోరేషన్ కైవసం చేసుకుంటామని కాంగ్రెస్ కార్పొరేటర్లు అంటే, తమ మద్దతుతోనే ఎవరైనా మేయర్ అవ్వడం లేదా తామే మేయర్ కావడం జరుగుతుందని ఎంఐఎం కార్పొరేటర్ లు అన్నారు.ఏనాడూ లేని విధంగా కరీంనగర్ కార్పోరేషన్ కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున మోహరించిన పోలీసు బలగాల నడుమ చివరి సమావేశం, సన్మానాన్ని మున్సిపల్ అధికారులు నిర్వహించారు. పోలీసుల తీరు, మున్సిపల్ అధికారుల వైఖరిపై బిఆర్ఎస్ కార్పోరేటర్ లు ఆందోళన వ్యక్తం చేశారు.కొత్త సాంప్రదాయానికి ఈ కౌన్సిల్ సమావేశం తెరలేపిందని అభిప్రాయపడ్డారు. కౌన్సిల్ పాలకవర్గం గడువు ముగుస్తున్న తరుణంలో మేయర్ పార్టీ మారడం, చివరిది సమావేశం సాంప్రదాయానికి విరుద్ధంగా నిర్వహించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## జూన్ లోగా అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

అమరావతి జనవరి 29 జూన్ లోగా అన్ని నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. పార్టీని నమ్ముకున్న వారికే పదవులు దక్కేలా చూసే బాధ్యత ఎమ్మెల్యేలదేనని సిఎం సూచించారు. మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్ చార్జులతో టిడిపి అధినేత, సిఎం చంద్రబాబు నాయుడు టెలీ కాన్ఫరెన్స్ లో మాట్లాడారు. త్వరలో 214 మార్కెట్ కమిటీలు, 1100 ట్రస్ట్ బోర్డులకు నియామకాలు ఉంటాయని తెలియజేశారు. కష్టపడిన నేతలు, కార్యకర్తలకు న్యాయం చేసేలా నామినేటెడ్ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. 2029 లో మళ్లీ గెలిచేలా ప్రతి ఒక్కరి పనితీరు ఉండాలని కోరారు. ఎన్నికల హామీల్లో ఇచ్చిన పథకాలన్నీ అమలు చేస్తామని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదులో బాగా పనిచేసిన వారికే పదవులు ఇస్తామని చంద్రబాబు చెప్పారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com